ఉపనిషద్ద్వయము



ఓం నమో భగవతే వాసుదేవాయ

ఈశావాస్య — మాండూక్యములు

అను

ఉపనిషద్ద్వయము

[ఆంధ్ర వ్యాఖ్యానము]



మహాకవి:

శ్రీ కాశీభట్ట కృష్ణరాయప్రోక్తము

[వెల 2

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

ఈశావాస్యోపనిషత్

ఓమ్ పూర్ణమదః పూర్ణమిదమ్ పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే.
ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఈ ఈశావాస్యోపనిషత్తు సర్వోపనిషత్తులకును శిరోమణి భూత మని ప్రాచీనకాలమునుండి సాంప్రదాయికముగ చెప్పుకొనుట గలదు. అల్పాచ్‌తరము పూర్వనిపాతము గావలయు ననెడి వ్యాకరణ సూత్రాన కిందు లేదు. అభ్యర్హితత్వమును స్వీకరింపనక్కరలేదు. వది ఎట్లయినను; ఈ యుపనిషత్తు సర్వప్రథమము. మహావాక్యములలో ఋగ్వేదాది క్రమమున గ్రహించినట్లు ఈయుపనిషత్తును గ్రహింతమన్న రెండవ స్థాన మీయవలయును. స్థానవ్యామోహమును పాటించినయెడల "మాండూక్య మేకమేవాలం" అనెడు సంప్రదాయమునుబట్టి మాండూక్యమునకు ప్రథమస్థాన మిత్తమన్న ఆ మాండూక్యము అథర్వాణిక మగుటచే చరమస్థానికము కావలసివచ్చును. స్థానాలంబనమును స్థాన భ్రంశమును పొందుటకంటె సంప్రదాయమును మన్నించుట సమంజస మని తోచెడిని. సాంప్రదాయికముగా ఈశావాస్యమే ప్రథమము. ఈ యుపనిషత్తునకు ప్రథమత్వము పాఠక్రమమునుబట్టియేగాక అర్థ క్రమమునుబట్టియు నిర్వహింపవలయును. ఈ యుపనిషత్తునందు; జీవ నిపద మగు తత్త్వమును తద్గ్రహణోపాయమును చక్కగ నిరూపింప బడెను. ఇందు పదునెనిమిది మంత్రములు గలవు. ఈ మంత్రసంఖ్యలోను మతభేదమున్నను, మంత్రపాఠక్రమమునను మతభేదమున్నను, సంప్ర

భాష్యజ్ఞులు చాలమంది పదునెనిమిదింటినే గ్రహించుటవలన మంత్రసంఖ్యానిర్ణయము సాంప్రదాయికముగా పదునెనిమిది యనుటయే మంచిది. ఈయుపనిషత్తు శుక్లయజుర్వేదమునకు సంబంధించినది. శుక్లయజుర్వేదము, తచ్ఛాఖీయులు, మనకు అప్రసక్తులు; విషయమే ప్రధానము. ఈ యుపనిషత్తునందలి భాషయును దయామయుడై బోధింపదలచిన మహాపురుషుని వాగ్ధోరణిలో నున్నది. ఇందు కథలును రూపకములును మొదలగువాగ్వైదగ్ధ్య ప్రదర్శింపక కేవల శిష్యచిత్తప్రసాదముననే చెప్పబడినట్లు శైలినిబట్టి నిర్ణయింపవచ్చును. మరియును ఉపనిషద్వాఙ్మయము క్షత్రియప్రబుద్ధమనియు బ్రాహ్మణవిరుద్ధమనియు బ్రాహ్మణులుంగూడ క్షత్రియులయొద్ద నేర్చిరనియు, నీ మొదలగు వర్ణాన్యోన్యవైషమ్య బీజస్థాపకములుగ కొందరు విమర్శించిరి. అదితప్పు. జగద్వ్యాపారవిషయమునందు షోడశకర్మవ్యవహారములయందు తద్వ్యవస్థాపరిరక్షయందు వర్ణాశ్రమధర్మవ్యవహారముసంభవించుట న్యాయ్యముగాని, ఆధ్యాత్మికవిద్యయం దిట్టిభేదముతో సంబంధములేదు. ఈ విద్యావంతులు విద్యావంశమువారై యుందురు. మనుస్మృతియందు విద్యాభ్యాసము ఎవ్వనినుండి ఎవ్వడైనను గ్రహింపవచ్చునని యున్నది. మరియును, ఏవిద్యనైనను పరిరక్షింపవలయునన్న పాలకాశ్రయము కావలసివచ్చును గావున ఉపనిషద్వాఙ్మయమునందలి క్షత్రియులు పాలకక్షత్రియులుగాని, జాతిక్షత్రియులు గారు. మనుస్మృతి మున్నగునవియును పాలకక్షత్రియప్రబుద్ధములై నిలిచెను. ఇంతకును ఆధ్యాత్మిక విద్యావిషయమునం దీభేదమును పెట్టుకొనుట ఆధ్యాత్మికవిద్యాదూరీకరణ దౌర్భాగ్యమే. బ్రహ్మసూత్రములయందును, "హృద్యపేక్షయా మనుష్యాధికారిత్వాత్" అనుప్రకరణము ప్రారంభింపబడెను. అన్నింటను వర్ణాశ్రమ వ్యవస్థాపరిభాష వ్యాపించెననుట నిక్కమేగాని, అది పరమార్థముగాదు. చెట్టులలో చేమలలో రాళులలో రప్పలలో కప్పలలో రత్నములలో

మున్నగు సకలవస్తుజాతమునందు సర్ణవ్యవస్థా పరిభాష వ్యాపించి యుండుట విజ్ఞు లెఱుంగుదురు. అది తాత్త్వికముగాదుగదా! చారిత్రకులకు రచనాకౌతూహలము కలిగించిన కలిగింపనిండు. ఈ యుపనిషత్తునకు అధికారి శమదమాదిగుణసంపన్నుడేగాని యితరుడుగాడు. ఈ యుపనిషత్తునందు ప్రశ్నప్రత్యుత్తర ధోరణిలేదు. చక్కగ ఒకదివ్యబోధము చేసినట్లుండును.

ఉపనిషత్తననేమి? అని పూర్వమునుండియు శంకించుకొని సమాధానములు చెప్పుకొనుచునే యున్నారు. అట్టి శంకాసమాధానముల కవకాశము ఉపనిషత్తులయందే ఉపనిషచ్ఛబ్ద నిర్వచనముండినచో లేకుండును. అట్టి నిర్వచనము లేకపోవుటవలన 'ఉప+ని+షద్‌ల్' అని నిష్పన్నమయ్యెనని చెప్పుకొననలసివచ్చెను. విజ్ఞులంద ఱెఱుంగుదురు. కాని ఉపనిషత్తులలోనే "ఇత్యుపనిషత్" "ఓమ్మిత్యుపనిషత్" ఇత్యాదిగ సర్వోత్కృష్ట బోధనాపారమ్యభావము సూచించునప్పుడు 'ఉపనిషత్' అనివాడుట కలదని వేదవేత్త లెఱుంగుదురు. కావుననే ఉపనిషత్తన రహస్య మని కొందరు నిర్వచించిరి. ఏదియెట్లున్నను ఉపనిషత్తను శబ్దములో మూడుభాగములున్నట్లు కన్పట్టుచున్నవి.

'ఉప+ని+సత్' ఈమూడింటిలో కట్టకడపటి 'సత్' అనుశబ్దము వేదవేదాన్తములయం దున్నతభావ ఘనస్వరూపమును బోధించుటకు స్వీకరింపబడిన పారిభాషిక పదమువలె నిష్పాక్షికదృష్టితో నెట్టివారికి స్ఫురింపకపోదు. ఆ 'సత్' శబ్దమే మొదటిదనియు, అదియే సత్తనియు తదాధారముననే చిదానందములనియు ఆధ్యాత్మికులు వ్యవహరించిరి. తైత్తిరీయమునందు సద్రూపమును త్యద్రూపమును భిన్నభిన్నముగ వర్ణించి యభిన్నముగ సమన్వయించి సత్యము నిరూపింపబడెను. కావుననే సత్యములకు సత్యమనియు నిత్యములకు నిత్యమనియు (నిత్యో

నిత్యానామ్) మున్నగు సన్నిరూపక వాక్యములు గలవు. 'సత్ త్యత్' రూపమే సత్యము. (సత్త్యమ్) సత్యములోని త్యద్ — నిరూపము సత్య బోధకమైన నిత్యమయ్యెను. ఆ నిత్యసత్యస్వరూప నిరూపణ ముపనిషత్తులయందుండుట కావున ఉపనిషత్తనబడెను. (అస్తీతిసత్. నితరాం అస్తీతి నిషత్. ఉప, నిషత్ ఉపనిషత్.) ఈ యభిప్రాయమే యుపనిషత్తులకు కలిగియుండుటవలన బృహదారణ్యకమునందు, "నేత్యాదేశః" అని సర్వనిషిద్ధము బోధింపబడెను. "నేదం యదిద ముపాసతే" "యద్వాచావదతి తన్న బ్రహ్మ" ఇత్యాది నిషేధములును ఉపనిషద్రూపమును బోధించుటకు చెప్పబడినవిగాని తిరస్కరింపబడుటకు చెప్పబడలేదు. కావున నేవిషయము సర్వథా సత్యముగ బోధపడునో ఆవిషయమునకు మించిన యనిర్వచనీయమైన దివ్యస్వరూపము సత్యమని బోధించుటయే యుపనిషత్తుల పని.

ఈయుపనిషత్తునకు ఈశావాస్యోపనిషత్తని పేరు. ఈశోపనిషత్తనియుగూడ వేరొకనామము గలదు. కాని ఉపనిషన్నామ పరిపాటిలో "ఈశకేన" అని యుండుటవలన నీయుపనిషత్తునకు ఈశోపనిషత్తనుట సంప్రదాయోచితమనియును, "ఈశ్" అను శబ్దముయొక్క తృతీయైకవచన రూపము నామావళిలో గ్రహింపబడ లేదనియు నిబ్బరముగ చెప్పకొనవచ్చును. అగుంగాక! ప్రత్యుపనిషత్తునకును శాంతిమంత్రముండి యుండుట యాచారము. దోషమే లేనియప్పుడు శాంతికి ప్రసక్తి లేదు. కావున దోషమేదియో యున్నదని నిశ్చయించి శాంతిని గ్రహింపవలయును.

దోషమేది?

మంత్రపాఠములను జదువునప్పుడు మననము చేయునప్పుడు అక్షరభ్రంశము పదభ్రంశము స్వరభ్రంశము మున్నగునవి కలుగుట

యొకదోషము. శాస్త్రార్థమును గ్రహించుటలో సాధారణముగ స్వాభినివేశానుకూల ప్రయత్నముగ నర్థము చెప్పుకొనుటయు నొకటి. పూర్వాగ్రహము వేరొకదోషము. మూఢవదోషము వాచకముగా సాధనమునకు మాత్రమే గ్రహించి, తనకు సమన్వయించుకొనక ఉపదేశపటుత్వము మాత్రము కలిగియుండుట మరొకదోషము. మంత్రార్థమునందు సందేహములు కలిగినప్పుడు నివారించుకొనుటకు నిష్ఠావ్రతిమాత్రశరణుడు అయి శాంతిమంత్రమును వినుచుట యొండొకదోషము. ఇట్టి ఎల్లదోషములను ఉపశమింపజేసికొనుటకు శాంతిమంత్ర మవశ్యపాఠ్యము. ఈశాంతిమంత్రమునందు తదుపనిషద్భావము సుగమముగ బోధపడుటకునై ఉపక్రమోపసంహార రూపమున ఏకవాక్యతలో ఇముడ్పబడి యున్నది. ఇందలి బోధము పూర్ణబోధమని పిలువబడును. పూర్ణత్వమునందు ఖండత్వ మారోపించుటయే దోషమని చెప్పుచున్నది. తద్రూపము పూర్ణము, ఇదంరూపము పూర్ణము. పూర్ణమునుండి వచ్చినదని వ్యవహరించుకొన్నది పూర్ణము. పూర్ణమని గ్రహించిన దానికంటెను పూర్ణ ముదీర్ణమై యుండును. పూర్ణేతరము ఏదియునుగాదు. అణుప్రసం ధానమై, మహత్త్వమున మహీయమై సకలమునకు సకలమై అఖండముగనుండునది పూర్ణము అని శాంతిమంత్రమున కర్థము. ఈమంత్రాధారముననే యుపనిషత్తునకును అర్థము చెప్పుకొనవలయును. ఈమంత్రము చక్కగ అవగాహన మగునెడల ద్వేషింపదగునది యేదియు నుండదు. సాంఖ్యులనుకొనినట్లు వివేకించిన నీప్రపంచము సర్వము దుఃఖమేఅని దుఃఖరూపమునుగాంచక సర్వము బ్రహ్మమే అను బ్రహ్మరూపమునే శాంతము. మరియును వైరాగ్యమని యొక యాభాసపదము నపార్థముచేసికొని ప్రపంచమున కొందరు వైరాగ్యముతో నైరస్యముతో పెడవిరుపులతో ఈసంసారమింతే 'ఈప్రపంచమింతే తల్లిలేదు తండ్రిలేదు బంధువులు సహోదరులు మొదలగువారు

లేరు మున్నగువాక్యము లేవేవియో యనుకొనెడి వైరాగ్యము వైరాగ్యము గాదు. అందరునుగలరు; అన్నియునున్నవి. కలుగునంతవరకు కలుగును; ఉండునంతవరకు నుండును. ఆకలుగుటయు పూర్ణమే — ఆయుండుటయు పూర్ణమేకాని, ఆకలుగుట, యుండుట, అనువాని కుదీర్ణమై పూర్ణము సర్వాధారమై సర్వము పూర్ణమై యుండుటంబట్టి నాస్తిత్వము నైరాశ్యము, నాశ్రయింపక బుద్ధియోగసంపన్నుడవై మెలగుమని బోధించుచున్నది.

౧. మంత్రము

హరిః ఓమ్. ఈశావాస్య మిదగ్ంసర్వం యత్కించ జగత్యాంజగత్
తేన త్యక్తేన భుంజీథాః మాగృధః కస్యస్విద్ధనమ్.

ఈ మంత్రమునందు సుందరములైన చిన్నచిన్న వాక్యములు గలవు. జగత్తునందలిజగత్తు, జగత్తను యీసర్వమును ఈశావాస్యమై యున్నది. ఈ వాక్య మవగాహనము కాగనే ఆ భగవద్వైశ్వరూపము హృదయంగమముగ బోధపడును. ఇందలి జగచ్ఛబ్దమునందలి అగమాపాయిత్వమును (పోవుచువచ్చుచునుండుననుటను) మార్పులకూర్పే అని యనుటయును నొక్కిమాటుగా మార్చి పరమరహస్యమైన ఈశావాస్యమును నిరూపించుచున్నాడు. ఈప్రపంచమునం దేదియు ననీశముగాదు. అనీశమనగా సంక్షుభితముకాదని యర్థము. ఈ ప్రపంచము సంక్షోభమయముగాదు, సంస్కారవిలాసము. ప్రపంచమునం దెట్టిదియును జాయమాన వర్ధమానాది వికారావస్థ యని చెప్పుకొనుటకంటె జగత్ప్రలనా ప్రకారమని ఈశప్రకారమని సంస్కారప్రకారమని భగవదనుగమనప్రకార

మని అనుకొనదగియుండుట జగద్ధారకమగు ధర్మరూపము గ్రహింపబడి యుండుటయేగాక ఆ ధర్మాధ్యక్షుడీశ్వరుడని తెలియబడును. ఈ సర్వమీశావాస్యమని తనకు తెలియబడకున్న తనకు దీనితో సంబంధమేల యుండవలయు ననుశంక కలుగును. మరియును క్షణభంగురముగా గనుపట్టుచున్న దీనియం దేవగింపు పుట్టనీక ఈశావాస్యత్వమును తాండవింపజేయుచు శ్మశానవాటికయందుగూడ సాక్షాన్నటరాజసుందర నాట్య తాండవాది విలాసవిహారములను కనుగొనవలసినయట్లు సర్వప్రకారములుగ భగవత్తత్త్వము విశ్వరూపముగను ఏకరూపముగను తదతీతయరూపముగను తెలిసికొనవలయునని ప్రారంభమున ప్రతిజ్ఞావాక్యమును చెప్పుచున్నాడు. అట్టిదగుటచే విధువబడిన "త్యాగభావము" తో భోగింపుము అని రెండవవాక్యము నుపదేశించెను. మొదటివాక్యము తత్త్వనిరూపక వాక్యము. రెండవవాక్యము నిరూపితమగుదానిని సమన్వయించుకొను నుపాయబోధకమై ఉపదేశవాక్యముగ గ్రహింపవలయును. ఈ రెండవవాక్యమునందలి 'త్యక్తేన' అను పదము సన్న్యాసపరమా సంసారపరమా అనిశంకింపనక్కరలేదు. ఆసందేహము నివారించుటకే "భుంజీథాః" నీవు భోగింపుము అని చెప్పియున్నాడు. కావున ఇది భోగసాధనాపరము. భోగమెట్లుండవలయునో ఎట్లు భోగించవలయునో స్పష్టపరచెను. ఇందలి భోగశబ్దమునకు సుఖభోగము మాత్రమని యర్థముగాదు. అనుభవింపవలసినదెల్ల భోగవాచ్యమే. వేదాంత విజ్ఞానమునందునుగూడ త్యాగపూర్వకముగనే యనుభవింపవలయును. 'ఓమ్తత్సత్' అని యుపదేశించెదననుకొనుడు. ఆ యుపదేశమునలన గ్రహింపబడినంత గ్రహించి అనుభవించి దానినివిడిచి తదతీతయత్త్వమును నిర్ణయించుకొనవలయును. భగవంతుని సమీపించినవా డెప్పుడును ప్రణవనాదము వినునని యర్థముగాదు. భగవంతు డెప్పుడును ప్రణవనాదము చేసికొనుచుండునని యర్థముగాదు.

ఇదియే 'నేతి' వాదము యొక్క పరమార్థము. అట్లే ఈజగత్తునందును సర్వత్యాగముతో అనుభవము పొందవలయును. ఒకనికి సుఖమే కలిగె ననుకొనుము. ఆ సుఖము త్యాగరూపముతోడనే యనుభవింపవలయును. అదియే ఫలత్యాగపూర్వకానుభవము. ఫలము కలిగినను కలుగకున్నను త్యాగపూర్వకముగ నుండుట అనుసాధన ముపదేశించుచున్నాడు. అట్టివానికి సుఖము కలిగినను స్వప్నప్రాయమే గావున దుఃఖరూపము నుండదు అట్లే సుఖరూపమును ఉండదు. ఈ సుఖదుఃఖద్వంద్వము లన్నియును నీశావాస్యములని మొదటనే ఎరుంగుట వలన తనయనుభవములో సంక్షోభము కలుగదు. ఒకశిశువు రోదనము చేయుచున్నా డనుకొనుము. బాలునికది రోదనమే అయినను శైశవేంద్రియబలాధారమైనదగును (బాలానామ్ రోదనం బలమ్) కావున రోదనానుభవము బలప్రాభవము. అట్లే మరణము నవజన్మకారణము. జన్మము నవనవజీవనకారణము. వృద్ధాప్యమును పౌనఃపున్యముగా నవనవత్వోత్పాదకములు. కావున సర్వము ప్రశస్తమనకమై ప్రకాశమై ప్రభుసమావాస్యమై యొప్పును. ఇందు ఓసాధకా! నీనెత్తిపై యేభారమును లేదు. ఆభారము ఆసారము ఆసంసారము ఆసంభారము ఎల్లదియు నీశావాస్యమే. అట్లగుటవలన ఈశ్వరార్పిత సర్వస్వుడవై యనుభవింపవలసిన దాని ననుభవింపుము. అనుభవింతునా? అనుభవింపనా? యని తహతహ పడకుము. సాధనాబీజమైన త్యాగరూపము చేయుబడెనా? లేదా? యని తహతహపడుము. త్యాగము కార్యము; ఇతరము భోజ్యము. గీతలయందలి "బ్రహ్మణ్యాధాయ కర్మాణి" అనియు "మత్కర్మకృత్ మత్పరమః" అనియు బోధించిన బోధముల మూలమే ఇందు మంత్రరూపమున నిబంధింపబడెను. ఈ రెండు వాక్యములవలన ఈశ్వరుడు జగత్తు జీవుడు సాధకుడు ఈ నానాత్వమున నైక్యము సులువుగ బోధించెను. కాని మరియొక్క విషయము మిగిలెను. దానిని మించ

వలయు వీనినిమించవలయు ననెడు స్పర్ధ సాధారణముగ వర్ధమానుల కుండుటవలన ఆ స్పర్ధ సాధింపదగినదియా? కాదా? ఒకధనికునింజూచి తాను ధనికుడు కావలయుననియు, ఒకబలవంతునిజూచి తాను బలవంతుడు కావలయుననియు, ఈ మొదలగు భావముల సమూహమే స్పర్ధ యనబడును. ఆ స్పర్ధ సర్వథా నిషిద్ధము. ఎవ్వనిసంపదను గూర్చి నీవు కంటగింపకుము. అసూయపడకుము. కాని నీమానసమున నీవు జాగరూకుడవై ఈశ్వరార్పితవృత్తితో అనుభవించుచుండిన ధనిత్వ బలవత్త్వాది సంపదలును స్వయముగ నీకనుభవయోగ్యములగును. ఒకచోరుడు బహుధనవంతుడై నీకగపడెననుకొనుము. ఆధనికత్వము అధనికత్వసాధనము నీకాశ్రయణీయములు గావు. ఆధనమువలన నీకు లాభములేదు. నీవన్ననో జాగరూకుడవై న్యాయ్యసాధనములతో మెలగినచో నంతశీఘ్రముగ గాకున్నను సుస్థిరధనవంతుడవగుదువు. అధనమే ధనము; అభోగమే భోగము. వలన, సర్వమీశావాస్య మగుట బట్టి స్పర్ధాదులు సాధనములుగావు. స్పర్ధవిడిచి ఈశ్వరార్పణ శ్రద్ధతో నుండిన నీవు సాధించినదెల్ల శాశ్వత కళ్యాణమయమై యుండును. విద్యార్థిదశలో ఒకబాలుని మించవలయునని వేరొకబాలుడు తలంచి చదువుటయనునది ప్రోత్సహింపదగినదని కొందరనుకొందురు. అదికల్ల. ఆభావమే అన్యోన్యాక్రమణమునకు నన్యోన్యవినాశమునకు మూల కారణమైనందున ప్రపంచమున ననేకసంక్షోభములు సమరరంగములు రణగుణధ్వనులు బయలుదేరినవి. ఛీ! స్పర్ధయా? వృద్ధిసాధనము? భగవచ్ఛ్రద్ధ, భగవదర్పితబుద్ధి, ఫలత్యాగపూర్వక కరణము, స్వధర్మనిర్వహణము యథోచితముగ గావించుట లోకకళ్యాణ కారకము.

ఈమంత్రము జగద్వ్యాపార నిర్వహణమునకు భూమిక. ఇంక ననంతరము సాధనారూపమును జెప్పుచున్నాడు.

౨. మంత్రము

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ఏవం
త్వయి నాన్యథేతోఽస్తి న కర్మ లిప్యతే నరే॥

తా॥ మొదటిమంత్రములోని మూడు వాక్యములలో సర్వమును ఈశావాస్యమనియు యదృచ్ఛాలాభమున ననుభవింపు మనియు పరాస్వత్వమును అనహింపకుమనియు నుపదేశించుటవలన జడభరతాదుల వలెనొకచో నచంచలముగ పడియుండుటయా? కర్తవ్య మేమైనగలదా? కర్తవ్యమే యుండినచో కర్తవ్యానంతర ఫలము ముఖ్యముగ ననుభోక్తవ్యమేగదా! అనుభోక్తవ్యమగునప్పుడు అనుభోక్తృకర్తృరూపభ్రమణ చక్రమునందు తగులుకొనుటయే పరమార్థమా? అదియే పరమార్థ మగు నెడల నీశావాస్య మగుటవలన కలిగెడులాభ మేమి? ఈశావాస్య మెప్పుడగునో తానుతత్త్వమున నీశావాస్యమేకదా! అదియే తత్త్వమగు నప్పుడు ఈశావాస్యమను ఒక్క వాక్యము చెప్పుటతోడనే మిగిలిన దంతయు నిరాకరింపబడినట్లును, శ్రోతయగు తాను అస్వతంత్రుడైనట్లును, బోధపడునుకదా! అను ననేకసందేహములు పుట్టగ వానిని నివారించుచున్నాడు. తాత్త్వికవాక్యములు తార్కికజ్ఞానక్రీడావిశేషములకుగాదని నిశ్చయించుకొనవలయును. తాత్త్వికవాక్యము తత్త్వాన్వేషణోన్ముఖుని గావించుటకు చెప్పబడెనుగాని తర్కకౌశలప్రదర్శనమునకు చెప్పబడలేదు. కావుననే రెండవమంత్రములో "ఏవంత్వయి". అను ప్రయోగమునందు ఏ మధ్యమపురుషము ఉద్దేశింపబడెనో ఆ మధ్యమపురుషముతోడనే అన్వయింపదగినయట్లు చెప్పుచున్నాడు. కాబట్టి యీ రెండుమంత్రములును ఏకనిర్దిష్టములేగాని జ్ఞాననిష్ఠ యొకటి ఇతరనిష్ఠ మింకొకటి అని విభాగించుట కవకాశము కానరాదు, ఈమంత్రమునందు శత సంవత్సర

ములు కర్మలను జేయుచు జీవింపగోరుము. ఈప్రకారమే నీయందుండును. ఏత దన్యథాప్రకారముగ నుండదు. అట్లని కర్మలేపము నిన్నంటదు. అనెడు సూత్రప్రాయములైన చిన్న వాక్యములు గలవు. ఈవాక్యములలో మొదటివాక్యమునందు జీవుడు స్వతంత్రుడా అస్వతంత్రుడా అనునది నిరూపించెను. కర్మకరణమునందు స్వతంత్రుడై యుండినను కర్మకర్తృత్వమునందు స్వతంత్రుడు కాడని చెప్పియుండెను. జిజీవిషేత్, బ్రతుకుటకు కోరవలయు ననెడివాక్యమును తీసుకొని జీవితమునందు కోరిక గలవాడజ్ఞానియైన నట్టియజ్ఞానిని సంస్కరించుటకు రెండవమంత్రము చెప్పబడినదని యనుకొనుట దుర్ఘటితము. ఎట్టివారికిని జీవిత మిచ్ఛాధీనము కాదని ఎఱుకపడియే యున్నది. ప్రత్యేకముగ గురువులు చెప్పనక్కరలేదు. ఇందలి ఇచ్ఛార్థము ఇచ్ఛాపర్యాయముగాక జీవింపవలయును. అనెడు నర్థమును జెప్పుకొనవలయును. అట్లు చెప్పుకొనకున్న; జీవిత మిచ్ఛాధీనము అనెడు దుర్వాదము సమ్మతింపవలసివచ్చును. కావున ఎంతవరకు బ్రదుకుదువో అంతవరకును ధార్మికుడవై భగవదర్పితవృత్తిత్వమును గోరుమని ఉపదేశించుచున్నది. మరియును ఇచ్ఛకు స్వాతంత్ర్యము బ్రహ్మార్పణమునందు దప్ప నితరమునందు లేదని పరమరహస్యమును దెలుపుచున్నాడు. నడువవలయునని కోరికయున్నను చరణహీనుడు నడువనేరడు. అట్లే ఏకోరికలును కరణవిహీనముగ సిద్ధింపనేరవు. కాని బ్రహ్మజిజ్ఞాస కరణాధీనముగాక స్వయంప్రకాశమగుటవలన నందే ప్రతివారికిని స్వాతంత్ర్యముకలదని బోధించుచున్నాడు. కర్తవై చేయుచు బ్రతుకుము. అనెడు వాక్యమిందు లేదు. కర్తకాక చేయుము అని యుపదేశించుచున్నాడు. గీతలయందును "అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే" అని చెప్పబడియున్నది. అంతేయు నీశావాస్యము గావున కర్త కానగుట పొసగదు. కర్తయే లేకున్న కరణము కర్మము సంభవమా? యని శంకింపనక్కర

లేదు. "ఒడ్డుపడుచున్నది" అను వాక్యములో పడుట అను చైతన్య సంకల్పము ఒడ్డునందు లేకున్నను పడుచున్నది అను వ్యాపారము ఎట్లు నిర్వహింపబడునో అట్లే తాను కర్తగాక కర్మలను చేయవలయును అని విశేషోపదేశమును చేయుచున్నాడు. వైదికోపదేశములయం దిట్టి యలౌకిక బోధము లుండకమానవు. "ద్వంద్వజ్ఞానమువలన భాగ్య కారణకల్పనాదురభివేశమువలన గల్పించుకొనుటకు వీలు లేకున్నను సిద్ధాంతముగ కర్మలనుచేయుచు బ్రతుకవలెను. అని చెప్పుటవలన కర్మ కరణమునందలి ప్రవృత్తియే బోధించుచు కర్తృత్వ నివృత్తి ఈశా వాస్య మను వాక్యద్వారమున బోధించెను. ఇట్టియభిప్రాయమే గీతల యందును గలదు. "కుర్వ న్నాప్నోతి కిల్బిషం" "నజాతు తిష్ఠ త్యకర్మ కృత్" ఇత్యాదివాక్యములుగలవు. చేయబడవలసిన కర్మములను ధార్మికముగ ఈశ్వరార్పణముగ నిర్వహింపుమనుటయే ఈ వాక్యము నకు ముఖ్యతాత్పర్యము. ఈవాక్యమునందు 'ఏవ' 'ఇహ' అను రెండు శబ్దములును సంపూర్ణముగ సాధకకారణోపాయమును సూచించు చున్నవి. ఇందలి కర్మశబ్దము కేవలకర్మపరముగాక ధర్మపరమై యుండును. కర్మేంద్రియ వినియోగములేని కర్మలును కొన్ని గలవు. నిద్ర మొదలగునవి. మరియును ధర్మవిరహితములగు కర్మములు కర్మవాచ్యములు గావు. అతడు గుణవంతుడు అను నప్పుడు గుణశబ్దమునకు సద్గుణ మని యర్థమును చెప్పుకొన వలయునో కర్మలను చేయుచు బ్రతుకు మనునప్పుడును ధార్మి కములగు కర్మలను చేయుచు బ్రతుకు మను నర్థమును చెప్పుకొన వలయును. ఈవాక్యమునం దుండిన 'నూరేండ్లు' అను పదము ఆయు వును నియమించు నుద్దేశముతో చెప్పలేదు. ఎంతవరకు బ్రతుకునో అంత వరకు నని యర్థము; మరణపర్యంతమని యర్థము. అట్లుగాకున్న నూటికి మించిన యాయువు లోకానుభవమునందుండుటబట్టి వాక్యమున కజ్ఞాన

మారోపింపవలసివచ్చును. ఈ వాక్యమునందు ఆయుర్దాయనిర్ణయ మప్రసక్తము గావున నేదియో యొకసంఖ్యను గ్రహించెను. ఆసంఖ్య సాంప్రదాయికము "జీవేమశరదశ్శతం" ఇత్యాది వేదవాక్య సంప్రదాయమునుబట్టి చెప్పబడెను. కొందరు ఫలత్యాగపూర్వక కర్మలను చేయవలయునన్న యర్థముతీసుకొని కామ్యకర్మములయొక్క కర్తవ్యత్వమును నిరాకరింతురు. అదితప్పు. కామ్యకర్మములైనను సద్విషయములగుచో గర్తవ్యములే. అట్లుకాకున్న లోభప్రసక్తికి నవకాశము కల్పించినవార మగుదుము. తటాకారామాదినిర్మాణములు కామ్యకర్మములుగ గ్రహింపబడినను ఆకామ్యకర్మకరణమునందలి కామ్యఫలాసంగము ఈశ్వరార్పణబుద్ధిగలవాని కుండదు. కావున కామ్యకర్మము త్యాజ్యము కాదు. అట్లయగుచో అన్నపానాది స్వీకరణమునకును మన కధికారము లేకపోవలసివచ్చును. పుష్టికామము లేకున్న అన్నభక్షణము పొసగదు. ఆరోగ్యకామములేకున్న ఔషధసేవన ముండదు. ఇట్లున్నయును కామ్యములయ్యు కామ్యమాత్రములుగాక నియతములుగ స్వధర్మములుగ భగవదర్పితవృత్తితో పాటింపవలయును. ధనికునకు తటాకాదులు బలిష్ఠునకు దుర్బలపరిరక్ష, ధనహీనునకు యథాశక్తిసేవ పరోపకారము భూతదయ మొదలగు సకలసద్భావములు సత్కర్మములు కరణీయములై యొప్పెడిని. నైమిత్తికకర్మలనుగూడ విడువరాదు. పర్వదినముల యందుపవసించుట; మహాపురుష సమాగమమున కొన్ని నిత్యకర్మల యుల్లంఘనము, ఆపత్కాలములయందు కొన్ని పరధర్మముల యవలంబనము కర్తవ్యమగుట పొసగును. కావున నిత్యప్రార్థనము ధ్యానము జీవికానిర్వహణకార్యసాధనము. పైతృకకర్మములు దైవికకర్మములు తటాకారామాదికామ్యకర్మములు విడువక యథోచితముగ న్యాయ్యముగ యథాశక్తిగ నిర్వహింపవలయు నన్న పరమగంభీర తాత్పర్యము మొదటివాక్యమునందు గలదు.

రెండవవాక్యము "ఏవం త్వయి స్యాత్" అని ప్రత్యేకముగ గ్రహింపవలయును; నీయందు నిట్లే యగును. అనగా, కర్మనిరాసమును కావించుటయే గాని మరణపర్యంతమును కర్మప్రవృత్తుడవే యుండి తీరును. పై వాక్యములందు చెప్పిన క్రమమే నీయందానుగుణ ముండునని యర్థము. అట్లగుచో ఇక మోక్షము లేదా? జీవన్ముక్తత్వము లేదా? అని శంకింపనక్కరలేదు. పూర్వమే భగవచ్ఛ్రుతి సర్వాత్మత్వము నుపదేశించియున్నది కావున తత్ప్రాప్తియే మోక్షము; జీవన్ముక్తి. ఏతద్విలక్షణముగ ఎవ్వరేమి చెప్పినను అది వాగ్వైదగ్ధి. మరివేరు కాదని "నాన్యథేతో౽స్తి" అని దృఢముగ చెప్పుచున్నాడు. ఇంతకు వేరుగ వేరొక స్థితి నీయందుండదని నిర్ణయించి చెప్పుటచే నిక నైష్కర్మ్యము గగనకుసుమమేనా యని శంకించు వాని సమాధానపరచుటకై యుత్తర వాక్యము ప్రారంభింపబడుచున్నది. "నకర్మణా నాభుక్తం క్షీయతే కర్మ" మన్నట్టు వాక్యతాత్పర్యములు గ్రహించినచో కర్మవలన మోక్షము లేదనియు, కర్మ జన్మకారణ మనియు, కర్మ యనుభవించి తీరవలయు ననియు కర్మబాహాత్మ్యాయుర్భోగ లక్షణమనియు, వినుటవలన కలిగిన సంక్షోభమును నివారించుచున్నాడు. ఔను! ఈశ్వరార్పణబుద్ధి లేక ఇదియంతయు నీశావాస్యమని ఎరుంగక ఎవ డహంకార విమూఢుడై యుండునో యట్టివాడు నైష్కర్మ్యమును పొందనేరడు. అట్టివాడు కర్మచక్రమున నలిగిపోవును. మొదటిమంత్రము నన్వయించుకొనుచు రెండవ మంత్రములోని యుపదేశమును ఆచరణములోనికి పెట్టిన వాని కేకర్మలేపమును లేదు. కావున జన్మాదిబంధములును లేవు. లేపరాహిత్యము వలన పాపమును లేదు. ఇదియే గీతలయందును "కుర్వన్నపి నలిప్యతే" అని స్పష్టముగ చెప్పబడియుండెను. 'న కర్మ లిప్యతే నరే' అను వాక్యమునందలి 'నరే' అను శబ్దమును గ్రహించి వివిధములుగ పెద్దలు వ్యాఖ్యానించుకొనిరి. ఈబోధము సర్వమానవకళ్యాణమునకు గావున

సర్వమానవోద్దిష్టము గావున, మానవవిషయమునందు కర్మలేపముండదు. అని స్పష్టముగ చెప్పియున్నాడు. ఇట్లు చెప్పుటవలన మరియొక గూఢార్థమును గ్రహింపగలుగుచున్నాము. మానవత్వమును గోల్పోయిన మానవుడు, మానవుడు కాడనియు నాస్తికుడు కూడ మానవాకారమున నున్నను మానవుడుకాడనియు మానవేతర ప్రపంచమునకు కర్మలేపమంటుననియు స్పష్టపరచుచున్నాడు. కావుననే స్మృతులందు క్రూరములగు వ్యాఘ్రములను, క్రూరగుణములను వ్యాఘ్రములనే చెప్పెను. కాని మానవలోకమున నట్లుగాక క్రూరగులను రాక్షసులనియే సాధువగు ప్రహ్లాదుడు పుట్టును. అట్లే మానవగుణపరిణామము ననుసరించుము మానవలోకముననే కర్మలేపాభావము కానవచ్చుచున్నది. ఒక అసాధువునకు సాధువు పుట్టుట, ఒకసాధువునకు అసాధువు పుట్టుట కర్మ లేపాలేపములు లేకుండుటను కాని మిగిలిన సృష్టిలో లేదు. ఈరెండు మంత్రములవలన సృష్టియన నేమియో స్రష్టయన నెవ్వరో, సృష్టిస్రష్టల యన్యోన్య సంబంధమును తానెట్లు గ్రహించి నడచుకొనవలెయునో, అట్లు నడుచుకొనుటవలన, గూఢగూఢభావములకు భంగము కలుగదో అను విషయము లెల్ల సంగ్రహముగ సమగ్రముగ ఉపదేశించెను.

౩. మంత్రము

అసుర్యా నామతేలోకా అంధేన తమసావృతాః తాగ్ంస్తే
ప్రేత్యాభి గచ్ఛంతి యే కేచాత్మహనోజనాః

తా॥ పై రెండు మంత్రములయందును బోధించిన విషయమును అవలంబింపకున్న కలిగెడు ప్రత్యవాయము నీమంత్రమునందు సూచించుచున్నాడు. ఈమంత్రములో రెండు వాక్యములు గలవు. అసుర్యములై

అంధములై కేవల తమస్సుచే ఆవరింపబడిన లోకములుకొన్ని గలవని మొదటివాక్యము చెప్పుచున్నది. ఎవరు ఆత్మజ్ఞానవిహీనులై చెడుదురో అట్టివారు మరణానంతరము ఆపై లోకములను పొందుదురు సుమా! యని రెండవవాక్యము గలదు. ఈ రెండువాక్యములలో మొదటివాక్యము, పూర్వచో వ్యాఖ్యాతము గనున్నది. జగత్తునందలి జగత్తు ఈశావాస్యమని మొదటిమంత్రమున చెప్పబడెను. ఈ మంత్రమున అంధతమస్సుచే లోకము లావరింపబడినవి అనునప్పుడా లోకములు మాత్రమీశావాస్యములుగావా? యనెడు వ్యాఘాతము సంభవించును. 'లోక' శబ్దము జగత్పర్యాయమైనను ఇందలిలోకశబ్దము కేవలమాపాధిక పరమై యుండును. గీతలయందును సృష్టియంతయు దైవమనియు ఆసురమనియు విభాగింపబడియున్నది. ఆ యాసురసృష్టియే యీమంత్రమునందలి 'అసుర్యాలోకములు'. శ్వేతాశ్వతరాదిమూఢయోనిజన్మాపన్నత యుపనిషత్తులయందును వర్ణింపబడియుండెను. ఆత్మజ్ఞానమునకు ప్రయత్నముగావింపని మానవుడు నిస్సంశయముగ నధోలోకములకు బోవునని యీమంత్రమునందు చెప్పుచున్నాడు. ఈమంత్రము అదృష్టఫలబోధక వాక్యము. కొన్ని దృష్టఫలములును మరికొన్ని యదృష్టఫలములును నై యుండును. ఈయౌషధమును సేవించిన మండల దినానంతరము మహారోగ్యభాగ్యము కల్గునని చెప్పిన యదృష్టఫలవిశ్వాసమును విడిచి మందు సేవింపనివా డెట్లు చెడునో యట్లే ఆత్మజ్ఞానవిహీనులకు గలుగు నదృష్టఫలమును మరణానంతరమున సూచించుచున్నాడు. మరణానంతర భోగవిషయములు నమ్మమన్నచో మరణపూర్వాస్తిత్వము గూడ నమ్మరానిదై పోవలసివచ్చును. మరియును స్వరూపము లేదనవలసివచ్చును. స్వరూపమే యున్నచో దానియొక్క సత్త్వమున కెప్పుడును భంగము రారాదు. తత్సత్త్వాధిష్ఠానమున విలసితమగు నట్టిదియును కేవలాభాసమని వ్యవహరింపదగదు. అట్లు వ్యవహరించి

నచో నాకలోకము; ఆలోకమునందు నేనున్నాను యీ మొదలగు ననుభవములు విరుద్ధము లనవలసి వచ్చును. అట్లయున్నచో వారు గురువులు మేము శిష్యులము; వారు ప్రబోధించుచున్నారు మాకు ప్రబోధముగలుగు చున్నది యనెడు నీసర్వానుభవము ఆభాసమై మూలచ్ఛేదమునకు పాండిత్యము దిగిపోవును. కావున స్వవచోవ్యాఘాతము లేదు. గీతలయందును "మత్త ఏవ జ్ఞాన మపోహనంచ" అని స్పష్టముగ చెప్పియున్నాడు. అట్లగుటవలన అసుర్యములగు లోకములు గలవు. ఆలోకములీశావాస్యములయ్యు అసుర్యప్రబలములగుటవలన అసుర్యములని వ్యవహరింపబడుచున్నవి. రావణునిహృదయమునందు రాముడున్నను, రక్కసుడని వ్యవహరింపబడకమానడు. ఇంతకును నౌపాధికముగ పందులను కుక్కలను మొదలగు వానిని మన మెఱుంగుదుము గదా! ఆజన్మములే ఆత్మజ్ఞానవిహీనునకు కలుగుననుటలో విప్రతిపత్తి లేశమునులేదు. మరియును, ఉపాధులయందు విలసితమైన చైతన్యమాత్రలక్షణము సర్వసాధారణము. మానవచైతన్య మెట్టిదో వృక్షచైతన్య మట్టిదియు. కాని వృక్షచైతన్యమునకును మానవచైతన్యమునకును జ్ఞానవిషయమే విశేషరూపముగ కన్పట్టుచున్నది. అట్లగుటవలన నీయుపాధులన్నియు లోకములుగ భావించి క్రమక్రమముగ నాత్మజ్ఞానమాత్ర జన్మస్వామ్య (Right by birth) ముగల మానవోపాధియందలి చైతన్యమునకు నాత్మజ్ఞానమే ముఖ్యము. అట్టి యాత్మజ్ఞానము లేకున్న మానవాధోగతికి పోవుననుటలో తర్కవిరోధమును లేదు. కావున ఆత్మజ్ఞానము ముఖ్యము. ఆత్మజ్ఞానమనగనే 'ఆత్మయేది? అనాత్మయేది? నిత్యమేది? అనిత్యమేది?' అని విమర్శించుకొనుటయే, విచారించుకొనుటయే, అని కొందరు నిర్ణయింతురు. ఆనిర్ణయ మాత్మజ్ఞానముకాదు. అదియేయగుచో అంతయు బ్రహ్మమే. అదికాదని గ్రహించినదెల్లయు మిథ్యయే యని రెండువాక్యములను చెప్పి సుళువుగ బ్రహ్మవిద్యోప

దేశము చేయవచ్చును. మరియును ఆత్మ యిదియని ఒకడొకనికి చెప్ప నక్కరలేదు. ఆత్మయే లేకున్న వ్యవహరించుటయే యుండదు. నాశరీరము నశించి నాయాత్మ నిత్యమైయుండిపోవును యని ఆత్మనిత్యత్వము నెరింగి నంతమాత్రమున ఆత్మజ్ఞానము కానేరదు. ఆత్మయన నేది? అనాత్మయన నేది? ఈరెండింటిసంబంధమేలవచ్చెను? అనాత్మనుండి ఆత్మను వేరుపరచుట యెట్లు? వేరని నిర్ణయించుకొన్న వేరగునా? కేవలనిర్ణయముపై నాధార పడియున్నదా? మఱియేదియైనను యుపాయాంతరమున్నదా యని శంకించి నిశితమైన ప్రయత్న మన్నివిధముల గావించుటయే ఆత్మజ్ఞానము. 'అహంబ్రహ్మ' అనిమాత్రము నిర్ణయించుకొన్న, తార్కికముగ బ్రహ్మ మగునని చెప్పుకొన్నను 'అహమసత్' 'అహంశిలా' ఇత్యాది వాక్యము లను నిర్ణయించుకొన్న నసదాదిరూపములు నగునా? అసదాదులకు సత్త్వముండుటయెట్లు? నిర్ణయించుకొన్నను నిర్ణయింపకున్నను సత్తు నకే సత్త్వముగాని యసత్తునకు సత్త్వముండదు గావున కేవలనిర్ణయా ధీన మనుకొనక కేవలవిచారాధీన మనుకొనక వ్యావహారికమునను ప్రాతి భాసికమునను పారమార్థికమునను ఏకాకారతను సమన్వయించుకొను టకు యత్నించుట ఆత్మజ్ఞాన మనబడును. కావుననే మొదట యిది యంతయు నీశావాస్యమని చెప్పి తరువాత త్యాగపూర్వకముగ ననుభ వింపుము; యెవ్వరిధనమును నాశింపకుము. బ్రతుకునంతకాలమును సత్క ర్మాచరణమును గావింపుము; మున్నగు బహూపదేశముల జేయుటవలన "బ్రహ్మసత్యము జగత్ మిథ్య" అను యీరెంటిని విచారించుటమాత్రము ఆత్మజ్ఞానముకాదు. ఆత్మదర్శనము ఆత్మశ్రవణము ఆత్మమననము ఆత్మ ధ్యానము యీమొదలగునవియెల్ల నుపనిషత్తులయం దుపదేశింపబడి యున్నవి. ఈ మహారోగమునకు ఈ మహామకరధ్వజము సంపూర్ణనివార కౌషధము అని ఎరిగినంత, రోగమెట్లు నివారణముకాదో యట్లు "బ్రహ్మ సత్యము జగత్తుమిథ్య" అని ఎరిగినంత మాత్రమున ఆత్మజ్ఞానములవడదు.

కావుననే గీతలయందును "ఉపదేక్ష్యంతి తే జ్ఞానం తత్త్వదర్శినః" అని చెప్ప బడియున్నది. జ్ఞానశబ్దమునకు అవబోధనము అన్న యర్థమే గ్రహించి నచో ఈచిక్కు వాటిల్లును. జ్ఞానమనగా సంయోజక విభాజకశక్తిసర్వథా సమన్వయింపబడుట. అట్టిజ్ఞానము కలుగవలయుననియే యుపనిషత్తులు బోధించుచున్నవి. కాబట్టియే "ఔపనిషదంపురుషంపృచ్ఛామః" అని సంప్రదాయముగలదుగాని "ఔపనిషదంజ్ఞానం" అనిలేదు. ఆస్వరూప మట్టిది కావుననే కేవలజ్ఞానరూపముగ చెప్పుకొనక "సత్యం జ్ఞానం అనంతం" అని వ్యాపకముగ నుండవలయునని యెంచి తైత్తిరీయమునందు వర్ణింపబడెను. ఇంతయేల వేదపరిభాషలో కొన్ని పదములయర్థము వ్యాకర ణాదులచేగాక స్వతో నిర్వచనములచే స్వతఃప్రమాణములై యున్నవి. "వషట్ ఫట్ స్వాహా స్వధా" ప్రముఖశబ్దములు వైదికగమ్యము లెట్లో జ్ఞానశబ్దముగూడ వేదవేద్యమైయుండును. వేదభాషలో చైతన్యలక్షణము నిరూపించునప్పుడు "ప్రాణము అపానము ఉదానము వ్యానము సమా నము" ఇత్యాదిగ బహుళముగ ప్రయోగించుచు "అన" అను ఒకధాతు భాగమును స్వీకరించియుండెను "జ్ఞః" అను శబ్దము ప్రత్యేకముగ ప్రత్య గాత్మకు ప్రయోగింపబడియుండెను. కావుననే ప్రజ్ఞానము బ్రహ్మమని మహా వాక్యములందు చెప్పబడెను. 'జ్ఞః' అను సంజ్ఞకలవానియొక్క లక్ష్యభూత మగునది పరబ్రహ్మమే కావున నేయే ప్రబోధములవలనను సాధనముల వలనను సన్నిహితముగ నత్యంతముగ బ్రహ్మప్రాప్తికారణమౌ దానికి జ్ఞాన మని పేరు. ఈసంప్రదాయము వేదభాషనుబట్టి చెప్పుకొనవలసి యుండును. కావున జ్ఞానమనగా విచారమాత్రముగాదు. విచార ప్రచా రాచరణములు మూడును జ్ఞానాంగములే. అట్టిసందేహమును నివారించు టకే రెండవమంత్రమునందు కర్మలను చేయుచునుండుమని యాదేశించు చున్నది. ధ్యానోపాసనాదులును కర్మవాచ్యములే. ఇట్టిపనులయందు ప్రమత్తుడగువాడు జ్ఞానహీను డనబడును. వాడే ఆత్మహత్య కావించిన

వాడు. అట్టివానికి పందిజన్మమో కుక్కజన్మమో వచ్చునని వేదపురుషుడు శాసించుచున్నాడు. ఈమంత్రమువలన ఆత్మజ్ఞానము యొక్క ప్రాశస్త్యము గ్రహింపబడును.

౪. మంత్రము

అనేజదేకంమనసో జవీయోనైనద్దేవాఆప్నువన్ పూర్వమర్షత్
తద్ధావతోఽన్యానత్యేతి తిష్ఠత్ తస్మిన్నపో మాతరిశ్వాదధాతి॥

తా॥ పైమూడుమంత్రములయందును ప్రతిజ్ఞావాక్యము ఉపదేశవాక్యము ప్రశంసావాక్యము ప్రత్యవాయ వాక్యములను చెప్పి వేదపురుషు డగుటఃబట్టి ఆ మహాదివ్యరసానుభూతినుండి విడివడుట కష్టము గావున రసలోలుపుడై శ్రద్రసమయస్వరూపమును నిరూపించుచున్నాడు. ఇందలివాక్యములు చాల వింతగనుండును. "(1) అనేజత్ (2) ఏకమ్ (3) మనసః జవీయః (4) నదేవాః ఏనత్ అప్నువన్ (5) పూర్వం అర్షత్ (6) తద్ధావతః అన్యాన్ అత్యేతి (7) తిష్ఠత్ (8) తస్మిన్ అపః మాతరిశ్వాచదధాతి." ఈ ఎనిమిది వాక్యములును తత్త్వనిరూపకములై యున్నవి. ఉపనిషదారంభమునందు ఈశః అని పుంస్త్వము వివక్షింపబడి ఈమంత్రమునందు లింగవ్యత్యయముతో వర్ణించుటవలన నన్యోన్యసంబంధము లేదనుకొనగూడదు. లింగవ్యత్యయ మార్షమని సంప్రదాయము. ఆతత్త్వము అనేజత్తు అనగా అచంచలము, అచంచలమని చెప్పుటవలన లోకమున నేది యాశ్రయించినను చంచలమని యందర యనుభవములో నున్నది. కాని యిదిమాత్ర మాశ్రయింపబడిన నెన్నడును చలించునది కాదు. గీతలయందును స్వల్పమైనను

మహాభయమునుండి రక్షించునని చెప్పియున్నాడు. ఏది తెలియబడిన మరిసందేహముండదో ఏ ఏకవిజ్ఞానమువలన సర్వవిజ్ఞానము సంభవమో యా దివ్యతత్త్వ మచంచలమైయున్నదని తన్నిత్యస్వరూపమును వర్ణించెను. మహాపర్వతాదులు అచంచలములైన ట్లనుభవింపబడుచున్నవి. అట్టి యచాంచల్యముగాక ఏకమైన, యచాంచల్యమని పునర్విశేషణముచే విశేషించి చెప్పుచున్నాడు. ఇందలి ఏకశబ్దము కైవల్యమై పూర్ణమై అఖండమై యుండునది. ఏది స్వగత సజాతీయ విజాతీయ రూపభేద రహితమో అది ఏకమని పిలువబడును. అట్టి ఏకవిజ్ఞానము వలన సర్వవిజ్ఞానముకలుగుటయే యిందలి విశేషము. ఏన్గుతుండమును బట్టి ఏన్గుతోకనుబట్టి తుండమే ఏనుగుతోకయే ఏనుగు యని చెప్పుకొనెడిరీతిగాక యీజ్ఞానము యెంతమాత్రమైనను అఖండమై యొప్పును. ఖండముగ గ్రహింపబడుటకు వీలులేనివిజ్ఞానము. అట్లయగుచోనిక మనస్సునకు సరిగ మననయోగ్య మగునదికాదేమోఅను సందేహము నివారించుటకు "మనస్సుకంటె వేగముగలది" అని వర్ణించెను. "యతోవాచః నివర్తంతే అప్రాప్యమనసాసహ" అని చెప్పబడిన రూపమున తత్తత్త్వమున్నది. కాని ఆ తత్త్వము కేవలమానసికము కేవలవాచోవిధేయము అని యనుకొనుట తప్పు. మనస్సు ఎంత వరకు గ్రహింపగలుగునో అంతవరకునుండి తదతిశయరూపముననుండునని చెప్పుటయే ఇక్కడ ప్రధానముగాని మననము చేయబడునది కాదని యనుట ప్రధానముకాదు. "యన్మనసామనుతే తన్నబ్రహ్మ" అని లేదా అని యందురేమో ఈశ్రుతికి తాత్పర్యము మంతవ్యత్వము గాదని చెప్పుటగాదు. మంతవ్యత్వము గాదనుటయే తాత్పర్యమగునెడల "మంతవ్యః" అని 'తవ్య' ప్రత్యయముతో వేరొకచో నుపదేశింపము. మంతవ్యత్వ మున్నను మంతవ్యాతిశయరూపము నిరూపించుటయే తాత్పర్యము. ఇట్లు తాత్పర్యము చెప్పకొనకున్న పరి

చ్ఛేదక పరిచ్ఛేద్యరూపదోషము వచ్చును. కావున మనసునకు మించి నదిగా యున్నది. దీనిని దేవతలును పొందలేదని విశేషించి చెప్పు చున్నది. దేవశబ్దమునకు సాత్త్వికప్రవృత్తియని యర్థముచెప్పుటయో జ్ఞానేంద్రియములని యర్థము చెప్పుటయో పొసగియుండినను. 'దేవాః' అని దేవశబ్దమే యుండుటంబట్టి దేవతలే యనుకొన్నను నష్టములేదు. శిష్యునకు బ్రహ్మనిదేవతలు తత్తత్త్వ గ్రహణమున సమర్థులేమో యని సందేహించి తత్తల్లోకములను సాధించుటకు నేవియో యదృష్ట ఫలకములగు కర్మల నాచరించుచు జ్ఞానవిషయమును తృణీకరించి జ్ఞానోపదేష్టలగు తత్త్వదర్శుల నాశ్రయింపక గురువులయెడల జూపవలసిన సర్వాధికభావము నలవరచుకొనక పోదగునేమోయని ఆదేవతలుగూడ ఆతత్త్వమును నెరుంగజాలరనుమాయని ఉపదేశించెను. "దేవానజాతి కుతో మనుష్యాః" అనెడు కైముతికన్యాయ్యమిటబట్టదు. తత్త్వమెరుంగు టలో మానవులును దేవతలును సమానులేసుమా! అని సామ్యము కొరకు చెప్పియున్నాడు. ఇట్టిసామ్యము చెప్పినసే మానవలోకమునందే జ్ఞానపిపాసయుదయించి తత్త్వదర్శిని జేరగలడు. కావుననే "ఇహాచే దవేదీత్ మహతీవినష్టిః" యని శ్రుతి ఘోషించుచున్నది. ఈజన్మముననే తత్త్వజ్ఞుడు గావలయునని చెప్పుచున్నది. 'ప్రేత్యఅభిగచ్ఛంతి' అని యనుటవలన ప్రేతభావపూర్వముననే తత్త్వసుప్రీతుడుగావలయును అని యర్థవాదమున బోధించుటకే దీనినిదేవతలు పొందజాలరుయని చెప్పి యుండెను. ఈతత్త్వము తెలియబడినతరువాత నుండునదియు తెలియ బడకమున్ను లేనిదనియు సందేహించునేమోయని సుదృఢముగ తెలియబడినను తెలియబడకున్నను, తెలియబడదగినదని వేరొక వాక్యమును ప్రారంభించెను. "పూర్వమేయున్నది." అన్ని యుపనిషత్తు లును "పూర్వము సత్తేయున్నది. ఉన్నదొక్కసత్తే" అని ముక్త కంఠముగ చెప్పుచున్నవి. పూర్వాపరము లనెడు కాలవిభాగము

ప్రధానముగాదు. సద్భావముయొక్క నిత్యత్వబోధమే ప్రధానము. భూగర్భమున సువర్ణఖనియొకడు కనుగొనెననుకొనుడు. కనుగొనిన తరువాతనే గనియొక్క యునికి సంభవించెననుటతప్పుగాదా! భూమికి ఆకర్షణశక్తిగలదు అని కనుగొనినతరువాతనే ఆకర్షణశక్తి కలిగి యుండెననుటతప్పుగాదా? అట్లే ఆ తత్త్వము యెప్పుడునుండునదే. అట్లగుటవలన వెనుకలేదుకాబోలు ముందున్నదికాబోలు నని దేశకాలాదికృతభేదజ్ఞానము నాశ్రయించి యన్వేషించువారి కందరకును అందరానిదియై బహుదూరమైన ట్లుండును. అని వేరొకవాక్యము నుపదేశించుచున్నాడు. ఈవాక్యమువలన యెవరు వెనుకవెన్నాడుదురో కాశిలోనున్నదో, గయలోనున్నదో కేదారంబుననున్నదో, గుహలలోనున్నదో, అడవులలోనున్నదో అని యనుకొనుచు అటునిటు తిరుగాడువారికి అందరానిదని స్పష్టపరచుచున్నాడు. అట్లగుటవలన ఏదేశముననైన ఏక్షణముననైన తత్తత్త్వ మవగాహనమగు నని యభయ మిచ్చుచున్నాడు. "ఈగ్రామములోనున్నయది పొసగదు, ఈవృత్తిలోనున్న ఇదికుదురదు. ఈదేహముతో ఇది సంభవముగాదు అని అలసులై మందులై ఆత్మజ్ఞానదూరులుకాకుడు" అని హెచ్చరించుచున్నది. అట్లే దూరదూరమైపోవునా లేక ఎక్కడనైనను సిద్ధమగునా యనుదానిని స్పష్టముగ "తత్ తిష్ఠత్ అస్తి" అని ఆతత్త్వమెప్పుడును ఒక్కలాగు నిలిచియుండునది అని బోధించెను. కావుననే దానియందే ఆయధిష్ఠానమునందే సర్వప్రతిష్ఠయుగలదని దానియందు నీరు గాలి నిలిచి యున్నదని కడపటివాక్యమును చెప్పుచున్నాడు. ఇందుపయోగింపబడిన నీరో గాలియో సకలభూతముల కుపలక్షణముగ గ్రహించి మిగిలినదానిని పారిభాషికముగ అర్థమును జేసికొనవలయును. నీరు కర్మవాచకమని వేదసంప్రదాయజ్ఞులు నిర్వచించుటచే కర్మలు కర్మఫలభూతములు ఎల్లదియు ఆయధిష్ఠానమునందే ప్రతిష్ఠింపబడినవని యుప

సంహరించుచున్నాడు. అట్లుపసంహరించుట వలన కర్మలయొక్క సత్త్వస్వరూపము బ్రహ్మాధీనమై యుండుటవలన దార్శికముగగూడ బ్రహ్మార్పణముగ గర్మములను గావింపవలయుననెడి బోధము పునరుద్బోధమగుచున్నది. గీతలయందును "కర్మబ్రహ్మోద్భవంవిద్ధి" ఇత్యాదిగ వర్ణింపబడెను. ఇంతయేల అన్నిటికంటె తత్త్వజ్ఞానప్రయత్న మొక్కటే సుగమము సుఖము సూపపాదము అని ప్రశంసించెను.

౫. మంత్రము

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వన్తికే। తదన్తరస్య
సర్వస్య తదు సర్వస్యాస్యబాహ్యతః॥

తా॥ పూర్వమంత్రమునందు చెప్పబడిన లక్షణము లత్యంతైకాంతికములు అని యనుకొనరాదని తద్విలక్షణముగ ఈమంత్రమునందు నిర్వచించుచున్నాడు. ఇదియే ఇందలి విశేషము. తార్కికులు ఒక వస్తువున కొకధర్మమే యుండవలయునని నియమించుకొన్నను ఆవాగ్వైదగ్ధినియమములకు లొంగనిదని ఇందు వర్ణించుచున్నాడు. ఆ పరమతత్త్వ మిదమిత్థమని నిరూపింప దలచుట 'దిద్ధడబిద్ధయుద్ధ'మే.

"To define God is to defy Him—"

అయినను శాఖాచంద్ర న్యాయమున చెప్పుట పరిపాటి. ఆ తత్త్వము చలకమును అచలకమును నైయున్నది. కేవలాచంచలమే యన్నచో స్థాణుప్రాయమనెడి భ్రాంతికలుగును. కాబట్టి చలనాచలనంబులెల్ల తన్నిహితములని లక్షణాంతరములం జూపుచున్నాడు. దూరమున

నుండునదియు అత్యంత సమీపముననుండునదియు అగుచునని వ్యాప్తి లక్షణము నిరూపించుచున్నాడు. ఎట్టి ఎదుటను దూరముగను అత్యంత సమీపముననుబహుదూరముననుఉండగలుగు విలక్షణ ధర్మయుక్తము ఆ తత్త్వమని చెప్పుచున్నాడు. అట్లు చెప్పుటవలన దేశకాలాది వస్తు భేదముల వలన కలిగిన రాగద్వేషాదులకు ప్రసక్తి సంభవించదు. ఒక డడవికిపోయి తపస్సుగావించి చిరకాలముండె నన్నుగారు. అడవికి పోయెనుగావున అది యుండ నేరదని నిర్ణయించుకొనరాదు. స్వావస్థ నుండునటముగనె వేరొకడు పక్కచోటనే యుండెననుకొనుము. కొండలు కొండలం బట్టి గుహాలకుంబోయి కష్టింపలేదు గావున వానికా తత్త్వము గ్రహింపలేదని యనదగదు. గ్రహించువాడెట్టులైన గ్రహించును. మరి యును తనవారు తన్ననుసరించువారు గ్రహించిరనియు పెరవారు తన్ను ప్రతికూలించువారు గ్రహింపలేదనియు అనుకొనుటతప్పు. తనవాడైన పెరవాడైనా అనుకూలుడైనా ప్రతికూలుడైనా గ్రహించుట కనకాశము గలవాడేయగును. కొందరకు కాలభేదమునంగాని పట్టదు. కొందరకు దేశభేదమునంగాని గిట్టదు. ఇట్టివేవియో బాహిరభేదములున్నవని సంకోచింపనక్కరలేదు. ఆ తత్త్వముయొక్క సర్వవ్యాపక రూపము దుర్నిరూపమై యుండునని లోపల వెలుపల భూతములయందు కాలమునందు దిక్కులయందు భావమునందు అభావమునందు నన్నింటను నొక్కరీతి యుండగలిగిన దిది యొక్కటే యని చెప్పి తత్సాధనారూపమును చెప్పుటకు ప్రారంభించుచున్నాడు.

౬. మంత్రము

యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవానుపశ్యతి
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే॥

తా॥ ఈమంత్రమునందు ముఖ్యమగు వాక్యము 'నవిజుగుప్సతే' అనునది. ఏవిషయమును జుగుప్సాకరముగ భావింపక కేవలాత్మ విలాస మని వివేకించు దివ్యోపాసకుడు పరమాత్మ తత్త్వాను సంధాతయై యెప్పుడు నుండును. వేయేల క్షయమాత్రస్థానమైన స్మశాన వాటికయందును తాండవక్రీడా విశేషములను గావించు పౌరాణిక నటరాజోద్దేశము సంపూర్ణముగ అభ్యుదయ సూచకమై యుండవల యును కావుననే ప్రపంచమునందలి సకలవస్తుజాలమునందును, ఎల్ల భూతములయందును సకలభావనములయందును భాగవత దివ్యస్వరూ పాను సంధానము కావించుచో ద్వేష్యమనియు ప్రియమనియు సహ్య మనియు విసహ్యమనియు అను యీద్వంద్వభావములకు లోనుగాక అదియంతయును ఆత్మవిలాసమేయని యెరుంగును. అట్లగునాడు తనకు శోకకారణము కానరాక జననమరణరూపములు సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములన్నియును క్రీడాసమయమునందలి పాదవిన్యాస ములవంటివేయని నిశ్చయించి వానివలనకలిగెడి సంక్షోభములను దూరము కావించుకొనగలడు. సకలభూతములును ఆత్మయందున్నవి. అను వాక్యమునకు ఎల్లదియును ఆత్మీయమే యను మహావిషయము బోధించుచున్నాడు. అట్లగుటవలన భూతదయ మైత్రి కరుణ మున్నగు దైవీగుణసంపద హెచ్చుటయేగాక సత్యముగ సర్వత్ర ఆత్మసాక్షాత్కార మనుభవింపగలడు. అనేకము అనివ్యవహరించుచున్న భావనయందు

నిజముగ ఏకత్వమే యున్నదని గ్రహింపబడును. ఒకటి యున్ననూ రెండున్నను ఆ రెండింటను గలిగిన గుణనామరూపాధారము ఏకస్వరూపమే. ఒకటి ఒకటి యయ్యెను నూఱును నూఱొకట్లయ్యెను కదా! కనుక భూతము అనునది భావమే. భావము కాని భూతము లేదు. భావము భావనారూపము. భావనము ఆత్మస్వరూపము. ఆత్మలేకున్న భావము భావనము భూతము అనున దేదియునుండదు. అట్లగుటచే ఎల్లవియు ఆత్మయం దధిష్ఠింపబడియున్నవి. మరియును సకలభూతములయందును ఆత్మనే చూడవలయును అని యనుటవలన భూతములయం దాత్మ యున్నదని ఆత్మ, భూతములయొక్క అన్యోన్యావినాభావ సంబంధమును శిష్యహృదయమునకు నచ్చునట్లు బోధార్థము స్వీకరింపబడిన ద్వైతము కాని నిజముగ ఆత్మైక విలాసమని సర్వమని నిశ్చయించుకొనవలయును. ఈ యభిప్రాయమునే గీతలయందును చెప్పియున్నారు. "ఆత్మరతి ఆత్మతృప్తి ఆత్మన్యేవాత్మనా తుష్టః ఆత్మ తృప్తశ్చమానవః" అని నిత్యతృప్తిని ఆత్మైకత్వదర్శనమునం దున్నదని చెప్పియున్నారు. ఇంతేకాదు యీమంత్రము మొదటి మంత్రములోని "మాగృధః కస్యస్విద్ధనమ్" అనువాక్యమునకు వ్యాఖ్యాన ప్రాయముగ నుండవలయునని చెప్పబడెను. ఆశ అసూయ మొదలగు నానావస్తు జాతములయందలి యన్యోన్య సంక్షోభ మూలకారణమైన దుర్భావత్యాగము సుదృఢముగ నుపదేశించుచున్నది. దీనినిబట్టి "దేవు డెక్కడనులేడు; నీలోనున్నాడు" అని సుష్ఠునిర్ణయమును చేసికొనక నీయందును నాయందును స్థావరములయందును జంగమములయందును అన్నింటికి అన్నియై అన్నింటిని మించి అలౌకికమైన ఏకస్వరూపమున దేవున్నాడు" అని నిశ్చయించుకొనవలెను. కావుననే "ఈశావాస్య మిదగ్ం సర్వం" అని స్పష్టముగ సర్వము భగవద్రూపముగ ప్రతిజ్ఞ చేసియున్నాడు. మరియును గీతలయందు "భూతభృత్ నచ భూతస్థః" అని నొక్కిచెప్పెను. భూతములయందుండు వాడనుకాను. భూతములన్ను

భావించునాఁడె యని చెప్పియున్నాను. ఈ నిర్ణయము తెలియుటవలన నాయందు చేర్చబడిన్నదనెడి సద్భావములోని నిగూఢమైన ఆ సద్భావదురహంకార దురభిమానములు త్యాజ్యములని చక్కగ ధ్వనింపజేయుచున్నాను. మరియును, మానవసేవయే మాధవసేవయనుచు, భూతదయయే పుణ్య కార్యమనుచు, ఆధ్యాత్మిక సూత్రముల నల్లుకొని ఆ యుక్తులతో తృప్తిపొందుట కంటె ఆ భాగవత దివ్యస్వరూపమును అనుసంధానించెడు దివ్యసాధనమును మానవసేవ భూతదయా విలక్షణమైన దానిని అవలంబింపవలసి యుండుట నెరుంగ వలయును. నీతికి హితముగ నున్నదని కొన్ని నిర్ణయములు మానవ రంజకములుగ నుండవచ్చును గాని పరమార్థములు గావు. నీతిమంతులై బుద్ధియోగ సంపన్నులై సంచరింప వలయును. ఒక్క మానవమే మాధవము కాదుగదా ! మానవము పాశవము జాంతవము పార్థివము అపార్థివము దృశ్యము అదృశ్యము సర్వము మాధవమని జ్ఞప్తియుంచుకొనుము. తత్కాలనీతులను పాటింపవలదని చెప్పలేను. అదియే పరమ సాధన మనెడి ఐకాంతికదుర్వాదమును దూరీకరింపవలయును. ప్రవృత్తి యందునివృత్తియు, నివృత్తియందు ప్రవృత్తియు చక్కగ నన్వయించుకొనవలయును. నేను భూతములయందులేను అని చెప్పబడిన వాక్యమునకు నేను భూతమాత్ర పరిచ్ఛిన్నుడనుగాను అని యర్థము. ఇట్లుపన్యసించుటవలన జిజ్ఞాసువునకు ప్రపంచమునం దనూయపుట్టక ప్రపంచమెల్ల భగవద్దివ్యాలయమై యీ ప్రపంచజీవయాత్ర భగవద్దివ్యయాత్రగా మారగలదు. ఇట్టి మహాయజ్ఞమునకు సాధనము పరికరములు అధికారి మొదలగువిషయములు ముందు చెప్పుచున్నాను. అయినను ఆత్మానుదర్శనము ఆత్మభూతాన్వయము ఈ రెండింటి నుపన్యసించుటవలననే సాధనాదులు గ్రహింపబడుచున్నవి. ఆత్మ దర్శింపబడవలయును, వినబడవలయు ; మననముచేయబడవలయు ; ధ్యానింపబడవలయునని స్పష్టముగ

ఏకధోరణిని ఉపదేశించిన దర్శన శ్రవణ మనన ధ్యానాదులు ముఖ్యసాధనములు. వానిని విడువరాదు. ఈమంత్రము సమూహమున ఆత్మజ్ఞానమున ప్రవృత్తియు జగుప్సాకారణమునందు నివృత్తియు బోధించుచున్నది. అట్లు బోధించుటవలన ప్రపంచవ్యవహార నిర్వాహణమునకు అవలంబింప బడవలసిన యే సత్ప్రవృత్తియును ఆత్మదర్శనమున అడ్డంకి కారాదని అభయమిచ్చుచున్నాడు. గృహస్థుడై ఆలుబిడ్డలతో ఆపత్సంపదలతో అణగి మణగి పెనగి బాధపడుటకంటె సుఖముగయొక్కడై "సన్యాసి"యై యుండవలయుననుకొనడి వెఱ్ఱితనము విడువవలయును. సంసారికైనను సన్యాసికైనను ఏప్రవృత్తియుండినను ఏవయసునందున్నను స్త్రీయైనను పురుషుడైనను యే వర్ణాశ్రమ ధర్మములయందున్నను యే దేశములయందున్నను ధార్మికమైన జీవయాత్ర నడిపించుకొనుచు బుద్ధియోగ సంపన్నుడగువాడు సర్వదా ఆత్మసాక్షాత్కారానుభవము కలవాడే యగును.

౭. మంత్రము

యస్మిన్ సర్వాణిభూతాని ఆత్మైవాభూద్విజానతః
తత్రకో మోహః కశ్శోకః ఏకత్వమనుపశ్యతః॥

తా॥ ఈమంత్రమునందు ఏకత్వానుదర్శనము ముఖ్యముగ నుపన్యసింపబడెను. ఆఏకము సత్యమైసర్వమై బ్రహ్మమై భాగవతమై యుండునది యగుటవలన జుగుప్సాకారణము కారాదని మున్నే యుపదేశించెను. ఈఏకత్వానుదర్శన మాధారముగ జేసికొని యంతయు నసత్యము ఏకము సత్యము అని అద్వైతము బోధించుకొనుచున్నారు. అద్వైతపక్ష

భావార్థము బ్రహ్మసత్యము జగన్మిథ్య అను యీరెండు వాక్యములలో ఇముడదు. ఇముడనేరదు. కావుననే బ్రహ్మవిద్య బహువిస్తృతమని వాదముగ గలదు. సకలపదార్థములయందును ఆత్మదర్శనము కావించుటవలన జ్ఞానికి ఆత్మయే ప్రకాశించును. ఆ ఆత్మయొక్క స్వరూపము సత్యానందరసము జ్ఞానము సర్వము. అంతము అనంతమును అట్లుండునప్పుడు శోకము, మోహము దుఃఖము సుఖము యీ మొదలగు ద్వంద్వభావనముల కవకాశము లేకుండును. ద్వంద్వముల శ్రీభావనా రాహిత్యమునకై ఆత్మైకత్వప్రకాశనమునకై యీమంత్రము అవతరింపబడెను. సకలభూతములు ఆత్మయగునట్లెరింగిన వానికి శోకము లేదు, మోహము లేదు. ఆత్మయే విశదావభాసమై యుండును. అని స్పష్టముగ నుపదేశించుచున్నది. సాంఖ్యాది శాస్త్రములయందు యీప్రపంచము వివేకించునెడల సర్వము దుఃఖమయము అని నిర్వచించిరి. దుఃఖమయ మని, యుపదేశించి నిత్యదుఃఖితునిగ జేయుట కంటె బ్రహ్మమయ మని ఆత్మమయ మని, బ్రహ్మమే యని, ఆత్మయే యని యుపదేశించి నిత్యబ్రహ్మానందానుభవ పరునిగ జేయుట శ్రేయము గదా. అట్టివాడుపాసకుడు జ్ఞానియు అనుగుత్యుడు ఆరూఢుడు అగువా రందరును ప్రపంచమునందే ప్రవృత్తియందే యుండి జయాపజయములను లాభాలాభములను మున్నగువానిని లక్ష్యపెట్టక, సంభవమగుచోట్ల భగవద్విలాసమాత్రాత్మకమని యనుభవించుచు వర్తింప నేర్పు గలిగి యుందురు. అట్టివారిని శోకమోహాదులు బంధింపనేరవు. ఒకదాని నాశము వేరొకదాని ప్రకాశమే యనెడు యీనాశప్రకాశవ్యవహారము సర్వప్రకాశముగ నెరుంగ జాలుట ఆత్మజ్ఞాన పరమరహస్యము. గీతలయందు దిదియే 'గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః' అని శోకరాహిత్య ముపదేశింపబడెను 'తరతి శోకమాత్మవిత్' అని శ్రుతియును ప్రతిపాదించుచున్నది. కాని యిన్నింటికిని యోగయుక్తా

త్మునై యుండవలయునని గీతా తాత్పర్యము. ఆ తాత్పర్యమునకు మూలభూతమైన యీమంత్రము ఆ ఆత్మసంయమయోగమునే యుపదేశించుచున్నది. ఆత్మసంయమనము బుద్ధియోగపరమఫలము కావున బుద్ధియోగియై ఆత్మదర్శనము గావింపవలయును. 'అక్కడ కుండ లేదు' అని ఒక కుండయొక్క అభావమును నిరూపించుకొన్నను కుండయొక్క భావము కుమ్మరియందు సుప్రతిష్ఠితమై యుండును. కుండలేమికి శోకింపని కుమ్మరివలె భూతాభావమునకు శోకింపక భూతేశారాధనమునకు సిద్ధపడియుండవలయును. ఆత్మదర్శనమే భూతార్థము. కాబట్టియే బుద్ధియోగమూలభూతమైన మంత్రమునకు అనంతరమున 'సపర్యగాత్' అను మంత్రము బుద్ధియోగమునకు నిష్ఠావాక్యముగ ఆరంభింపబడుచున్నది.

౮. మంత్రము

సపర్యగాచ్ఛుక్రమకాయమవ్రణ మస్నావిరగ్ం శుద్ధ
మపాపవిద్ధమ్ కవిర్మనీషీ పరిభూః స్వయంభూర్యా
థాతథ్యతోఽర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్య స్సమాభ్యః॥

తా॥ ఈమంత్రము మూలప్రాయముగ రచింపబడెను. కావున నే లింగభేదములతో వాక్యములున్నవి. 'సః పర్యగాత్' అని యొక వాక్యము. అతడు సర్వమును వ్యాపించెను అని యర్థము. అతడన నెవడు అని శంకింపకుండుటకై ప్రథమ మంత్రమునందలి వాక్య తాత్పర్యమును గ్రహించి అన్వయించుకొనవలయును. అభగవంతుడు ఏతత్పూర్వ మంత్రమునందు ఆత్మదర్శనము వర్ణింపబడెగావున సః అనగా ఆ ఆత్మ అని వల

చెప్పఁగూడదు అని కొందఱందురు. ఆత్మబోధము వేరు, ఆత్మవద్బోధము వేరు. ఆత్మబోధము కాకున్న ఆత్మవద్బోధము కాదు. కావున ఆత్మను నిరూపించి ఆత్మవద్బోధము నుపదేశించుచున్నాఁడు. ఇదియే సంప్రదాయార్థము. కావుననే బ్రహ్మసూత్రములయందు ప్రారంభమున బ్రహ్మజిజ్ఞాసా అని యున్నది. ఆత్మజిజ్ఞాసా అని ఏల సూత్రింపలేదు ఆలోచింపుము. గీతలయందును 'జ్ఞానీత్వాత్మైవ మే మతమ్' అని చెప్పియున్నాఁడు. అనగా ఆత్మవంతుఁడు భగవంతుఁడని యర్థము. కావుననే భగవత్సాక్షాత్కారమున కాత్మ సాధనభూతమై యున్నది అందుచేతనే యీ యుపనిషత్ప్రారంభమున ఈశావాస్యమని యుపదేశింపబడియున్నది. అటులే గీతలయందు పురుషోత్తముఁడని వర్ణింపబడియుండెను. సః అను దానికి 'పరమాత్మ' అని అర్థము చెప్పరాదు అని యందురేమో! అట్లును చెప్పరాదు. పరమాత్మవంతుఁడే గాని పరమాత్మమాత్రము గాదు. అనుభూయమానమైన జీవాత్మలక్షణముల నన్నింటిని నిరసించుకొన్నను కేవల భగవద్భావ మిదమిత్థమని సుభావగాహనము కాదు. గావున ప్రత్యేకముగ పురుషోత్తముఁడు అని గ్రహింపవలసి వచ్చెను. కావుననే వేదముల యందును "ఆయతనవంతుఁడు ఆత్మవంతుఁడు" ఇత్యాదిగ మతుబంత శబ్దము లుపయోగింపబడెను. వ్యవహారలోకమునందును ధర్మము లనియు గుణము లనియు శక్తు లనియు యీ మొదలగు సర్వ పారిభాషికజ్ఞానశక్తి ఆ భగవంతునియందే యుండుటవలన సః అనగా ఆ పురుషోత్తముఁడే ఆ ఈశుఁడే అని చెప్పవలసివచ్చెను — అది పరమాత్మయు పరమాత్మవంతమునగును అట్టివాఁడు సర్వవ్యాపకుఁడు అని సర్వవ్యాపకత్వము తనయందున్న యలౌకికశక్తి యని యుపనిషత్తుపదేశించుచున్నది. ఆత్మయొక్క వ్యాపకత్వము సమ్మతింపదగినదిగ గన్పట్టునుగాని పురుషునియొక్క సర్వవ్యాపకత్వము సమ్మతింపదగినదిగ కన్పట్టదు. కావుననే ప్రత్యేకముగ

పురుషోత్తముని సర్వవ్యాపకతా శక్తి మత్వము ఉపదేశించు చున్నది. దేవదత్తుడు సర్వవ్యాపకుడు అన్నప్పుడు నిజముగ ఏకకాలమునందు సర్వవ్యాపకత్వము దేవదత్తున కసంభవమెట్లగునో అట్లే పురుషోత్తమున కసంభవమేమో అని యనుకొనరాదని నిషేధించి ఉపదేశించు చున్నది. ఆ యుత్తమ పురుషుని సందర్శనము విధీయమాన మగుటబట్టి రెండవవాక్యము ప్రారంభింపబడుచున్నది. శుక్రమును, అకాయమును, అవ్రణమును, అస్నావిరమును, శుద్ధమును, అపాపవిద్ధమును అగును అనివాక్యము. ఇందలి శుక్రాదిశబ్దములు విశేషణములై విశేష్యమగు దానిని దేనినో పరామర్శించుచున్నట్లు బోధమగుచున్నది. ఆ విశేష్యము పూర్వవాక్యము నందలి 'సః' అను శబ్దమే అని యందురు కాని యాలోచింప నట్టిదికాదని తోచుచున్నది. ఈ విశేషణములలో 'అకాయము, అవ్రణము, అస్నావిరము' అనెడు శబ్దములు దేహమును పరామర్శించి పరిహరించు చున్నట్లున్నవి. మరియును పూర్వోత్తర వాక్యములు విశేషణ విశేష్యములుగ గ్రహింతమన్న లింగవ్యత్యాసము గలదని వ్యాఖ్యాత లందరొప్పుకొనిరి. ఆ వ్యత్యాసము ఛాందసమని సమాధానపరచుకొనిరి. గతిలేనప్పుడా సమాధానమే స్వీకరింపదగును. కాని వేరొకదారి కానవచ్చునప్పుడు ఛాందసత్వసమాధానము స్వీకరింప నక్కరలేదు. ఈ యుపనిషత్తునందే వేరొకచో తత్తేరూపం కల్యాణతమం అని వర్ణింపబడియున్నది. ఆ కల్యాణతమరూప నిరూపణమే ఈవాక్యమున కుద్దేశము. అట్లగునప్పుడు చక్కగ నన్వయింపవచ్చును. అది శుక్రము అనగా కోటిసూర్య సమప్రభమై యుండునది. ఉపాసకుల యనుభవమునందును ధ్యానయోగాస్థితుడై ప్రారంభమున ఆ దివ్యతేజమునే దర్శించుట గలదు. ఆ దివ్యతేజోఘనరూపమే నీలలోహితమై సుందరమై యుండును. ఈ రూపమేల ప్రవక్తమయ్యెనని యందురేని వినుడు: ధ్యానముచేయునప్పుడు దర్శనయోగ్యత కలదా? అనెడు

శంకను నివారింపవలయునుగదా! ఆత్మకును బ్రహ్మమునకును సాక్షా
త్కార ముండదు. ఆత్మ సాక్షాత్కారము బ్రహ్మ సాక్షాత్కారము
అని సమాసపదముల యోజనమే యుండును, సంయోజన ముండదు.
కావుననే ఆ సమాసములు మధ్యమ పదలోపి సమాసములుగ
మాత్రము గ్రహింపవలెను. ఆత్మసాక్షాత్కార మనగా ఆత్మరూప
సాక్షాత్కారమని యర్థము. అట్లే బ్రహ్మసాక్షాత్కార మనునప్పుడును.
కాబట్టి ధ్యాత యుండునెడల ధ్యానము విధీయమాన మగునెడల,
ధ్యాతృ ధ్యాన ధ్యేయ సమైక్యమగు రూప మొకదానిని నౌపనిషదమగు
దానిని వేదపురుషు డుపదేశించుచున్నాడు. ఆ రూప మారంభమున
ధ్యాతకు తేజోరూపమైయుండును. అనంతరము కాయరూపమైయుండును.
ఇందలి కాయ శబ్దము సార్థకము. దేహము, శరీరము మున్నగు శబ్ద
ముల వంటి శబ్దముకాదు. ప్రకాశనార్థక ధాతుజన్యమైన కాయశబ్దము
సార్థకము. అయినను ఆకాయము బంధము కానిదగుటబట్టి అకాయమని
నిషేధించుచున్నాడు. అట్టినిషేధమే కాకున్న అకాయ మనుటవలననే
అవ్రణాస్నావిరాదులు చెప్పబడినవియైయుండ మరల అవ్రణాస్నావి
రాదుల నుపయోగింపనేల. కాయమును చెప్పి కాయగత ప్రాకృత
లక్షణములను నిరసించి అప్రాకృతకాయ స్వరూపమును నిరూపించు
చున్నాడు. అప్పుడే అవ్రణాది విశేషణములు శక్తిమంతము లగును.
కావున అకాయమనగా కాయవంతమై అకాయమగుననియర్థము
చెప్పితీరవలయును. కాయవంత మనగా తత్కాల దర్శనీయ తేజో
మయ కాయవంతమనియు అకాయమనగా కాయదర్శన సంజాతో
పాధిక వాసనారహిత మనియు అర్థమును చెప్పుకొనవలయును.
అట్లుచెప్పుకొనకున్న ధ్యేయములేనిదగును. ధ్యేయములేనిదైన ధ్యానము
లేనిదగును. జ్ఞేయమునకు జ్ఞానమెట్లుముఖ్యమో ధ్యేయమునకు ధ్యాన
మట్లుముఖ్యము. జ్ఞేయమే ధ్యేయము, ధ్యేయమే జ్ఞేయము. ఈ ధ్యేయ

రూపప్రశంస ఉపనిషత్తున కుద్దేశమే కానియెడల రూపవర్ణన మప్రసక్త మైయుండును. గీతలయందును "తత్త్వేన ద్రష్టుం జ్ఞాతుంప్రవేష్టుం" అని యుండుటంబట్టి రూపదర్శన మొక సాధనాంగమని నిర్ణయింపవలయును 'అవ్రణ' మను రెండవవిశేషణముచే ధ్యానకాలదృష్టకాయము వ్రణాది రోగాస్పదము కానిదనియు ప్రాకృతదేహములయట్లు స్థూలసూక్ష్మ కారణవాసనాక్రమ బంధములేనిదనియు బోధమగుచున్నది. ఈ వ్రణ శబ్దమువలన కాయబహిర్లక్షణములు గ్రహింపబడును. అట్లే కాయాంత ర్లక్షణములుగూడ సమన్వయించుటకు 'అస్నావిరం' అను విశేషణ ముపయోగించెను. స్నాయువు నరములు కండరములు జీర్ణకోశాదులు సంయోగసంబంధవాసనలు గలిగెడు ప్రాకృతదేహమువంటిది కాదని నిరూపించుటకై 'అస్నావిర' మని యుపయోగించెను. 'శుద్ధమ్' అని ప్రత్యేకముగ పుణ్యమయత్వమును చెప్పుచున్నాడు. ధ్యాన కాలదృష్ట మైన కాయవత్త్వము "భస్మాంతమిదగ్ంశరీరం" అనునట్లు భస్మపర్యవ సాయిగాక ధ్యానకాలావగాహియై ఆకాయము అంతర్ధానాంతమై యుండును. కావుననే జాత్యాయుర్భోగ లక్షణానుభవమునకై యేర్ప డిన దేహమువంటి దేహముకాదని తెలుపుటకు శుద్ధమని విశేషణ ముపయోగించెను. ప్రాకృతదేహములు శుద్ధములుగ నుండనేరవు. ఈ శుద్ధశబ్దమునకు స్వచ్ఛమనియు, మచ్చమసిలేక యున్నదనియు ననెడు సాధారణార్థము గ్రహింతురేమోయని 'అపాపవిద్ధమ్' అను వేరొక విశేషణముపయోగించెను. ప్రారబ్ధభోగమునకై స్వీకరింపబడిన కర్మదేహములవంటి దేహముకాదని పాపసంపర్కలేశమును లేదని వైదికబుద్ధితో నిర్ణయించుచున్నాడు. భగవంతునియొక్క సాకారత సర్వవ్యాపకతాశక్తికి లోపము రానీయదని అట్టి పాపములేదని అపాప విద్ధ మనుచున్నాడు. పురాణములయందును ఆకారావస్థతే వర్ణింప బడియుండుట విజ్ఞు లెరుంగుదురు. శరీరమే యగుచో పాపయుక్తమగు

ననియు సావయవము సాకారము సర్వవ్యాపక శక్తిమంతము కానేర దనియు లౌకికతర్క మువయోగింపరాదు. ఇట్టి విషయములయందే "నతర్కేణ మతిరాపనేయా" అనియును 'తర్కమప్రతిష్ఠ' మనియును 'నాయమాత్మాప్రవచనేనలభ్యః' అనియును శాస్త్రములు ఘోషించుచున్నవి. గీతలయందును 'భగవద్రూపము చూడబడినట్లు వర్ణింపబడి యున్నది. ఈ మంత్రము కేవలోపాసకుల నుద్దేశించి చెప్పబడినది గాని వాగ్వైఖరీ విలాస పండితుల నుద్దేశించి చెప్పబడలేదు. ఈ రూపము ఈ తత్త్వము వాచోవిధేయము గాక తపోవిధేయమై యున్నది. తపోవిధేయ విషయములు తర్కదూరములు. అట్టివానికి వేదమే ప్రమాణము. ధ్యానధ్యేయముల నాధారముగా గొని వావదూకులు కొందరు ధ్యానకాలమునందు ధ్యేయమై కన్పట్టినది మనోవికారమనియు, మనోదౌర్బల్యమనియు ఎవ్వ రెట్లు చెప్పుదురో అట్లు కానవచ్చుననియు, వాదింతురు. ఆ వాదముల కిందు తావులేదు. ధ్యేయమగునదియు జ్ఞేయమగునదియు ఒకటియున్నదనుచో అది ధ్యానగమ్యమై తీరవలయును. మరచినవస్తువు జ్ఞాపకమునకువచ్చి ఎట్లావస్తురూపము సమన్వయమగునో అట్లే ధ్యేయముకూడ సమన్వయమగును. ఒకగురువు ధ్యేయాకారము నక్కవలె యుండునని బోధించె ననుకొనుడు. అట్లు అవివేకియై అల్పజ్ఞుడై నక్కనేధ్యానించిన నక్క ప్రత్యక్షమై ధ్యేయమై ధ్యేయదర్శనానంతర దివ్యశక్తి కలవాడగుట సంభవింపనేరదు. యుక్తికొరకీ యుదాహరణము తీసికొన్నను ధ్యేయము నక్కవంటిదని చెప్పుటకాధారములేదు. చెప్పినను నెగ్గదు. ఇంతియేల పురాణములయందొకచో నేతివేదాంత నిర్ణయంబులో ననిర్దిష్టముగ మనఃకల్పనమునకు దూరముగ నిరాకారముగ నిర్ణయించుకొన్న ఆ గజేంద్రునికి ధ్యేయ మీరూపమున సంభవించెనో కారణమేమో తార్కికు లూహింపుడు. ఇష్టమువచ్చిన ట్లుపదేశించిన ధ్యేయము కానేరదు. "ఆకా

హాఽఽత్మేద్రష్టవ్యః" అని ఆత్మదర్శనరూపము వర్ణింపబడెను. జంబుకాది దర్శనరూపము వర్ణింపబడలేదు. మరియును ఇకార్యకారణమున నే కాళీ బాలా బగళా తారా ప్రభృత్యుపాసనములు నిషిద్ధములని చెప్పుకొనవలసి వచ్చును. ఆ ఆత్మయెట్టిదని శంకించువారికి 'తత్త్వమసి' అను వాక్యముపదేశింపబడెను. దర్శనయోగ్యమైన ఆయాత్మరూప మిం దుపనిబద్ధమయ్యెను. ఆరూపమే ధ్యేయము. ఖండాంతరములయందును యీయేక రూపమే ధ్యేయమైనట్లు ప్రమాణము లభించుచున్నది. క్రైస్తవులు మహమ్మదీయులు మున్నగువారు ధ్యేయరూపముగా 'యేసు' ని 'మహమ్మదు' ని స్వీకరింపలేదు. ఆరూపము వారికి ధ్యేయముగాక మనన మాత్రమై యుండును. అయినను 'పాల్' అను ఒక మహాభక్తుడు ధ్యేయాకారమును గురించి యొకప్పుడు ధ్యానమునం దుండెను. అట్లుండనుండ మన వేదముల యందును పురాణములయందును ధ్యేయమని చెప్పబడిన ఆయాకారమే తనకు ధ్యేయమయ్యెను. ఈ ధ్యేయాకార మెవ్వ డుపదేశింపలేదు. తా ననుకొననైనలేదు. గజేంద్రుడు గూడ యట్లే విష్ణ్వాకారమును ధ్యానింపలేదు. తా ననుకొనలేదు. అయినను ధ్యేయ మొక్క రూపయ్యెను. పురాణములమాట యటుండనిచ్చి మొన్నటి మన శ్రీ రామకృష్ణ పరమహంసలవారు కేవల కాళీసమారాధకు లయ్యు పరమార్థముగ భగవద్దివ్య శ్రీ వాసుదేవ సుందర నీలాకార సందర్శన భాగ్యవంతులైనట్లు విజ్ఞులెరుంగుదురుకదా. మరియును ఎవ్వరికి నెరుకపడని ఒకానొకవస్తువును తెలిసికొనుటకు అంజనాది సాహాయ్యమున తద్వస్తువులను సందర్శించుటయు గలదు కావున నోరికొలంది తర్కింపక న్యాయ్యమైనదాని నుపదేశించిననే ధ్యేయమగును కాని ఇతరముకాదు. తర్కబద్ధము హేయము. ధ్యానసిద్ధము ధ్యేయము. ఈమంత్రములో తరువాతివాక్యము వింతిగనున్నది. చూడుడు. కవియు, మనీషియు, పరిభూరూపుడును స్వయంభువును అగువాడు అనియున్నది

ఇందలి శబ్దములెల్ల పుల్లింగమునందే గలవు. ఇవియన్నియు విశేషణములే. ఈ విశేషణములకు విశేష్యమగునది పూర్వవాక్యమునందలి 'సః' అనునదియే అయి తీరవలయును; వ్యాఖ్యాత లంద రొప్పుకొనిరి. ఈ విశేషణములవలన చైతన్య లక్షణములెల్ల ఈశ ప్రతిష్ఠితము లని నిరూపించుచున్నాడు. మొట్టమొదటి వాక్యమునందలి 'సః పర్యగాత్' అను వాక్యమును విని శిష్యుడు భ్రాంతుడు కావచ్చును. ఆకాశ మెట్లు సర్వవ్యాపక మో భగవంతు డట్లు సర్వవ్యాపకుడని అనుకొనవచ్చును. అట్లనుకొనుట తప్పు. ఆకాశమునకుగల సర్వవ్యాపకత్వము నిర్బంధము వ్యాపించి తీరవలయును. అదియొక భూతము. అట్టిభూతములకెల్ల అధ్యక్షుడైన భగవంతుని సర్వవ్యాపకత్వ మట్టిది కాదు. కావుననే వేరొకచో "తదేజతి తన్నైజతి" అని విరుద్ధధర్మములను ప్రతిపాదించెను. సర్వవ్యాపకత్వము మాత్రముగాక విశేషలక్షణములను వర్ణించుచున్నాడు. 'కవిః' అని భగవంతుడు కవి వాచ్యుడుగ నిర్దేశింపబడెను. సాధారణ కవులను మన మెరుంగుదుము. అసాధారణ కవి యితండని బోధించుటకు కవి యను విశేషణము నుపయోగించెను. దీనినే క్రాంతదర్శిత్వ మందురు. ఆంధ్రదేశములో గిరీశ మన్నను వెంకటేశ మన్నను పేరిగాడన్నను జంఘాలశాస్త్రి యన్నను చారిత్రక పురుషులేమో అనెడు విభ్రాంతిని కల్పించు నంతటి విఖ్యాత కవు లుండిరి. ఈ గిరీశము చారిత్రక పురుషుడు కాడుగాని భగవత్కవి నిర్దిష్టుడు చారిత్రక పురుషుడై మహోద్దండుడై యుండగలడు. అనగా భాగవతమైన దివ్యభావనము సామాన్యమైన ఊహామాత్రముకాదని యెరుంగదగును. రెండవదియగు మనీషి శబ్దము బుద్ధిమంతుడని యర్థమిచ్చునది యగును. మనీషి విశేషణము వలన బ్రహ్మార్పణబుద్ధితో సుస్థిరముగ మన ముండిన జాలును. ఆ భగవంతుడు మనీషి, కావున ఏరూపంబున మన యునికి యోగక్షేమవంత మగునో ఆ రూపంబు నెరిగి తానట్లు నిర్వహించు ననెడి

నిర్ణయ ముపాసకులకు కలుగవలయును. గీతలయందును "యోగ
క్షేమం వహామ్యహం' అనియును, 'మోక్షయిష్యామి మాశుచః' అని
యును, అభయహస్త మీయబడియున్నది. అట్లే మనీషిశబ్దము ప్రయో
గింపబడియున్నది. ఇందొక విశేషముగలదు. కవి అయ్యు కవికి మించిన
వాడెట్లగునో మనీషియయ్యు మనీషికి మించినవాడగుచున్నాడు.
కావుననే అనంతరమున రెండు విశేషణములు గలవు 'పరిభూః'
'స్వయంభూః' అని భగవంతుడు సాక్షాత్కరించి కాపాడవలెనని అన
నక్కరలేదు భగవదనుగ్రహము సంపాదించుటకు కావలసిన జ్ఞానధ్యానా
దులును ధర్మనిర్వహణాదులును బుద్ధియోగావలంబనమును గావించు
కొనుచున్న జాలును. ఆభగవంతుడు అగోచరుడయ్యు గోచరప్రాయు
డగును. ఈదేశము ఆదేశము, ఈకాలము ఆకాలము, ఈవయసు
ఆవయసు అని యనుకొనకుము, ఎందైనను ఎప్పుడైనను ఏరూపమున
నైనను ప్రత్యక్షముననో పరోక్షముననో ఓఉపాసకా! నిన్ను గాపాడక
మానడు. అనెడు నిబ్బరము శిష్యునకు కలుగవలయునని రెండు విశేష
ణములను వాడెను. పరిభూః అనగా సర్వభూతరూపుడు, స్వయంభూః
అనగా స్వయంభూతరూపుడు. నీతివిహీనులైన రక్కసుల నడుమ
సర్వార్పితచిత్తవృత్తితో పరితపించుచున్న సీతాదేవికి ఆరక్షోలోకమున
రాక్షసుడేయయ్యు రామచరణైక శరణుడైన విభీషణుడు సీతాబంధ
మోక్షకారణు డయ్యెను. మహాభయంకర సముద్రాంతర్భాగమునం
దుండవలసివచ్చినను, కాపాడదలంచెనా! భగవంతుడాసముద్రమున
పెద్ద కెరటము రూపమై నిన్నొడ్డును బడవైచును. లౌకికజ్ఞానముచే
నీవేమేమో యనుకొందువు కాని అది భగవత్కార్యము. కావుననే
భగవంతుడు ధ్యానమునందు గోచరుడైనను కానున్నను గోచరప్రాయు
డని నిబ్బరముతో ధ్యానజ్ఞానాదు లవలంబించుకొనుము. ఫలము
సిద్ధము నిస్సందిగ్ధము. ఇక లోకమునందలి కొల్ల సంఘటనములును

భగవదధీనము లని భగవంతునియొక్క జ్ఞానేచ్ఛాక్రియాశక్తి రూపము లను వర్ణించుచున్నాడు. ఈజగచ్చక్రమును ఈజగద్ధర్మ నిర్వహణమును భగవదధీనమై యున్నది. యాథాతథ్యముగ సకలార్థములను సర్వకాల ములయందు సంధానించుచున్నవా డతడే యని కడపటివాక్యము. ఈవాక్యము మొదటిమంత్రములోని మొదటివాక్యమునకు సార్థక్య మును చెప్పుచున్నది. అతడీశుడు, పాలకుడు అగుటచే సకలార్థములను యతడే యనుసంధించును. ఎల్లదియు నతనిదే. నీవు నీప్రవర్తకత్వము నీయహంవృత్తిత్వము సర్వము తదధీనము కావున తదర్పితుడవై యుండుము అని యుపదేశించెను.

౯. మంత్రము

అంధంతమః ప్రవిశంతియేఽవిద్యాముపాసతే
తతోభూయ ఇవతే యఉ విద్యాయాంరతాః॥

తా॥ ఈమంత్రమునందు విద్య అవిద్య అను రెండువిషయములను సమన్వయము చేయుచున్నాడు. దీనినిబట్టియే పూర్వమంత్రములలో నేదియో యొకవిద్య ప్రసక్తమైయుండెనని సంగతి సందర్భములంబట్టి యూహించి తీరవలయును. అవిద్య, దహరవిద్యయో, అక్షిపురుష విద్యయో మరియేపురుషవిద్యయో అయి యుండవలయునుగదా! అట్లగుటంబట్టి బుద్ధియోగమునకు సంబంధించిన ఉపాసనావిద్య నుద్దే శించి అకారాది శబ్దములకు చెప్పబడిన వ్యాఖ్యానము న్యాయ్యమై యుండును. ఎవ్వరు అవిద్యయే (అసత్తే) ఉపాసనాయోగ్యమని తలంతురో వారు గాఢాంధతమస లోకంబులం బ్రవేశింతురని శాపపూర్వక

ముగ చెప్పుచున్నాడు. అవిద్యను కాలదన్ని విద్యయే ఉపాసనా యోగ్యమని అనెడువారు పూర్వోక్తమైన అంధతమస్సులోకములకంటె అంధతర అంధతమ మహాతామసలోకముల ప్రవేశింతురని కఠినముగ స్పష్టముగ చెప్పుచున్నాడు. ఇందుపయోగింపబడిన అవిద్యయను శబ్దమున నకు మోక్షేతరసంబంధమని చెప్పవలయును. అమృతత్వప్రాపక ... కాని దెల్ల అవిద్యావాచ్యమే. వైజ్ఞానిక నిర్ణయములు తర్కసిద్ధాంతములు కార్యకారణ కల్పనాపైదగ్ధులుమున్నగు మహాపాండిత్యమెల్ల అవిద్యా వాచ్యమే. అట్లవిద్యావాచ్యమని దానిని త్యజింపరాదు. దానినుపాసింప దగును కాని ఆయవిద్యాస్వరూపమును విద్యయందు లయముగావింప వలయును. విద్యావిద్యలసామరస్యము ఈమంత్రమునకు ప్రధానము. అవిద్యామాత్ర సమాశ్రయణమువలన క్షేమము సంభవింపదు. ఋణ మైన గావించి ఘృతమును త్రాగవలయు ననెడు కేవల శరీరభోగ సాధనామాత్రపరమైనవానినే సాధించుట యవిద్యోపాసన మనబడును. ఇక విద్య యనగా అమృతత్వప్రాపక మగునది. అట్లని అవిద్యా తిరస్కార పూర్వకముగ విద్యాపురస్కార మగునెడల పతియును నాశహేతువే. సాధారణముగ నిదియంతయు నేల 'బ్రహ్మవిద్యయే విద్య జ్ఞానమువలననే కైవల్యము మిగిలినదంతయు అజ్ఞానమే. మనకేల యీగొడవ.' అని కొందరనుకొందురు. అదితప్పు. అట్టియర్థముతోడనే "జ్ఞానాదేవతు కైవల్యం" అను వాక్యముగలదు. ఆవాక్యములోని 'తు' శబ్దమువలన అవిద్యయు గ్రహింపబడుచున్నది. మరియును గీతల యందును "వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః" అని ప్రత్యేకముగ విద్యాకైవల్యవాదుల నుద్దేశించి చెప్పియున్నాడు. ఇంతకును విద్యయు అవిద్యయు పుష్పము వాసన ఉండినయట్లు సమనిత్యమై యుండును. తార్కికులుకొందరు విద్యకు అవిద్యాత్వము అత్యంతవిరోధము కావున, ఒకవస్తువున కొక్కస్వభావము స్వధర్మమై యుండును

కావున విద్యకు అవిద్యతోడి సంబంధమును అవిద్యకు విద్యతోడి సంబంధమును నుండ నేరదని నిర్ణయింతురు. వెలుగుతో చీకటికిని చీకటితో వెలుగునకును సంబంధ ముండనియట్లు తేజస్తిమిరములవంటి యీ విద్యావిద్యల సంబంధము గగన కుసుమాఘ్రాణ మనియందురు. ఔను తార్కికులకట్లే! భావుకులకు మాత్రము గగన కుసుమముగూడ ఆఘ్రాణ యోగ్యమగునది యగును. పరిమళభర సుందర తరులతా గుల్మవిస్తార భూమికి జననిజలమై తజ్జలమున కగ్నియై తదగ్నికి వాయువై తద్వాయువున కాకాశమై యుండుట నిక్కమే యగునేని భూగత మల్లీ కుసుమాఘ్రాణము గగనమందును సూక్ష్మాతి సూక్ష్మ రూపమున ఆగగన కుసుమాఘ్రాణము సంభవమై యుండును. వైజ్ఞానికులుగూడ గగనమునుండి సకలపదార్థములను గ్రహింపవచ్చుననెడి నిర్ణయమునకు వచ్చియున్నారు. ఇక తర్కపదజాలేంద్రజాల వృత్తి విడిచి తేజస్తిమిరములవంటివే యైనను విద్యావిద్యల ఏకీకరణము ముఖ్యమని వేదపురుషుడు చెప్పుచున్నాడు కావున నమ్మి తీరవలయును. ఇంతకును ఉపాస్యమగునది కేనోపనిషదాదులయందు నిషిద్ధమై యున్నది కావున ఉపాసనానిషేధమే యీమంత్రమునందు చెప్పబడుచున్నదని యనుకొనుట యొకపెద్ద పొరపాటు. ఆ కేనోపనిషత్తునందలి 'నేదం యదిదముపాసతే' అనువాక్యము ఉపాసనానిషేధమునకై పుట్టలేదు. బ్రహ్మము సర్వాతిశాయియనియు, మనస్సునకు మనస్సనియు, నిక్లెసర్వమునకు వర్జ్యమనియు స్పష్టపరచుట కవలంబించినధోరణికాని ఉపాసనానిషేధము కాదు. కావుననే "అన్యదేవతద్ విదితాత్" అథో అవిదితాత్ అధి ఇతిశుశ్రుమ పూర్వేషాం యేనస్తద్వ్యాచచక్షిరే." అనియుపక్రమింపబడినవాక్యమే అర్థాన్తరములచెప్పబడెను. అపరబ్రహ్మతత్త్వము ఎరుగబడినదానికంటెను, ఎరుగబడదను దానికంటెను మించియున్నదని చెప్పుచున్నది. ఇక ఉపాసనానిషేధముగాదు. ఈయుపనిషత్తులోని 'యాథా

తథ్యతోఽర్థాన్ వ్యదధాత్' అనువాక్యమువలన పురుషార్థములయందు రెండు భగవత్పరి రక్షితములై మిగిలినరెండును ఉపాస కోపాశ్రితములై యుండదగునని చెప్పిన యీ ద్విత్వవిధానమే విద్యావిద్యల విలసనమని ఎఱుంగవలయును. ధర్మార్థములు తదధీనములనియు, కామమోక్షములు త్వదధీనములనియు గురుశిష్యసంవాదమున చెప్పబడెను. కావుననే ధర్మాదిగ్లానిసంభవించునా డవతరింపవలసివచ్చును. ధర్మార్థవ్యవస్థాపనము భగవదధీనము. ఇక కామమోక్షములు రెండును బుద్ధియోగసంపన్నుడై భగవదధీనము గావింపవలయును అని యుపదేశించు చున్నాడు. గీతలయందు 'మోక్షయిష్యామి మాశుచః' అనువాక్యమున కిదియే తాత్పర్యము. ఈచర్చవలన విద్యయు అవిద్యయు అంధతమసలోకముల నొందించునవియే యగుటవలన రెండును త్యాజ్యములా, యనెడుమూలచ్ఛేదకశంక పుట్టనక్కఱలేదు. అట్టిది వేదాభిప్రాయముగాదు. గీతలయందును "వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః" అని వేద్యత్వము వర్ణింపబడినది. వేద్యత్వము విద్యకుగలదుగాని అవిద్య కుండదు. దీనిని సమన్వయించుటకే కొందరు ఇందలి విద్యాశబ్దమునకు ఉపాసనాదికమనియు, అవిద్యాశబ్దమునకు కేవల ప్రపంచాశక్తియనియు వ్యాఖ్యానించిరి. ఏవిద్యాశబ్ద మీమంత్రమం దుపయోగింపబడెనో ఆ విద్యాశబ్దముచేతనే "విద్యయా అమృతమశ్నుతే" అని స్పష్టముగ అమృతత్వప్రాపకమగునది విద్య యని చెప్పెను. కావున మృత్యుప్రాపక మవిద్య. అమృతప్రాపకము విద్య అని చెప్పుకొనవలయును. మృతిని మృతిగనే విడిచెడు కార్యము తుచ్ఛకార్యము. మృతిని అమృతమునందు మేళవింప జేయవలయును. అనగా మృతి అమృతముగ పరిణమింపవలయును. అప్పుడు సర్వము విద్యారూపమగును. వేదమయమగును. అనేకపదార్థములు చెడె ననుకొనుడు. మృతములయ్యె ననుకొనుడు. ఆ మృతపదార్థములు అభ్యుదయ రూపామృతములకు సహాయకారులుగ వినియోగింప బడవలయును. సస్యాదులయొక్క అభివృద్ధికి

మృతపదార్థములు సహాయకారులు. వానినే ఎరువనియు నత్తువనియు నందురు. శుష్కములగు జలములు పుష్కలములగు మేఘములకు కారణము. ఇట్లే నాశప్రకాశ ధర్మచక్ర భ్రమణము ఈ సృష్టి రహస్య మని తెలిసికొనవలయును. వైజ్ఞానికులు గూడ అనేక మృత పదార్థముల యందు వ్యాపించిన తేజఃప్రసరణము కొన్ని కొన్ని పదార్థములుగ మారుచున్నదని చెప్పుచున్నారు. Hydrogen is formed by the contact of the radiatian with the dead bodies అని వైజ్ఞానిక నిర్ణయము. ద్వైతమా అద్వైతమా యని, 'కన్నుజోడి' యని గిన్నెల నాట రవ్వలలో పడక తత్త్వావగాహనము గావించుకొనుట శ్రేయము. భగవంతుడొక్కడే. తత్త్వ మద్వైతమే. అద్వైతము కాదని ప్రపంచమున ఏనిశిత మతమును నిర్ణయించియుండలేదు. కావున ప్రపంచ మెల్ల అద్వైత మేకాని అద్వైతమునకున్నంత యస్తిత్వము ద్వైతమున కుండునా ఉండదా అనునదియే సందేహము. ద్వైతముయొక్క అనా దిత్వము అంద రంగీకరించినదియే. ద్వైతమనంతము కాదని యద్వైత వాదము అదిసత్యమే. ద్వైతమున కనంతత్త్వము సిద్ధించుచో మోక్షము నసంభవమే. మోక్షమనుటయే ద్వైతముయొక్క సాంతత్త్వము. ఇదియే అమృతీకరణము. ఈ సృష్టిరహస్యమంతయు నిండమిడియున్నది. మోక్ష విద్య 'అహంబ్రహ్మాస్మి' 'సోఽహమస్మి' అని నిత్య మనుసంధానించుటయే యనియుందురు. తావన్మాత్రము బ్రహ్మవిద్య కాదు. పై వాక్యములను అయిదు ప్రకారములుగ జపించినంగాని మోక్షము కలుగదని పూర్వ సూత్రకర్తలే నిరూపించియున్నారు. ఆపంచ ప్రకారవిద్యయే విద్యావిద్యల సమ్మిళనము. గీతలయందు "కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః క్షిప్రంహిమానుషేలోకే సిద్ధిర్భవతి కర్మజా" అని కర్మజసిద్ధిని నిరాకరించుచున్నాడు కావున బ్రహ్మవిద్యకు ముఖ్యమగు విషయము ఫలకామనా నివృత్తి కర్మకరణప్రవృత్తి. యీనివృత్తి ప్రవృత్తులసంపత్తి

సముదాయముగా జ్ఞానమనియుందురు. దీనినే గీతాపరిభాషలో బుద్ధి యోగమని చెప్పవచ్చును. ఈమంత్రాభిప్రాయము ననుసదించుచు సందేహనివారణార్థము వేరొకమంత్రము నుపదేశించుచున్నాడు.

౧౦. మంత్రము

అన్యదేవాహు ర్విద్యయా అన్యదేవాహు రవిద్యయా
ఇతిశుశ్రుమ ధీరాణాం యేన స్తద్వ్యచచక్షిరే

తా॥ ఈమంత్రమునందు అప్పటికుండిన గురుపరంపరా సంప్రదాయము ననువదించుచున్నాడు. విద్యచేతను వేరుఫలమే అవిద్యచేతను వేరుఫలమే అగును, అని చెప్పుచున్నాడు. అవిద్యచేత మూఢలోకములను విద్యచేత మోక్షమును కలుగుచున్నదని వ్యాఖ్యానించుకొనరాదు, అదితప్పు. ఈమంత్రములోని అన్యత్ శబ్దమునకు అమృతాదన్యత్ = అమృతముకంటె వేరగునది యని యర్థము చెప్పుకొనవలయును. సకలోపనిషత్తులకును అమృతప్రాప్తినిరూపణమే ప్రధానము గావున నుపనిషత్తులయందు ప్రయోగింపబడిన అన్యశబ్దమునకు ఉపనిషచ్ఛ్రుతిపాదితబోధార్థాన్యమని యర్థము. అట్లుచెప్పకొనకున్న ౮—౧౧మంత్రములు సమన్వితములు కానేరవు. కాకాక్షిన్యాయ్యమున గేహళీదీపన్యాయ్యమున యీపదియవ మంత్ర ముపదేశింపబడెను. ఈ మంత్రము పూర్వోక్త మంత్రార్థప్రకాశకము. కావుననే అన్యశబ్ద ప్రయోగమువలన, కేవల విద్యవలన, కేవలా విద్యవలన మోక్షములేదని ఈశావాస్యము నుగ్రహముకాదని చెప్పుచున్నాడు. కేనోపనిషత్తునందు చెప్పబడిన "విదితాత్ అవిదితాత్" అనుశబ్దములయర్థమే యిందుపనిబద్ధమయ్యెను. ఈమంత్రమునందు "ధీరాణాం" అనుపదమునుబట్టి గురుశిష్యన్యాయము మెంత ప్రాచీన

తమమో విజ్ఞులూహించుకొనుడు. కావుననే బ్రహ్మవిద్య గ్రంథావలోకనజాతముకాదు. గురుపరంపరానంభూతము. అని "ఇతిశుశ్రుమ ధీరాణాం" అను వాక్యము బోధించుచున్నది.

౧౧. మంత్రము

విద్యాంచా విద్యాంచ యస్తద్వేదోభయగ్ం సహ।
అవిద్యయా మృత్యుంతీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే॥

తా॥ ఈ మంత్రమునందు విద్యావిద్యలు సహానిందాన్యాయమున సమన్వయించి చెప్పుచున్నాడు. విద్య ఎట్లు ప్రశస్తమో అవిద్యయునట్లే ప్రశస్తము కాని యీ రెండింటిని ప్రత్యేకముగ రెండుగనే చూచినచో నింద్యములనియు ఒక్కటిగనే చూచినచో ప్రశస్తమనియు సమన్వయించుచున్నాడు. గీతలయందును "ఏకంసాఖ్యంచ యోగంచ యఃపశ్యతి" అనెడు వాక్యము దీనిననుసరించుచున్నది. విద్యయును అవిద్యయును సహచరితముగ తెలిసికొనవలయునని విధించుచున్నాడు. ఈ సాహచర్యము, సముచ్చయము వంటిదిగాదు. రామసహచరుడై లక్ష్మణుడడవికిపోయెను. అనగా లక్ష్మణుని యరణ్యగమన నిర్గమనములు రామాయత్తములుగాని లక్ష్మణాయత్తములుగావు. ఏకాధిష్ఠానమగు నప్పుడే సాహచర్యము సంభవము. కావుననే ఏకవిజ్ఞానమున సర్వవిజ్ఞానము సంభవమగుచున్నది. ఇదియిట్లుండ కొందరు ఋషిదేవతా ఛందస్సులను చక్కగనెరుగుట విద్యయనియుతత్ప్రకారమాచరించు కర్మకలాప మవిద్యయనియు, ఈ రెండింటి జోడింపువలన చిత్తశుద్ధికలుగుననియు చిత్తశుద్ధి మోక్షకారణమనియు మోక్షమునకు విద్యావిద్యోభయ సహాపేక్ష

నము పరంపరా సాధనమని చెప్పుచున్నారు. అట్టి ప్రసక్తి యీ మంత్రములయందెందును గానరాదు. మరియు ననేక స్థానములయందు విద్యయా కరోతి అని వేదములయందు చెప్పబడియున్నది. హిరణ్యగర్భోపాసనాది విద్యలు యిందలి విద్యాశబ్దమున కర్థముగాదు. ఏది యమృత ప్రాపకమో యది విద్య యని నిర్ణయించి యున్నాడు. కౌపీనసంరక్షణార్థమీ పటాటోపమన్నట్లు స్వసిద్ధాంత స్థాపనార్థము యీశబ్దాటోపమును విడుచుట శ్రేయము. ఒకవేళ అవిద్యకు కర్మార్థమే చెప్పుకొన్నను భంగములేదు. అవిద్యాశబ్దార్థమునందు నాస్తికేతరము లన్నియు సంగ్రహింపబడియున్నవి. ఇంతయేల జగద్విద్యకు అవిద్యయనియు బ్రహ్మవిద్యకు విద్యయనియు, యీ రెండింటి జోడింపు మోక్షమనియు సులువుగ ననుకొనవచ్చును. ఈ రెండింటియొక్క ఫలము తరువాత చెప్పుచున్నాడు. అవిద్యచే మృత్యువును తరించి విద్యచే అమృతమును పొందుచున్నాడు. గీతలయందును "యత్సాంఖ్యైః ప్రాప్యతేస్థానం, తద్యోగైరపి" అని విద్యావిద్యల తుల్య యోగబలములను నిరూపించి యున్నాడు. అవిద్యచే మృత్యువును తరించుట సంభవించును. అవిద్యచేత మృత్యువననేమి? ఆ మృత్యువు భయకారణమా? లయకారణమా? ప్రకృతిరూపమా? వికృతిరూపమా? మున్నగు సందేహములన్నియు నివారింపబడుటకు అవిద్యయే ముఖ్యసాధనము. సంశయాత్ముడు నశించును కావున సందేహము నివారించుకొనుటకవిద్య నవలంబించి, అమృత సాక్షాత్కారమునకు విద్య నవలంబింప వలయును. ఒకటి మృత్యుకారణము. ఇంకొకటి యమృతకారణము. మృత్యుకారణమనగా, చావు లేక శాశ్వతముగ యీ దేహముతో నుండుట కాదు. మరణభయ నిరాకరణము తత్కారణము. లోకమునందు కుండలయొక్క నిమిత్తోపాదాన కారణములను చక్కగ నెరింగిన కుమ్మరి ఘటాభావవిషయచింత లేనివాడైయుండును. శతాధికఘటములు తనకడ లేకున్నను, శతాధిక ఘట

నిర్మాణదాక్ష్యము కర్మకౌశలము తనయందుండుటచే నిర్దేశకర్తై హేతువుగ నుండగలడు. ఘటము ఘటాకారము ఘటోపహితాకాశము, ఘట మూలద్రవ్యమగు మృత్తు. ఇదియంతయును అవిద్యారూపమే. ఆమృత్తు స్వయముగ ఘటరూపమై పరిణమింపనేరదు కావున ఘటఘటత్వాదులెల్ల నవిద్యయని చెప్పవలయును. కాని యీ యవిద్యాసమ్మేళనము లేకున్న ఘట స్వరూపమే లేకపోవును. అందుచేతనే లోకమునందును వైజ్ఞానికులనిర్ణయము సంయోగ వియోగ విజ్ఞానముండినంగాని సమగ్రజ్ఞానముగ భావింపరు. కావున విద్యావిద్యోభయ సాహచర్యము సమగ్రజ్ఞానరూపము. దీనినే గీతలయందును బుద్ధియోగమని చెప్పియున్నాడు. బుద్ధియోగము బుద్ధిమాత్రపర్యవసాయియై బుద్ధికి పరమైయుండిన బుద్ధిగమ్యముగనుండిన దానియందు ప్రవేశించుట అనునదియే అమృతప్రాప్తి; నైష్ఠికమగు శాంతి, బ్రహ్మనిర్వాణము, అని చెప్పుదురు. అది బుద్ధియోగపరమఫలము. అమృతమశ్నుతే అను వాక్యములోని అమృతపదము ఏతన్మంత్ర పూర్వము ప్రయోగింపబడలేదు. కావున అమృతప్రాప్తి లక్షణమైన బుద్ధియోగమున కిది పరమ మూలము. యీ విద్యావిద్యలనే వాక్యాంతరములచే చెప్పుచున్నాడు.

౧౨. మంత్రము

అంధంతమః ప్రవిశంతియేऽసంభూతిముపాసతే
తతోభూయఇవతే తమో యఉ సంభూత్యాంరతాః॥

తా॥ ఈమంత్రమునందు పూర్వ మంత్రధోరణినే యుపదేశించుచున్నాడు. ఐనను పూర్వమంత్రముల యందున్న విద్యావిద్యల స్థానమునందు సంభూత్యసంభూతులను ప్రయోగించియున్నాడు. సంభూతి

యననేమి అసంభూతియననేమి అని సందేహింప తన్నివార
ణార్థము "సంభూతించ వినాశంచ" అని వేరొకమంత్రమునందు సం
భూతివినాశశబ్దము లుపయోగించెను. వినాశము మృత్యుతారణకారణ
మనియు సంభూతి అమృతి ప్రాపణకారణమనియు చెప్పుటంబట్టి సంభూతి
యన విద్యయనియు, అసంభూతియన అవిద్యయనియు తెలిసికొనవల
యును. ఈమంత్రము మందాధికారుల నుద్దేశించి చెప్పబడెననియందురు.
ఇంకను నెక్కువ ప్రసంగించినచో వేదవేదాంగములెల్ల మూఢుల నుద్దే
శింపబడినవే యుండురు. చెప్పవలసినది, వినవలసినది, తెలిసికొనవలసినది
యేదియును లేదను మహానిర్ణయ వేత్తలకు మా వ్యాఖ్యానము ద్దేశింప
బడ లేదు. తెలిసికొనదలచినవారికే యీ వ్యాఖ్యానము. ఈమంత్రమునం
దుపయోగింపబడిన సంభూతి శబ్దము నులువుగ సంభవమనియు అసం
భూతిశబ్దము అసంభవమనియు వ్యాఖ్యానించుకొందము. ఈ సంభవా
సంభవముల ఏకత్వానుదర్శనమే పూర్వ మునదేశింపబడి యున్నది.
అట్లయినను యీ మంత్రాన్వయమును 'అరణ్యమియాత్' 'తతోన
పునరేయాత్' 'భిక్షాచర్యాంచరంతి' 'న్యాసఏవఅత్యరేచయత్'
అనెడు శ్రుతులను తత్సజాతీయశ్రుతులను తీసికొని యీ మంత్రము
మందాధికారులకని వ్యాఖ్యానించిరి. ఆశ్రుతుల యర్థమును న్యాయముగ
మన మాలోచింతము. జీవితమునందుగాని మరణము నందుగాని
నీ వాశపెట్టుకొనకుము అనెడు వాక్యము నీతివాక్యము. శాశ్వత
ముగ బ్రతుకవలయు ననికోరువాడు నానావిధ ఘోర కృత్యకార్య
ముల నాచరించుటలో విముఖుడు కానేరడు. శాశ్వత దేహధారిత్వ
మసంభవము. జీవితమే ప్రధానమని యనుకొనుటయేగాని జీవిత
ప్రాధాన్యము నీ యధీనమున లేదు. అనుకొని నీవాచరించు నది స్వపర
హానికమై స్వనాశకారణమగును. లోకమునందుగూడ స్వజీవిత నిర్వ
హణమాత్ర బుద్ధులగువారే పరోపద్రవకారకులై కొంతకాలము విశ్రాం

భించినను సంపూర్ణముగ సహించువారగుదురు. హిరణ్యకశిపు రావణాదులట్టివారే. వర్తమానకాలమందును స్వసుఖవాదు లట్టివారే. అట్లే మరణమునందును కోరిక పెట్టుకొనరాదు. ఎవ్వడును మరణము కోరడు గాని ఒకప్పుడు కోరుటయును సంభవించును. స్వమరణమునే యభిలషించువాడు స్వమరణము తటస్థమైననుకాకున్నను పర మరణకారణ మగును జంకుగొంకులులేని స్వభావముగలవాడగుటచే అదియును దోషభూయిష్టమే. కావుననే నైతికులు ఆత్మహత్యా ప్రయత్నము కావించువారిని దండింతురు. అందుచే "జీవితేవా మరణేవా గృధింమాకురు" అని యాదేశవాక్యము పుట్టెను. దీనివలన జీవనమరణములు గృధి కధీనములు గావు. గృధియనగా దురాశ. ఇట్లుపదేశించుటవలన ఆశారహితుడగును. ఆచరణ సహితుడై ఆనంద మనుభవించును. గీతలయందును. అపరిహార్యమగు విషయమున దుఃఖింప నీవు తగవు. అని స్పష్టముగ చెప్పియున్నాడు. ఇక "అరణ్యమియాత్" అనుశ్రుతికి తాత్పర్య మెరుంగుదము. ఏస్థానమునుండి అరణ్యమును పొందవలయును ఆ అరణ్య మెట్టిదైయుండవలయును. కీకారణ్య బ్రహ్మారణ్యమా! కాక జానెడు మూరెడు ముక్కలతో నిండియుండిన యరణ్యమా? ఆయరణ్య స్వరూపము చక్కగ నిరూపింపబడక పోవుటవలన వేదమునం దుపయోగింపబడిన యరణ్యశబ్దమునకు లౌకికార్థము చెప్పకూడదేమోయని సందేహము కలుగును. పోనిండు. ఆ అరణ్యమునకు పోవుదము. ఏలపోవలయును అనుదానికి సమాధానమేమి? నగరాదు లీశావాస్యములు గావనియు అరణ్యమీశావాస్యమనియు నిశ్చయింతురా! కాదు. ఏకాంతవాసమునకు అని యందురా? అట్లయిన నిర్జనారణ్యమునకు పోవలయు నన్నమాట. ఏ యరణ్యమును నిర్జనమై యుండనేరదు. నిర్జనవాస గృహమైయుండినను నిర్జనమైయుండదు. అడవులకు జనులు పోవుట వచ్చుట సంభవమే. ఇక నిర్జనారణ్య మనుటయు పొసగదు. నిశ్శబ్దారణ్యమని

యుందుమా ? నిర్జంత్వారణ్యము కావలయును. నిర్జంత్వారణ్యము సృష్టి లోనే లేదు. కావున అరణ్యమనగా ఒక గుహాయని అర్థము చెప్పి కొందురేమో అదియును పొసగనిదే. మీరాయర్థము చెప్పిన యెడల అరణ్యమనగా ఫలాహారశాలయని మేమర్థము చెప్పెదము. కావున యీ దిద్దడబిద్దవాదము విడిచి ఉపనిషద్గమ్యమును, ఔపనిషదపురుషోపాసనా కారణమును ఆరణ్యక సంజ్ఞకమును నగు బ్రహ్మవిద్యా బోధమునకు సుముఖుడు కావలయునని యర్థము. కావుననే యుపనిషత్తుల కారణ్యకములని పేరువచ్చెను. అరణ్యములందు చెప్పబడినవి కావున యీ యుపనిషత్తు లారణ్యకములని నిర్వచించిరి. ఈ నిర్వచనము తీర్థమునకు తీర్థము ప్రసాదమునకు ప్రసాదమువలెనున్నది. అట్లయినయెడల సనక సనందనాదులు, మరీచాద్యులు నారదాదులు విశ్వామిత్ర వశిష్ఠాదులు నరణ్యములయందున్నట్లు నిర్ణయింపవలసి వచ్చును. వారారణ్యకులును ఆటవికులును కానేరరు. తమతమ గురుకులములను (బ్రహ్మవిద్యాశాలలను) తత్తత్ప్రాంతములయందు స్థాపించినయట్లున్నది. ఆ ప్రదేశములకు తపోవనములని పేరు. తావన్మాత్రమున నవి యరణ్యములయిన్నచో మహానగరములు నరణ్యములే. నగరములన్నియు నించుమించు నరణ్యావృతములై యుండును. ప్రమదావనము క్రీడావనము కృతకాద్రులు బృందావనము మున్నగునవి లేవా ? అవి యరణ్యములా ? కాన అరణ్యమనగా మహాతరుగుల్మలతా ఘోర క్రూరమృగ సంకుల భీకరారణ్యమని యర్థము కాదు. ప్రపంచవాసనా నానా సంక్షోభ రూపమైన 'రణ్యము' (రాణువ) లేనిది యరణ్యము. అట్టిది మహానగరములయందున్నను, మహాభీకరారణ్యములయందున్నను గుహాలలో దాగినను బుద్ధియోగి యగుచో సంభవము. కాకుండిన కాదు. కావున అరణ్యగమన మనగా బుద్ధి గుహాప్రవేశ మని యర్థము. అట్టిదానినే గుహ్యావిద్య అని యందురు. దానిని పొందిన

వాడు భ్రష్టుడు కారాదని హెచ్చరిక చేయుచున్నాడు వేదపురుషుడు. అది యట్లుండనిండు. "భిక్షాచర్యంచరంతి" అను నొక వాక్యమును తీసికొని భిక్షుకుడు కావలయునని వ్యాఖ్యానించుచున్నారు. సత్యమును కొందము. జనకాదులు భిక్షుకులుగారు. జానశ్రుత్యాదులు భిక్షుకులు గారు. ఇంతయేల ఔపనిషద పురుషుని నిరూపించిన మహాపురుషు లెవ్వరును భిక్షుకులుగారు. "మేముకాముగాని ఓశిష్యులారా! మీరు మాత్రము భిక్షాచర్య నాచరింపుడు" అని యుపదేశించుచున్న దందురా! అదియును కల్ల. సనకసనందనాదులు భిక్షుకులై తిరిగినట్లు వర్ణింపబడలేదు. పౌరాణికముగ శివుడు భిక్షమెత్తెనందురు. కానిండు ఆధ్యాత్మిక విద్యావిషయమున భిక్షాచర్యకు వేరర్థము కలిగియుండును. కావునే 'ఉంఛవృత్తి' మున్నగునవి భిక్షాటనములుగావు. భిక్షాచర్యలు గావచ్చును. యదృచ్ఛాలాభసంతుష్టుడై యెవ్వడుండనేర్చునో వాని జీవనము భిక్షాచర్యమని పారిభాషికముగ వైదికభాష చెప్పుచున్నది. లోకమునందు బుద్ధియోగులగువారు తమకు లభించినదెల్ల భగవదనుగ్రహ భిక్షారూపమే యని భిక్షాచర్యమున నుందురు. రాజాధిరాజైనను తనసంపదయెల్ల భిక్షాచర్యమని యూహించుకొనవలయునని బోధించుచున్నది. ఎవ్వరిదైశ్వర్యమైనను సహాయభిక్ష పరిశ్రమభిక్ష అనుగ్రహభిక్ష ఆశ్రయభిక్ష అయి యెల్లదియు భగవదనుగ్రహభిక్షారూపమని యెరుంగవలయును. ఆ యభిప్రాయముండుటచేతనే జగజ్జనకుడైన భగవంతుడు శివుడే స్వయముగ భిక్షానంపన్నుడని వర్ణించిరి. కావున ఆధ్యాత్మిక విద్యాసంపన్నులు చేత జిప్ప బట్టుకొని ఇంటింటికి తిరిగి భిక్ష యెత్తవలయునని ఏ గురువును విధింపడు; ఏ వేదమును విధింపలేదు; అపార్థమును గావింపకుడు. అనగా ఔదాసీన్యవృత్తికే భిక్షాచర్య మని పేరు. సూత్రకర్తలును ఉపనయనకాలమునందు విధించిన భిక్షాటనము భిక్షాచర్యావ్యాఖ్యాన భూతక్రియావిశేష మను నభిప్రాయముతో "నాత్మ

ప్రయోజనః చరేత్'' అని విధించిరి. ఈ భిక్షాచర్య పదము తన పారిభాషికార్థమును కోల్పోయి భిక్షాటన పర్యాయముగ వ్యాఖ్యానింపబడుట మనదురదృష్టము. గీతలయందును యజ్ఞశిష్టాశులు అని భిక్షాచర్యమునకే వ్యాఖ్యానప్రాయముగ చెప్పబడియున్నది. అన్యోన్యదానాదులచే జీవయాత్ర నిర్వహింపబడుట నిక్కము. ఈ విషయమున కాళిదాసు చక్కగ వర్ణించినాడు: "సంపద్వినిమయేనోభౌ దధతుర్భువన ద్వయం'' భూమీశునకును స్వర్గేశునకును సంపద్వినిమయమును వర్ణించియుండెను. దిలీపునినుండి ఇంద్రుడు యాచించి, ఇంద్రునినుండి దిలీపుడు యాచించి లోకద్వయమును కాపాడిరి. వారి చర్యయే భిక్షాపరిగ్రహచర్య కాగా ఇక మిగిలినవారిమాటయేల! గీతలయందును "తైర్దత్తా న ప్రదాయైభ్యో యోభుంక్తే స్తేన ఏవసః'' అని భిక్షాచర్యాచరణాభావమును కర్మను నిష్ఫలము గావించుటకు చెప్పియున్నాడు. దానినే భిక్షాచర్యమని వాడుదురు. కావుననే ఆసుర సంపద్వర్ణనా సందర్భమున "యక్ష్యే దాస్యామి మోదిష్యే ఇత్యజ్ఞాన విమోహితాః'' అని వర్ణించి యుండెను. కావున అందరును భిక్షుకులుగ నుండవలయుననియే పరిభాషా తాత్పర్యము. అట్లుండకుండుట ఆసురసంపద. ఇట్లు చెప్పుటవలన సంపాదిత సంపత్తియందు పూర్వ ముపదేశించిన స్వీయత్వత్యాగబుద్ధి చక్కగ ప్రబోధింపబడిన దగును. భిక్షాచరణ మనగా నిష్కామ కర్మాచరణ మని "త్యక్త్వా, భుంజీథాః'' అని బోధపడును. "కరతల భిక్షా, తరుతలవాసః'' అనునది కేవలాక్షరములతో వేదములందు గానవచ్చునేని నిశ్చయముగ చిప్పబట్టి ముష్టియెత్తు కొనుమని విధింపవచ్చును. భిక్షాచర్య వేరు భిక్షుకచర్య వేరు "న్యాసః ఏవ'' అనుశ్రుతికి సన్న్యాస పర్యాయముగ నర్థము చెప్పుట పొసగనిదే. వర్తమానకాలమునందు సన్న్యాసశబ్దమునకే యర్థము కాషాయాంబర ధారిత్వాదికము గ్రహింపబడుచున్నదో దానినే మేము నిరసించుచున్నాము. న్యాసమనగా (నితరాం అస్యతే నిక్షిప్యతే ఇతి

న్యాసః" ని+అసః) బ్రహ్మార్పణబుద్ధితో నుండుట యని తాత్పర్యము. ఈమంత్రమునం దుపయోగింపబడిన సంభూతిశబ్దము పూర్వమంత్రముల యందలి "పరిభూః స్వయంభూః" అను పదములయొక్క మూలధాతువు నుండి వ్యుత్పన్నమైన పదము. కావుననే సంభూతికి విద్య యనియు అసంభూతికి అవిద్య యనియు యర్థము చెప్పవలసివచ్చును. అవిద్య అసంభవ రూపమునకుండు నదేమైనను విద్యాసాహచర్యమున సంభవ రూప విలసితము కగును. అప్పుడే నావాస్యము కాగలదు, కావున సంభూత్యసంభూతులను ప్రత్యేకించువారు ప్రమత్తులగుదురని నిర్ణయించు చున్నాడు. అసంభూతియందు మాత్రమె మిక్కిలి సక్తులగుదురో అట్టివారు తామసికులు, సందేహములేదు. కాని అంతకుమించిన తామసికులై పోదగుదురని ప్రత్యేకింపబడిన విద్యోపాసకులను నిందించుచున్నాడు. అనగా నిర్గుణోపాసనయని ఉపాసనాంగమునకు చెందని యందముకు మాటలతో కాలము వెళ్ళబుచ్చు పురుషులు తామసికాధిక తామసులు సుమా యని చెప్పుచున్నాడు. గీతయందును, "అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భిరవాప్యతే" అని స్పష్టముగ చెప్పియున్నాడు. ఇంతయేల గుణమే లేకున్న యుపాసనమే లేదు. నిర్గుణోపాసనము వంధ్యా పుత్రులను గురించి యుద్దేశింపబడినది.

౧౩. మంత్రము

అన్యదేవాహుస్సంభవా దన్యదాహు రసంభవాత్
ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే॥

తా॥ ఈమంత్రమువలన సంభూతి శబ్దమునకు సంభవమని యర్థము చెప్పదగునని అనుమతించుచున్నది. సంభవమనగా అస్తిత్వము;

అసంభవమనగా నాస్తిక్యము. ఇంతవరకును అందరును సమ్మతింతురు. కాని 'సంభవాత్' అనునప్పుడు కార్యబ్రహ్మోపాసనార్థముగను 'అసంభవాత్' అనునప్పుడు ప్రకృత్యుపాసనముగను వ్యాఖ్యానించి సంభూతి యనగా హిరణ్యగర్భుడు అని యేమేమియో వ్రాసిరి. ఆ హిరణ్యగర్భాది ప్రసక్తి యుండుటలేదు. ప్రకృత్యుపాసన మెందును ఉపదిష్టము కాలేదు. విద్యావిద్యాపదములుగ చెప్పుకొందుమన్నను కార్యబ్రహ్మవిద్య యను వ్యవహారమైనను లేదు. కావున ఉపాసనా పర్యాయముగను నర్థము చెప్ప వలసివచ్చినప్పుడు సంభవోపాసన మనియు, అసంభవోపాసన మనియు, చెప్పి సంపదకోపాసన మనియు ప్రతీకోపాసన మనియు సమన్వయించుకొన్న సుఖముగనుండును. కేవలప్రతీకోపాసనయు కేవలసంపదకోపాసనము ప్రమాదకారణములు ప్రతీకసంపదక సంయోగము సుఖముగ నుండును. కావున పదియవమంత్రమునకగు వ్యాఖ్యానమే యుండునుశబ్దాంతరములతో చెప్పబడెను. ఈ యుభయోపాసనము ననువదింప గీతయందు "అవజానంతి మాం మూఢాః మానుషీం తనుమాశ్రితం। పరం భావ మజానంతః మమ భూతమహేశ్వరం" అని చెప్పియుండెను. మానుషాకారసంపన్నుడగునప్పుడు భగవంతుడెట్లగును అని భగవత్స్వరూపము నెరుంగక మూఢులు నిందింతురు అనిస్పష్టముగ చెప్పియున్నారు. ఇదియే ప్రతీకనింద సంభూత్యసంభూతి సాముదాయమునకే గీతలయందు విభూతి యోగ మారంభింపబడెను.

౧౪. మంత్రము

సంభూతిం చ వినాశం చ యస్తద్వేదోభయం సహ ।
వినాశేన మృత్యుం తీర్త్వా సంభూత్యాఽమృతమశ్నుతే ॥

తా॥ ఈ మంత్రమునందు విద్యావిద్యల విషయమే మరియొక

రీతి చెప్పబడుచున్నది. కావున పూర్వమంత్రములయం దెట్లు విద్యా విద్యల యన్వయ మయ్యెనో అట్లే యిందును అన్వయము చేసికొని తీరవలయును కాని సంభూతి యనగా అసంభూతియనియు, వినాశమనగా అవిద్యయనియు విభాగించుకొని చెప్పవలసిన ఆవశ్యకత కానరాదు. ఏత న్మంత్ర రహస్య శ్లోకములయందును "సంభూతిం కార్యం రూపంచ వినాశం కారణాత్మకమ్" అని సంభూతి శబ్దమునే ప్రయోగించెను. కావున యీ మంత్రమునందు సంభూతియు వినాశమును ప్రసక్తములై యుండెను వినాశము మృత్యు కారణ కారణమని చెప్పుటచే పూర్వ మంత్రమునందలి మృత్యు కారణకారణమైన అవిద్యయే అర్థమని చెప్ప వలయును. వినాశనమునకు అవిద్య యని యర్థమగునపుడు సంభూతికి విద్య యనెడు అర్థము స్వయము లబ్ధమగును. మరియొక మాట విద్యావిద్యల ప్రశంస కావించుటవలన విశేషార్థ మిం దున్నదనియు పూర్వమంత్ర బోధమువలన నివారితములు కాని సందేహము లిందు నివారింపబడుచున్న వనియు గ్రహింపవలయును. లోకమునందు సశరీర ముగ స్వర్గాదిలోకములను పొందుచున్నారనియు ముక్తులగువారు యీ శరీరముతోడనే యుందురనియు, ఒకవిధమగుభ్రాంతితో కొందరున్నారు. మృత్యువుజయించుట యనగా చావు లేకుండునట్లు చేసికొనుటయే మో అనెడు భ్రాంతితో నున్నారు. దీనికొరకే మృత్యుంజయ మంత్రము లనియు, మృత్యుంజయోపాసన మనియు, చిరంజీవులగుట యనియు, సంప్రదాయము లుద్భవించినవి. యోగములయందు గూడ లంబికా యోగ మని మృత్యురాహిత్యోద్దేశమున అవలంబింప బడుచున్నవి. కనుక ఈ భౌతిక శరీరము విద్యాప్రాప్తివలన అప్రాకృత శరీరమై బొగ్గు వజ్రముగ పరిణమించినట్లు వజ్రదేహు లగుదు రేమో యనెడు భ్రాంతి యున్నది. ఈభ్రాంతి నాధారముచేసుకొనియే జైనమతము మున్నగు మతములలో,రోగరాహిత్యము దేహసౌందర్యము దేహబలము మున్నగు

నవి మహాపురుష లక్షణములుగ భావింపబడినవి. వేదములయందును చ్యవనుడు ముదుసలితనమును జయించి యువకు డయ్యెననియు, పురాణములయందు ధర్మరాజాదులు తమ పెంపుడుకుక్కలతో కూడ స్వర్గారోహణము గావించిరనియు, నారదాదులు మూడులోకములను తిరుగుచుండిరనియు, అర్జును డొకప్పుడు ఇంద్రలోకమునకేగి వచ్చెననియు చెప్పబడియున్నవి. ఇవియన్నియు అర్థవాదములుగాని సిద్ధాంతములు గావు. ఇట్టిసందేహములనెల్ల నివారించుటకు ఈ మంత్రము ప్రారంభింపబడెను. మరియు నొక్కచో స్పష్టాక్షరములుగ “భస్మాంతగ్ం శరీరం” అని సిద్ధాంతీకరించియున్నాడు. ఇక మృత్యువును జయించుటయన నేమియో చెప్పుచున్నాడు. శరీరమునకు మరణము కలిగినను తనకు మరణము కాదని నిశ్చయ జ్ఞానము కలుగుట మృత్యుంజయము. ఈ మృత్యువు వికృతిరూపమా ప్రకృతిరూపమా యని సందేహించి నివారించుచున్నాడు. మృత్యువు ప్రకృతిరూపము కావున మృత్యువనునది తనకు భంగము కాదని నిరోధము కాదని విరోధము కాదని సంపూర్ణవివేకము కలుగవలయునన్న వినాశరూపజ్ఞానముపై నాధారపడియుండును. గీతలయందును “సమం సర్వేషు భూతేషుతిష్ఠంతం పరమేశ్వరం వినశ్యత్స్వ వినశ్యంతంయః పశ్యతి సపశ్యతి(13-27)” స్పష్టముగ వినాశ అవినాశశబ్దము లుపయోగింపబడెను. మరియు అనంతర మంత్రమునందు “సత్యస్యాపిహితంముఖం” అని చెప్పి “అపావృణు” అని ప్రార్థించుచున్నాడు. దీనినిబట్టి పాత్రదూరీకరణము వినాశజ్ఞానకారణమని నిరూపించుచున్నాడు. ముఖ్యముగ ఈ మంత్రముపాసనావిషయము కావున ఉపాసకాలంబపాత్రములైన ప్రతీక ప్రత్యయములు కూడ సంభూతియందు అమృతమయములగునని “సంభూత్యా అమృతమశ్నుతే” అని స్పష్టపరచెను. పరమనిర్ణయమునందును “ఏకమేవాద్వితీయం బ్రహ్మ” అని సర్వము బ్రహ్మము చెప్పుటచే వినాశావినాశములు పరంపరగ బ్రహ్మానందామృత కారణములని దృఢీకరించు

చున్నాడు. కావున వినాశజ్ఞానము కలుగక విద్యాప్రాప్తి కలుగదనియు విద్యాజ్ఞానము విడిచి వినాశప్రాప్తియు బోధపడదనియు అట్టివానికి పుట్టుట చచ్చుట యనెడు యీ రెండుగతులలో కొట్టుకొనిపోవుట తప్ప వేరుపాయము లేదని చెప్పి వినాశసంభూతుల యొక్క సమంజసైక్య జ్ఞానమువలన అమృతప్రాప్తి లభించునని ఉపసంహరించుచున్నాడు.

౧౫. మంత్రము

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖం
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే॥

తా॥ ఇంతవరకును విద్యారూపము అవిద్యారూపమును సంగ్రహముగ చెప్పించి తొమ్మిదవ మంత్రమునందలి "ఉపాసతే" అను పదము వలన ఎత్తుకొనబడిన ఉపాసనారూపమును పరమతాత్పర్యముతో ఈ మంత్రమునందు నిరూపించుచున్నాడు. 9 వ మంత్రమునకును ఈ మంత్రమునకును సంబంధమున్నదని చెప్పుట దూరాన్వయమువలె సాధారణులకు తోచవచ్చును కాని విద్యావిద్యానిరూపణానంతరము చెప్పవలసినది ఉపాసనావిషయమే గావున దానితోడనే దీనికి సంబంధము. కొందరీమంత్రములను మరణకాల జ్ఞాపకములని వ్యాఖ్యానించిరి. అదియంతయు స్వకపోలకల్పనమే. ఈమంత్రమునందు "త్వం అపావృణు" అని ప్రార్థనారూపమున్నది. ఇందు ప్రార్థింపబడినపురుషుడు "పూషణ్" అని పిలువబడెను. పూషణ్ శబ్దమునకు సూర్యుడని లౌకికార్థము. కాని యిందలి పూషణ్ శబ్దము ఉదయాస్తమయ వ్యాపారలక్షణ లక్షితుడైన సూర్యుడుకాడు. ధ్యానగమ్యుడైన సూర్యుడు. అయినను

ధ్యానగమ్యు సూర్యునియందు ఔపచారికముగ ఉదయాస్తమయ లక్షణము లారోపించుట స్పష్టబోధము కొరకని యెఱుంగవలయును. ఇదియే గాయత్రీ పరమరహస్యము. "తత్సవితుర్వరేణ్యం దేవస్య ధీమహియుఃధియః ప్రచోదయాత్" అని స్పష్టముగ ధ్యానకాలమునందలి బుద్ధినైశిత్యమును వర్ణించుచున్న గాయత్రీమంత్రమున కుపాస్యుడైన సూర్యుడే యిందు గ్రహింపబడుచున్నాడు. ఉపాసకుడు బుద్ధియోగమునందలి ధ్యానయోగ మవలంబించు నపుడు సర్వ సాధారణముగ ప్రారంభమునందు తేజోదర్శనమే యగును. అంధులగువో తేజస్సామీప్యానుభవము కలుగును. మరియును జ్ఞానేంద్రియములలో ఏ ఇంద్రియము ప్రబలముగనున్న ఆ యింద్రియమునకు గమ్యరూపమై ఆ తేజస్సే పరిణమింపగలదు. ఆ తేజస్సే ధ్వనిరూపముగను, కాంతిరూపముగను, ఉష్ణస్పర్శరూపముగను ఇట్లు తత్తద్రూపముల పరిణమింప గలదని విజ్ఞు లెఱుంగుదురు. శాస్త్రీయముగ నింత చెప్పగలిగినను అనుభవ రహస్యమిందు చెప్పుటయు ధర్మము. అంధులైనను భగవద్రూప దర్శన విషయమున సమర్థులగుటకు తత్కాల దృష్టి తత్కాలరూప జ్ఞానము తమకు కలుగును. పౌరాణికముగ లీలాశుకాదులుదాహరణములు. ఇది యిట్లుండ ఏమను "ఓ సూర్యా! హిరణ్మయమగు పాత్రముచే సత్యము యొక్క ముఖము కప్పబడినది. నీవు సాక్షాత్కారముకొరకు ఆపాత్రమును తొలగింపుమా!" అనిస్థూలముగ మంత్రార్థమగుచున్నది. కాని సూక్ష్మముగ నెంతయో విచారింపవలసియున్నది. "సత్యస్య ముఖం అపిహితం" అను వాక్యములోగల సత్యశబ్దమునకు భగవంతుడని యర్థము. ఆభగవంతుని యొక్క ముఖము కప్పబడినది. అనగా భగవద్దర్శనము కాకున్నది అని యర్థము. ఆత్మదర్శనము ఆత్మశ్రవణము ఆత్మమననము ఆత్మనిధి ధ్యానము మొదలగు ఆత్మానుసంధానకార్యములు దూరమగుచున్నవి. ఇట్లు దూరమగుటకు కారణ

మేమి ? ఆ సత్యముఖము కప్పబడుటకు కారణమేమి ? అని విచారింపగా మంత్రమే చెప్పుచున్నది — పాత్రేణ అను పదముతో స్పష్టము చేసెను. పాత్రముచేత కప్పబడెను అనియర్థము. ఇందలి పాత్రశబ్దము వ్యాఖ్యాతల కందరకును కంఠపాశ మైపోయెను. పాత్రమనికొందరు, కుండయనికొందరు, ఘనీభూతమైన తేజస్సని కొందరు, రశ్ములిందు పూరింపబడును కావున పాత్రమయ్యెనని కొందరు నానా విధములుగా చెప్పియున్నారు. ఇందలి పాత్రశబ్దమునకు ఉపాధివాసనా పరిణత దుర్నివారజ్ఞానమే అని అర్థమును చెప్పవలయును. ఆధారాధేయ భావముతో లోకమునందు ఏవస్తు జ్ఞానమైన కలిగియుండుటవలన అట్టి అవశ్య జ్ఞానప్రాప్తికి పాత్రమని పేరు. సంగ్రహముగ "ఉపాధి" అని చెప్పవచ్చును. వేదకాలమునుండి నేటివరకును ఈ ఉపాధిని 'ఘట' శబ్దముతో వాడుట ఆచారమైయుండెను. ఈ ఘట మిక నిలువదు అనగా ఈ శరీరము నిలువదనియర్థము. కావున పాత్రమునకు ఉపాధి యని అర్థము. మరియును మూతకు పాత్ర ముపయోగింప బడును కావున పాత్రశబ్దార్థము సందిగ్ధమయ్యెను. అందుచే ఔపాధిక బంధమే పాత్రమని చెప్పవలసివచ్చెను. ఇంక ఈ పాత్రమెట్టిదని శంకించి సమాధానమిచ్చుచున్నాడు. హిరణ్మయమగు పాత్రముచే గప్పబడెను. హిరణ్మయమననేమి ? ఇది కేవల వైదిక పరిభాష. అనిర్వచనీయవర్ణాత్మకమైనదానిని హిరణ్మయమనియు, హిరణ్యమనియు చెప్పెదురు. ఉదకములు హిరణ్యవర్ణములు అని వేదమునందు వర్ణింపబడినది. అందలి హిరణ్య శబ్దమునకు అనిర్వచనీయమని యర్థము చెప్పిరి. హిరణ్మయ శబ్దమును ప్రకృతి ప్రత్యయ విభాగముచేయగ 'హిరట్+మయ' అని యేర్పడును. అందలి 'హిరట్' అను శబ్దము వేదములయం దుపయోగింపబడిన నిపాతములవంటిదై యుండును. ఏదియెట్లున్నను అనిర్వచనీయ మనుటలో సందేహము లేదు. ఈ దేహముగూడ అట్టి అనిర్వచనీయ

వస్తువిశిష్టమైయున్నది. 'ఆనఖశిఖము' బహురంధ్ర మయమై నీ రంధ్ర ముగ మోహజనకమై కన్పట్టుటలేదా? అట్లనిర్వచనీయమై యుండుటం బట్టియే హిరణ్మయశబ్ద ముపయోగింపబడెను. ఉపనిషత్తులయం దటనట "తస్మిన్నయం పురుషః హిరణ్మయః" ఇత్యాదిగ కన్పటుచున్నది. కావున సువర్ణమయపాత్రముచే అనునర్థము పొసగదు. అనిర్వచనీయమైన ఔపాధిక వాసనాప్రాబల్యముచేత ఆచ్ఛాదింపబడి యున్నదని యర్థము చెప్పకొనుట సుగమము. అందుచేతనే "మేధయా పిహితం" అనుచోట ఔపాధిక వాసనా వాసిత జ్ఞానముచే అని ఆచార్యులచే నర్థము స్వీకరింపబడెను. ఈ హిరణ్మయపాత్రముచే సత్యముఖ మాచ్ఛాదింపబడుట వలన అనేక ప్రమాదములు సంభవించుచున్నవి. భగవంతుడు శక్తి మాత్రరూపుడని కొందరును, కోటిసూర్య ప్రభా భాసమానుడని కొందరును, 'నీ రూపనిరవయవ' నిష్క్రియుడని కొందరును అవగాహన మైనను కాకున్నను నేదియో చెప్పకొనుచు భగవత్సాక్షాత్కార మసంభవమని నిర్ణయించుకొని దాక్షిణ్యము కొరకేమో యనునట్లు కొందరుపాసకులుగ నటింతురు. బ్రహ్మసాక్షాత్కారమనియు, ఆత్మ సాక్షాత్కారమనియు, బ్రహ్మోపాసనమనియు, నిర్గుణోపాసనమనియు సమాసపదములను సంఘటింపవచ్చునుగాని సత్యముగ అట్టి సాక్షాత్కారముగాని అట్టి యుపాసనముగాని లేదు. కావున తదుపాసకులు తద్విదూషకులు. ఆత్మ దర్శింపతగినది "ఆత్మావా అరే ద్రష్టవ్యః" అని చెప్పనప్పుడును 'తత్త్వదర్శినః' అని చెప్పి నప్పుడును దర్శనమున కసంభవములైన ఆత్మతత్త్వములు కలవుగదా అని శంకింపగూడదు. ఉపనిషత్తులయం దుపదేశింపబడిన ఆత్మరూపము భగవద్రూపముగ నుపాసింపవలయునని చెప్పుచున్నది. కనుకనే దర్శన శ్రవణ మనన ధ్యానాదులు ఆత్మనిష్ఠములుగ వర్ణింపబడినవి. తత్త్వదర్శియను నప్పుడు తత్త్వానుభవవంతుడని యర్థము. అట్టివాడు మహాత్ముడై యుండును.

ఆ మహాత్ముడే సత్యోపాసకుడు. కావుననే గీతలయందు "వాసుదేవ స్సర్వమితి సమహాత్మా సుదుర్లభః" అని స్పష్టముగ చెప్పబడియున్నది. ఆ భగవద్దివ్య రూపసందర్శనాభిలాషముతో మహాపురుషు డుపాసకుడై తన ఉపాసనా ప్రారంభమున సర్వసాధారణ సాక్షాత్కార యోగ్యమైన తేజోరూపమును సూర్య ప్రతీకముగ నిశ్చయించి "ఓ సూర్యుడా! ఆ సత్యమును నన్నుజూడనిమ్మని యీ ఔపాధిక దుర్మోహమును తొలగించు కళ్యాణతమమైన ఆదివ్యరూపమును జూడనిమ్మనియు ప్రార్థించుచున్నాడు. ఉపాసనా సమయమునందు చర్మ నేత్రములను రెండింటిని మూసియే ధ్యానింపవలయును. చర్మనేత్రములు రెండు మూసినంగాని దేహములోపలనుండిన దివ్యనేత్రము తెరువబడదు. దివ్యనేత్రమనగా మనోనేత్రమని కొందరు వ్యాఖ్యానించిరి. అదితప్పు మనస్సునకొక నేత్రములేదు; నేత్రముండినచో మిగిలిన యింద్రియములును ఉండవలయును. దివ్యశ్రోత్రము, దివ్యజిహ్వా, దివ్యనాసిక - అట్లే దివ్యత్వము నన్నింటికిని అంటగట్టవచ్చును అది అసంప్రదాయము. దివ్యచక్షుస్సు ప్రత్యేకముగ నొక నేత్రభూతావయవము శరీరములో గలదు. ఆ అవయవము శరీరశాస్త్రజ్ఞగమ్యమాయని శంకింపనక్కరలేదు. షట్చక్రములు కుండలినీశక్తిరూప వస్తువు మనస్సు మున్నగు శారీరక వస్తుసమూహా మెట్లు శరీర శాస్త్రజ్ఞుల కగమ్యమో అట్లే యీదివ్య చక్షుస్సుకూడ కేవల శరీర శాస్త్రజ్ఞుల కగమ్యమైయుండును. అంతమాత్రమున దివ్యచక్షుస్సు లేదనరాదు "దివ్యంచక్షుః దదామి" అని గీతలయందు స్పష్టముగ దివ్యచక్షుస్సు వర్ణింపబడెను. ఆచక్షుస్సు తెరువబడవలయునన్న చర్మచక్షువులు మూయబడవలయును. చర్మచక్షువులు మూసినంతమాత్రమున దివ్యచక్షుస్సు తెరువబడి రూపగ్రాహకము కానేరదు. గాజుకన్నువలె ఊరకుండును. దానికి దర్శనశక్తి భగవత్కటాక్షమువలన గురుప్రసాదమువలన కలుగును. ఆకటాక్ష ప్రసాదములు విద్యావిద్యోభయాధీనములైయుండును.

కావున విద్యావిద్యలను ప్రశంసించి దివ్యచక్షుఃప్రభావమును వర్ణించుచున్నాడు. ఈదివ్యచక్షుస్సునకు ప్రారంభమున కానవచ్చిన సూర్యుడు లోకసాధారణ సూర్యుడుకాడు. ఈసూర్యుడసాధారణుడు. ఈసూర్యునియందే శ్రీమన్నారాయణపురుషుడు భగవంతుడు సవితృమండల మధ్యవర్తియై యున్నాడని పరంపరలో వర్ణించుకొందురు. కాని మనకు సాధారణముగ కానవచ్చెడి సూర్యమండలమునందు లేడు. ఉపాసకునిచే గ్రహింపబడి సద్గురూపదిష్టమార్గమునందలి భగవద్రూపమే చూచుటకు ప్రయత్నించిన వాడై సత్యధర్మమగు దృష్టికొరకు ఆమూసుకును తీసివేయుమని ప్రార్థించుచున్నాడు. ఆ దృష్టివిశేషము సత్యధర్మము గలది. అట్లగుటంబట్టి కాల్పనికముగాదు. ఉపాసకులహితము కొరకు రూపకల్పనమని సమన్వయించుటయు అనాదియైనది. అన్నాదుల యందు త్రుణిన్నవారణ ధర్మముండిన యట్లు ఆ రూపమునందు సత్యధర్మమున్నది. త్రుణిన్నవారణత్వము కాల్పనికము కానియట్లు రూపదర్శనము కాల్పనికముకాదు. ఎరిగియో ఎరుగకయో ఒకవిత్తనమును తీసికొని భూమియందు నాటగా ఆవిత్తనము నాటినవాని సంకల్పముతోడ సంబంధము లేక తనయందున్న రూపముతో విజృంభించినట్లు ఉపాసకునిచే దర్శింపబడు రూపము కాల్పనికము గాక సత్యమై జ్ఞానమై అనంతమై ధర్మ్యమైయుండునని నిర్వచించుచున్నాడు ఈసిద్ధాంతమునకు బీజరూపమగునది "తత్త్వమసి" అను మహావాక్యమైయున్నది. కావుననే అది మహావాక్యము. ఇట్టి నిర్ణయానుభవము కలుగుటచేతనే సర్వప్రపంచమునందొకరీతి దేశకాల పాత్రభేదము లేక భగవద్రూపదర్శనభాగ్యము కలిగెను. వేదఋషులు తమశిష్య పరంపరలో ఈరహస్యమును బోధించి విడిచిరి. దానిని స్పష్టాక్షరములుగ వర్ణింపలేము. తమ యానందానుభవమును వాచోవిధేయము చేయుట బహు కష్టమని రసజ్ఞులెరుంగుదురు. పురాణములలో గజేంద్రుని ప్రార్థనము

మెట్టవేదాంతపు మార్గమునంబడిపోయి యుండెను. అట్టియ్యును మహో పాసకుడుగావున తనకు సంకల్పము లేకున్నను కాల్పనికముగాకున్నను శాశ్వతమునుధర్మ్యమునుఅగురూపముదృష్టమైనట్లువర్ణింపబడియున్నది. ఖండాంతరమునందు "పాల్" అను మహాభక్తుడు భగవదుపాసకుడై కాల్పనికముగాని సంకల్పావకాశము లేని ఒకానొక దివ్యతత్త్వరూపమును దర్శించెను. ఆ రూపమును గజేంద్ర దృష్టరూపమును ఒక్కటియె. వేదముల అంతము కాల్పనికమను ఉద్దండ మహాతర్కవాద మహాసంక్షోభ కాలమునందుకూడ అనుయాయియై కాళీసమారాధకుడై కట్టకడపట సంకల్పములేకయే కాల్పనికము కాకయే ఒకానొక అలౌకిక దివ్య స్వరూపమును సందర్శించిన ఆ శ్రీరామకృష్ణ పరమహంస ఈ విషయ మున జగద్గురువని నొక్కి చెప్పుచున్నను ఆరూపము నిదియు నొక్కటియే ఇకనధికము వ్రాయనక్కరలేదు. ఇట్టి పరమసూక్ష్మము లెరుంగ వలయు నన్న బుద్ధియోగము కావలెనని శ్రీ కృష్ణుని ప్రతిజ్ఞావాక్యములు గలవు. బుద్ధియోగులై ప్రసిద్ధులుకండు!

౧౬. మంత్రము

పూషన్నేకర్షే యమసూర్యప్రాజాపత్య వ్యూహరశ్మీన్
సమూహతేజోయత్తేరూపం కళ్యాణతమం తత్తేపశ్యామి
యోఽసావసౌపురుషః సోఽహమస్మి॥

తా॥ ఈ మంత్రమునందు పూర్వోక్తుడగు సూర్యుడే ప్రార్థింప బడుచున్నాడు. ఐనను ఆసూర్యునియొక్క ప్రత్యేకాస్తిత్వమును నిర సించుచు "యేన భాసా సర్వమిదంభాతి" అనున్యాయమునుబట్టి "పూషన్, ఏకర్షే, యమ, సూర్య, ప్రాజాపత్య." అని ఐదునామములతో పిలుచు

చున్నాడు. ఈ బినునామములును సార్థకములు. ఈమంత్రము మార్గ యాచనము కొరకని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసిరి. అర్చిరాది మార్గ ములు యాచనాధీనము లెంతమాత్రమును గావు. మరియును మార్గము అను శబ్దమీమంత్రమునం దెందును వాడబడలేదు. కనుక మరణ సమయ, మార్గయాచనము అప్రసక్తము. మంత్రోద్దిష్ట సూర్యుడు గోళసూర్యుడు కాడు. ఈ యుపనిషత్తు ఈశావాస్యముగాని సౌరి కాదు. సూర్యోపాసనమునకై పుట్టలేదు. కావున సౌరమునుగాదు. ఈమంత్ర మునందు కళ్యాణతమ మగు రూపమును చూతునుగాక అని యున్నది. అనగా ఉపాసకుని యత్యంతప్రధానకార్యమైన భగవద్రూప సాక్షా త్కారమే యిందు వర్ణింపబడెను. "తత్ కళ్యాణతమం రూపంపశ్యామి" అని మంత్రవాక్యము. తద్వాచ్యమై సచ్చిదానందవాచ్యమై తల్లక్ష్యమై ఔపనిషదమైన పురుషరూపమును చూతునని యీవాక్యమున కర్థము. తత్పురుష కళ్యాణరూపదర్శన సమయమునందు విఘ్నరూపముగనుండిన సూర్యరశ్ములను దూరీకరించి కేంద్రీకరింపుమని ఉపాసకుడు ప్రార్థించు చున్నాడు. ప్రార్థించినను ప్రార్థింపకున్నను యీపని అగునని శాస్త్రము వర్ణింపబడియున్నది. "యో సా వసౌ పురుషః సో ఽ హమస్మి" అను వాక్యమును కొందరు వ్యాఖ్యాతలు తమయిష్టము వచ్చినట్లు వ్యాఖ్యా నించిరి. కావున యిందలి వాక్యవిభాగమును తెలుపుచున్నాము. "యః అసౌ.అసౌ నః పురుషః. అహమస్మి" "యః అసౌ" అనువాక్యము "ఎవడు వీడో" అనునర్థమునిచ్చును. ఇంతకుమునుపు యేపురుషుడు వర్ణింపబడి యుండెనో ఆపురుషు డుపాసనాకాలమునందు దృగ్గోచరీభూతుడగుటం బట్టి నిర్దిష్టముగ ఇతడుఅతడు అని నిరూపించుచున్నాడు. రెండవ వాక్యము ఉల్లాసాతిశయముచే అనగార్థముగ ద్విరుక్తిగ చెప్పనున్నాడు. 'వీడే ఆ పురుషుడు' అని రెండవవాక్యమున కర్థము. దృశ్యమానుడే వర్ణితపురు షుడు అనియర్థము. అట్లుకాకుండినచో యిందుప్రయుక్తమైన సర్వనామ

శబ్దములు యేనామమును పరామర్శింపనేరనివై శక్తిహీనము లగును. ఇందలి 8. వ మంత్రమునందు 'సః' అనుశబ్దము ప్రయోగింపబడి కవిః స్వయంభూః మొదలగు నామవాచకము లుపయోగింపబడినవి. కావునే యిట్లు పరామర్శింపబడుచున్నవి. ఇక 'అహమస్మి' అనువాక్యము ధైర్య స్థైర్యాదు లుగల నేనున్నానని యర్థము. ధైర్యస్థైర్యాది గుణములుండను టను విశేషణమిందు లేకున్నను వక్త తాత్పర్య మదియని నిర్ణయించుట కవకాశము గలదు. సనాతనముగ లోకమునందును 'అహమస్మి' యని ఎవడు పూనుకొనునో అటువంటి వాక్యము వినబడుచుండును. ఇట్టి కొన్ని వాక్యములకు సంప్రదాయార్థములనే చెప్పవలయును. శబ్దమాత్రార్థము లను చెప్పరాదు. ఉదా: ఇతను శ్రీక చదివెను. అనగా సంపూర్ణముగ చదివె నని యర్థము. ఇట్టి కొన్ని సాంప్రదాయిక వాక్యములు వేదముల నుండి గ్రహింపబడినవి కావున 'సోహమస్మి' అను వాక్యవిభాగ మున్నది. ఈ మంత్రము మరణవేళకు సంబంధించినది కాదు. తత్త్వోపాసకునియొక్క సిద్ధివేళయందు సంజాతమైన ఆనంద విశేషానుభూతి వర్ణింపబడుచున్నది. కావుననే ధీరుడై అహమస్మి అని యనుచున్నాడు.

ఆత్మసమర్పణము కావించినవా డగుటవలన ఆత్మాస్తిత్వము స్థిరముగ తనకిచ్చు డవగాహనమయ్యెను. గీతలయందును "సర్వధర్మ త్యాగ పూర్వకముగ వర్తింపుము; నన్నే శరణుపొందుము" అని సుఖముగ బోధింపబడెను. ఆవిషయమే యిం దుపనిబద్ధమయ్యెను. కావున దర్శనవేళా ప్రారంభమున గోచరుడైన సూర్యుని ఐదునామ ములతో పిలిచెను. 'పూషన్' అనగా ఉపాధిపోషకుడని యర్థము. ఋగ్వేదమునందు చరాచర జగత్తునకు సూర్యుడాత్మయని వర్ణింప బడెను. 'ఏకర్షే' అని సూర్యుని పిలుచుచున్నాడు. దీనినిబట్టియే గోళా కారక సూర్యుడు కాడని యర్థమగుచున్నది. పురాణాదులయందు సూర్యు డసహాయుడై యాత్రచేయుచున్నట్లు వర్ణింపబడలేదు కావున

ఓ భగవంతా నీయొక్క కళ్యాణతమమైన ఆ ప్రసిద్ధమైన రూపమును చూచువాడనై నేను [illegible] యున్నాను. [illegible] యొక్క ప్రత్యేకత్వ [illegible] అంతయును నీనే. [illegible] రూపమైన నీరూపమే [illegible] చున్నది ఇదియే [illegible] పరమచర [illegible] — ఇతి శిష్యః

౭. మంత్రము

వాయురనిల మమృత మథేదం భస్మాంతగ్ం శరీరం
ఓమ్ క్రతోస్మర కృతగ్ం స్మర క్రతోస్మర కృతగ్ం స్మర॥

తా॥ ఈ మంత్రమునందు మరణకాల ప్రార్థనమే యున్నదని కొందరందురు. అట్టిసంబంధమేదియును లేదు కావుననే పక న్మంత్రమా స్వార్థక శ్లోకములయం దొకచో ఉపాసకఫలమని వర్ణింపబడెను. ఈమంత్రమునందు వాక్యములు చిన్న చిన్నవిగనున్నవి. అర్థములతి గంభీరములై యుండును (1) వాయువు అనిలము అగుచున్నది (2) ఇంక యిది అమృతము (3) శరీరము భస్మాంతము (4) క్రతువా! కృతమును స్మరింపుము. (5) క్రతువా! కృతమును స్మరింపుము. ఈ వాక్యవిభాగమును బట్టి యీ మంత్రము ఉపాసకుని యొక్క ఫలరూపమును చెప్పుచున్నదని సులువుగబోధపడుచున్నది. మహాపురుషుల యుపదేశములయం దిట్లే ఆనందపరవశ వాక్యములును వ్యవహారనిర్వాహక వాక్యములును సక్రమముగ జోడింపబడియుండును. మొదటివాక్యమున కర్థమువిండుము. వాయువు అనిలము అగుచున్నది. వాయువు అన్నను అనిలము అన్నను సమానార్థకములే. ఇట్లు పర్యాయనామములం జెప్పునట్టి నిఘంటువని యుపనిషత్తునకెన్నడును గాదు.

కావున పర్యాయపరముగ అర్థము చెప్పక [illegible] గ్రహింపవల యును. ఇందొకపదము విశేషణమై వేఱొకపదము విశేష్యమై తీరవల యును. ప్రథమపదము 'వాయువు' కావున యిది విశేష్యము. యీ మంత్రమునందీ పదము ప్రసక్తియేల కలిగెను? ఈ వాయువు సాధారణ లోకవాయువా? కాక ఉపాసక బోధ్యవాయువా? అని శంకించినంగాని సమాధానము లభించదు. విద్యకు [illegible] సంబంధించినదగుటవలన యీ వాయువు ఉపాసకబోధ్యవాయువై [illegible]. ఉపాసకునిచే అవశ్యము నవలంబింపబడిన ప్రాణాయామమందలి వాయువే యిచ్చటి వాయువు. ప్రాణాయామము కుంభప్రధానమని విజ్ఞులందరెఱుంగు దురు. కుంభించిన వాయువు సూర్యదర్శనానంతరం గోచరీభూతమైన కళ్యాణతమరూపసాక్షాత్కార సమయమునందును ప్రాణాయామము చేయబడుచున్నదా? కుంభముచక్కగ నిర్వహింపబడుచున్నదా? అనెడు యీ బాహిర వ్యాపారములును (ఈ భావనలు ప్రతీక ప్రత్యయ భూతములు) ప్రతీకభూత ప్రత్యయములును యీ మొదలగు సర్వము అలక్షితమైపోవును. వానికి ప్రసక్తిపనక్కరలేదు కావున ఆవాయువు అనిలము" ఇలా సంబంధము కానిదగుచున్నది అని యర్థము. అనగా ప్రపంచ వాసనానుసంబంధమైన దానిని ఆవాయువునకు పోవు చున్నదని యర్థము. దర్శనపూర్వమునసే కుంభలక్ష్యముగాని దర్శన క్షణమునుండి కుంభలక్ష్యమక్కరలేదు అక్కరలేదని చెప్పినను చెప్ప కున్నను అక్కరలేని దేయగును. (ఇలానంబంధము కానిది అనిలము) రెండవ వాక్యమునందు "విద్యయాఽమృతమశ్నుతే" అనువాక్యముయొక్క ఉపసంహారముగలదు. అథ అను శబ్దమిందున్నది. ఈశబ్దమునకు మరణా నంతరమని కొందరు వ్యాఖ్యానించిరి. మరణప్రసక్తిలేశమును నిందులేదు. ఈ 'అథ' శబ్దమునకు పూర్ణమైన మంగళమని చెప్పవలయును. దీనికి పూర్వమునందున్న 16 మంత్రమునందే "కళ్యాణతమం" అను పద

మున్నది కావున సంపూర్ణ మంగళరూపమైన యిది ఆ అమృతరూపమే యనియర్థము. ఇదియే శారీరక మీమాంస శరీరధారిత్వమునకు పరమ ఫలమనియే. ఎల్లశరీరులును (మానవులు) అమృతప్రాప్తికి అధికారులు కదా! కావుననే శరీరప్రసక్తి సంభవించెను. కానమ్మీ తావాక్యము ప్రాంతగా శరీర మేమగునో యను శంకకలుగును. శరీర [illegible] అమృతత్వ ప్రాప్తిలేదు. మూడవ వాక్యమునందు. స్పష్టముగ శరీరము భస్మాంతమని చెప్పి యున్నాడు. మరియును యెట్టివారిశరీరమును భస్మాంతమేయని యందరకు తెలియబడియున్నది. దానిని వేదపురుషుడు చెప్పనేల? ఇందలి విశేష మేమియని వివేకింపుడు. కాను జీవన్ముక్తులకు వారి దేహములు మాత్రమే భస్మాంతములు. ఇక వారికి దేహధారణ రూపబంధము లేదు. కావున వారి దేహములు భస్మాంతములుగాని అందరి దేహములు భస్మాంతములుకావు. బుద్ధియోగేశ్వరుల దేహములు మరణాంతములై యుండును. భస్మాంత మనగా పునరుదయావకాశము లేనిదని యర్థము. మరణాంత మనగా పునర్జన్మాస్పదములని యర్థము. ఈ విషయమునే గీతలయందు "జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువంజన్మమృతస్యచ" (అ 2—37) అనియును వేదములయందు "జాయస్వమ్రియస్వేతి తృతీయం [illegible]" అనియును స్పష్టముగ చెప్పబడియున్నది. కావున జన్మమరణ [illegible] ఘోరసంసార మహాంధకూప నిపాతము బుద్ధియోగులకు లేదని యర్థము. కాని అన్ని దేహములు భస్మాంతములే యన్నచో నాస్తికవాదము సంభవించును. భూతములు భూతములలో కలియుననియు జీవుడు నిశ్శేషుడయ్యెననియు చెప్ప కొనెడు నాస్తికవాదమే సిద్ధమగును. పాపము శాంతించుగాక! కొందరనినట్లు శరీరము భస్మమగుగాక అను యర్థము లేశమును రాదు. నాల్గవవాక్యమును రెండు వాక్యములుగ చెప్పుకొనవలయును. ఈ వాక్యమునందలి క్రతుశబ్దమునకు వేదసంప్రదాయము నందు చెప్పబడిన "క్రతుమయః పురుషః" అను క్రతుమయపురుషుడని యర్థము చెప్ప

సంగారము. ఈ క్రతుమయపురుషుడు అగు నుపాసకుడు 'ఓమ్' అను ... ధాన సంప్రదాయము ... రింపవలయునని తాత్పర్యము. "ఓం తత్సదితి నిర్దేశః బ్రహ్మణః ..." అనెడు గీతావాక్య విచ్చట ... మరియును ... కులు ఓంకారపూర్వకముగ ... బుద్ధితో చేయ ... గీతోపదేశము గలదు. ... క్రతుమయపురుషుడు కృతకృత్యుడగును. కనక ఓ ఉపాసకా! ఓ క్రతుమయపురుషా! ప్రణవార్పితబుద్ధితో కృతమును స్మరింపుము. కృతమును స్మరింపుము. అని ఆదరాతిశయమున ఆదేశించుచున్నాడు. ... ఆమరణమును ... ("అనువృత్తిరాప్రయాణాత్ ... వేదాంతచింతయా") కే ... ధారణధ్యానసమాధిలో నుండదగదు. అది వ్యవహారభంగము. ... లోకసంగ్రహనిగ్రహము. లోకసంగ్రహము కూడ నొక కార్యమై యున్నది. అదియు నుపదేశాంతర్భూతమై యుండును. కావున కడపట "కృతం స్మర కృతంస్మర" అని ద్విప్రకారముగ ప్రవచించెను.

౧౮. మంత్రము

అగ్నేనయసుపథారాయే అస్మాన్విశ్వాని దేవవయునాని
విద్వాన్, యుయోధ్యస్మజ్జు హురాణమేనో భూయిష్ఠాంతే
నమ ఉక్తిం విధేమ॥

తా॥ ఈమంత్ర ముపసంహారాత్మకము. కొందర మతములో యీ యుపనిషత్తునందు పదునేడు మంత్రము లున్నవని కలదు. ఐనను యీ పదునెనిమిదవ మంత్రమునకు ప్రాచీనత్వమున్నది గాన దీనిని

గ్రహించితిమనుచున్నాను. ఇందు అగ్ని ప్రార్థింపబడుచున్నాడు. ఓ అగ్ని హోత్రుడా! మంచిమార్గముతో మమ్ము ధనముకొరకు నడిపింపుము అని యున్నది. ఈప్రార్థనము లౌకికాభరణముగ గ్రహింపుడు. ఇందు గ్రహింపబడిన అగ్నిశబ్దమునకు లౌకికాగ్ని యని యర్థము కానేరదు. ఈయుపనిషత్తునందెందును అగ్నిశబ్దము నుపయోగింపబడలేదు. కావున యీఅగ్నిశబ్దమునకు ప్రత్యేకార్థమును చెప్పవలయును. వేదమంత్రము లను వ్యాఖ్యానించునప్పుడు అభ్యాయుమార్యాగ్రత్యాది పదములకు ఎట్లు ప్రత్యేక పారిభాషికసంజ్ఞలతో నర్థములు ఆచార్యులచే స్వీకరింపబడెనో అట్లే యీ అగ్నిశబ్దమునకు పరిభాషార్థమునే స్వీకరింపవలయును. పూర్వోత్తరసందర్భముల నాలోచించి పరిభాషకల్పింపదగును. ఈమంత్ర మునకు పూర్వమంత్రమునందు 'క్రతు' శబ్ద ప్రసక్తికలిగెను. క్రతువునకు అంగభూతముగు అగ్ని యిందు గ్రహింపబడెను. కావున అగ్ని యనగా 'కర్మ కరణము' అని యర్థము చె ప్పకొనవలయును. మరియును వైదికకర్మముల యందు 'అగ్నౌకరణ' మని యొకనియమము గలదు. హోమకర్మము నారంభించుటకు అగ్నౌకరణము ముఖ్యము కావున అగ్నికి కరణమని యర్థము. కరణవ్యాపారాధిష్ఠానదేవతగ అగ్ని సంబోధింపబడినను కరణమే ప్రధానార్థము. ఓఅగ్నీ! ఓసాధనమా! న్యాయ్యముగు మార్గముతో యేమార్గము ననుసరించి పోయిన తనకుగాని పరులకుగాని హాని సంభవింపనేరదో అట్టి మంచిమార్గముతో ధనము కొఱకు నడిపింపుము అని యున్నది. ధనముకొరకనగా కేవలస్వార్థమైన ధనము కొరకని యర్థముగాదు. ఈ యుపనిషత్ప్రారంభమునందు జగచ్ఛబ్దమువాడబడెను కావున జగదభ్యుదయము కొరకనియర్థము చెప్పవలయును. మరియును "రాయే" అను పదము సంబంధార్థపద రహితముగ నుపయుక్తమయ్యెను. ఎవనియొక్క ధనము కొరకని ఆకాంక్ష పుట్టకమానదు. ఉదారచరిత్రులకు యీవిశ్వమే కుటుంబము. కావున

లౌకికముగనైన విశ్వకళ్యాణముకొరకు అను నర్థమే వచ్చును. అట్టి దాని కొరకే మమ్ము నడిపింపుము అని ప్రార్థనము చేయబడుచున్నది. ఇం దుపయోగింపబడిన "అస్మాన్" అను శబ్దము సకలమానవుల నుద్దేశించి ప్రయోగింపబడినది. గీతలయందును కర్మనిర్వహణ విషయము చక్కగ నుపన్యసింపబడెను. స్వభావనియతమైన కర్మమును చేయుము. స్వధర్మమును విడువకుము. లోకసంగ్రహముగ నిర్వర్తింపుము. ఈ మున్నగు బోధములకెల్ల బీజభూతమైనది యీమంత్రము. ఇక రెండవ వాక్యమునందు పూర్వోక్తకరణాధిష్ఠానదేవతాగ్నిని పొగడుచున్నాడు. ఓ అగ్నీ! సకలకర్మములను నీవెరుగుదువు అని యనుచున్నాడు. అనగా యేసాధనసంపత్తిచేత సకలకర్మజాలమునకు సమగ్రత సాధింపబడునో ఆవిషయమును నీవెరుంగుదువు. ఇట్లనుటవలన కర్మశుద్ధియు కరణశుద్ధియు కర్మకరణభావనాశుద్ధియు చక్కగ బోధింపబడెను. మరియు మానుండి వక్రభూతమైన పాపమును తొలగింపుము అని యున్నది. ఎన్ని శుద్ధులున్నను కర్మకరణము పాపస్ఫురణము కాకమానదు. గీతలయందును "సర్వారంభములు పాపముచే నావరింపబడినవని చెప్పబడియున్నది. అట్టి పాపమును తొలగించుట కుపాయము కర్మఫలత్యాగపూర్వక కరణమే యని స్పష్టముగ నిర్ణయించియున్నాడు. ఈ యుపనిషత్తునందును గూడ "నకర్మ లిప్యతేనరే" అని కర్మలేపాభావము సూచింపబడియున్నది. ఆ కర్మలేపాభావమే యిం దుపసంహరింపబడుచున్నది. ఇంతవరకు చెప్పబడిన వాక్యములు ప్రకరణసమాప్తి యనంతరము చెప్పవలసిన స్వస్తివాక్యముల వంటివి. కట్టకడపటి వాక్య మింకొకటి గలదు. ఈ వాక్యము సకల వేదాంతసారభూతము. ఈ వాక్యము ప్రస్థానత్రయపరమ తాత్పర్యనిరూపకము. ఈవాక్యము కేవలనైర్గుణ్య నైష్కర్మ్యసిద్ధిప్రదము. ఆ వాక్యమిట్లున్నది. "భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ" ఈవాక్యమే పరమమంత్రము. గీతలయందు కట్టకడపట "సర్వ

ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అని యిట్లు చెప్పబడెనో అట్లే యిందును చెప్పబడెను. తర్కవితర్కము లెన్ని నేర్చినను విజ్ఞాన మెంత యున్నను సకలశాస్త్రపారంగతుడైనను సర్వలోకాధారుడైన భగవంతుని, తల్లీలలను, తద్విశేషములను, కార్యకారణకల్పనా పాండిత్యముతో సమన్వయించుకొనలేరు జనులెల్ల లోకులెల్ల నని కట్టకడపటి శరణాగతి వాక్యమును చెప్పుచున్నాడు. "హే భగవంతా! వాచకశక్తి యావత్పర్యంతము నాయందున్నదో తావత్పర్యంతము ఆ వాచకశక్తి నెల్ల నమస్తే నమస్తే నమస్తే నమస్తే అను వాక్యములయందే యుపయోగింపబడుగాక" అని స్పష్టముగ బోధించుచున్నాడు. ఉపసంహారము నందు దివ్యమంగళ ప్రాయమైన యీ వాక్యమునకు "పరిచర్యలను చేయలేను; నమస్కారములను మాత్రము చేయుదును" అని ఇంకేదేదియో వ్రాసిరి. స్పష్టముగ నిందు భూయిష్ఠమగు నమస్కారోక్తియని యున్నది. కావున "ఓమ్ నమో భగవతే వాసుదేవాయ" అను మంత్రము గూఢముగ నుపదిష్టమై యున్నది. వాసుదేవపరబ్రహ్మము కొరకు నమస్కారము. గీతలయందును "నమస్యంతః కీర్తయంతః" అని స్పష్టముగ నున్నది. కావున యిందలి నమస్కారోక్తి కేవలోక్తిమాత్రమున గాక ముద్రారూపమైన నమస్కారమును గావింపవలయునని యర్థము. అనగా రెండు అరచేతులను జోడించి తామరమొగ్గ ఆకారముతో ముద్ర గావించి ఆ ముద్రను వక్షోభాగమునందుంచి పద్మకోశప్రతీకాశమై దేహాంతరమున నున్న ఆ హృదయము, ఆ హృదయాంతస్థ దహరాకాశము, ఆ దహరాకాశవిరాజమాన ప్రకాశరూపము సర్వము నీకిదే సమర్పితము" అనెడు బ్రహ్మార్పణబుద్ధి చక్కగ సర్వావసానమునందు బోధించుచున్నాడు.

ఓమ్ తత్సత్ బ్రహ్మార్పణమస్తు

ఓమ్ పూర్ణమదః

ఇతి శాంతిః.

మాండూక్యోపనిషత్తు

ఓమ్ నమో భగవతే వాసుదేవాయ

మాండూక్యోపనిషత్తు

శాంతిమంత్రము

ఓమ్. భద్రం కర్ణేభిశ్శృణుయామదేవాః
భద్రంపశ్యే మాక్షభిర్యజత్రాః
స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః
వ్యశేమదేవహితంయదాయుః
ఓమ్ శాంతిశ్శాంతి శ్శాంతిః॥

తా॥ ఈశాంతిమంత్రము కేవలమాథర్వణికముగ గ్రహింపబడకున్నను శిష్టసంప్రదాయమునందిదియే పఠింపబడుచున్నది. "హే దేవాః! భద్రంశ్రృణుయామ" ఓ దేవతలారా! భద్రమైనదానిని విందుముగాక! అని యర్థము. యజత్రములైన అక్షములతో భద్రమైనదానిని చూతుముగాక! అని మరియొక వాక్యముగలదు. స్థిరములైన అంగములతోను శరీరములతోను స్తోత్రముచేయువారమై మాఆయున్సంతయు దేవహితమగునట్లు చేయుదుముగాక! అనునది మరియొకవాక్యము. ఈ శాంతి మంత్రమునందు శ్రవణదర్శనస్తోత్రములుగలవు. మొదట శ్రవణకార్యమునకు ప్రాధాన్యమిచ్చెను గావున శబ్దము, తదర్థము, తదుపాసనము మున్నగువిషయము లీయుపనిషత్తునందు ప్రసక్తములు. భద్రదర్శనము కూడ చెప్పబడినది కావున కేవలభగవత్సాక్షాత్కారమునకును నిందు ఉపాయముగలదని తోచుచున్నది. అంగములతో శరీరములతో స్తోత్రముచేయుట అనగా త్రికరణశుద్ధిగలిగి కేవలభగదర్పితముగ శరీరవర్తన పర్యంతము వర్తింపవలసియుండుట ద్యోతకమగుచున్నది. "స్థిరములగు

అని యనుకొనుటగాదు. నేను బ్రహ్మమును సర్వమును తదేకనిష్ఠ నని అనుకొనుట యద్వైతము. త్రిగుణమయము ప్రకృతి యనియు సర్వము పంచభూతాత్మకమనియు సర్వమణుమయమనియు నిశ్చయించుకొను చున్నావో అట్లే సర్వము భగవన్మయమని యనుసరించుకొనవలయును. శ్రు॥ "యత్రహిద్వైతమివభవతి" అను వాక్యమువలన ద్వైతమంతయు మిథ్యయందురు. కాని "ద్వైతంఇవ" అనియుండుటంబట్టి రెండింటి యొక్క సమలక్షణములను నిర్ణయించుట తప్పని యర్థమగుచున్నది. ఎట్లు భగవదస్తిత్వమో యట్లే తదితరమున కస్తిత్వమున్నది. అని యనుకొనుటతప్పు. ఒకదానియొక్క అస్తిత్వనిర్ణయమే అద్వైతము. ఆ సద్విలక్షణ మగునదేదియునుండనేరదు ఆ సద్వస్తుప్రభావము వలన నొకప్పుడు ద్వైతమా? యద్వైతమా యను సందేహము కలుగవచ్చు ననియు సిద్ధాంతము సద్వైతమేయనియు తెలుపుటకే "ద్వైతమివ"అని చెప్పబడెను. అట్లే "అన్యదివ" అని వేరొకచో చెప్పబడెను. ఈ "అన్యదివ" శ్రుతియందును ప్రత్యేకాన్య దర్శనము భావనము మున్నగునవి కూడనివని యుపదేశింపబడుచున్నది "అన్యః అన్యత్ పశ్యేత్" అని శ్రుతివాక్యము గలదు ఈ వాక్యమునకు అర్థము 'అన్యుడు అన్యమును చూచును' అని యర్థము. తాను తనకన్యముగు దానిని చూచుననియర్థము గాదు "అన్యః భగవన్నిరపేక్షస్సన్ స్వయంస్థితః, అన్యః అన్యత్ భగవన్నిరపేక్షం సదితి పశ్యేత్" అని సంస్కృతమున వ్యాఖ్యానము చెప్పవచ్చును. అన్యుడనగా ద్రష్ట. ఈ ద్రష్టస్రష్టత్వాది లక్షణసంపన్నుడై భగవన్నిరపేక్షముగ తానున్నానని యనుకొనెడివాడు అన్యుడని పిలువబడును. ఒకడు వేరొకదానిని చూచుచున్నాడు అనగా వేరొకదాని యందు తనధర్మములలో నేదైనను లేకుండినయెడల జూడలేడు కావున తనధర్మముయొక్క వికాస ప్రకాశనముల నెరుంగుచున్నాడని "చూచుచున్నాడు" అనుదాని కర్థమగును. కావుననే

ఉపాసనార్థ మగునది ఆత్మయే యగునుగాని యనాత్మ కానేరదు. ఒకయుపాసకుడు తిరుగుళ్ళలతాదులను ఉపాసించినచో తిరుగుళ్ళలతాది మాత్రమే యవగాహనము చేసికొన్నవాడగునుగాని భగవత్సాక్షాత్కారము నొందలేడు. గీతలయందు సుస్పష్టముగ, "యేయథామాం ప్రపద్యంతే తాం స్తథైవభజామ్యహం, (గీత4-11)" ఎవ్వరెట్లు భావించిన వారి కట్లు భావ్యుడనగుదునని చెప్పియున్నాడు. అట్టి యుపాసనములు బహుదూర కారణములు. సర్వము భగవన్మయమే యగుటవలన నెట్టి నయును పరంపరాసాధనముగ గ్రహింపబడదగియున్నను సత్యాంతిప్రధాన ప్రశస్త సన్నిహిత సత్సాధనమునే యుపనిషత్తులు చెప్పునవి అగుటవలన కేవలప్రణవమునే భగవద్వాచకముగ గ్రహింపనాసినవి అయ్యెను. అది యట్లుండనిండు. అన్యోన్య అయి అన్యమును చూచెదు సాన్నాభ్యకము లేక తద్భరణ్యుడై తన్మాత్రమును చూచువాడు కావలయునని శ్రుతి యుపదేశించుచున్నది. రసానుభూతి యట్లే యుండును. సర్వసాధారణముగ శాస్త్రీయమనోహరమృదంగధ్వని శ్రోతయగువాడు ప్రారంభమున మృదంగశబ్దగుణ గ్రాహకేంద్రియవంతుడై (మృదంగనిష్ఠావ్యక్తిసుధర్మవంతుడు) మృదంగధ్వనులను వినును. అప్పుడుశ్రోత్రశ్రవణము శ్రావ్యము అనుమూడుభాగముల ప్రత్యేకతతోనున్నను క్రమముగ నేను శ్రోతను అది శ్రావ్యము శ్రవణవ్యాపారము సంధానమగుచున్నది యనెడు ఖండజ్ఞానములేక యఖండజ్ఞానసంపన్నుడై నాదమయుడై నాదమాత్రుడగుట యందర యనుభవమునందున్నదే కదా! ఈరసానుభూతి ఐంద్రికమగుటచే తాత్కాలికమైపోవును. భాగవతమగునెడల శాశ్వతమగును. విజ్ఞులకింతకుమించి చెప్పనక్కరలేదు. అన్యుడన్యమునుచూచును. అను శ్రుతి వాక్యమునకు తాత్పర్యమిది. "యత్రత్వస్యసర్వమాత్మైవాభూత్ కేన కంపశ్యేత్కేన కం విజానీయాత్." ఈశ్రుతి నాధారముచేసుకొని ఎవ్వనిని చూడడు ఎవ్వనిని తెలిసికొనడు అనెడు అభిప్రాయ మిచ్చుచున్నారు.

"తెలిసికొనడు, చూడడు"యని అజ్ఞానాంధత్వములతో సమన్వయించుట కంటె, "తెలిసికొనును, చూచును" అని అన్వయించుటయొప్పు. ఈశ్రుతి యందు "యత్ర" అనుశబ్దముగలదు 'ఎచ్చోటను' అనియర్థము అనగా ఆ పరమమైనధామము అట్టిదని చెప్పుచున్నాడు. ఏస్థానముపరమాత్మపదమే యగునో ఆస్థానమున దేనితో దేనిని చూచును? దేనిలో దేనినెరుగును? అనిప్రశ్నించుచున్నట్లున్నది. దీనినే యాత్మసాక్షాత్కారమందురు. తన్నుతనతో తానుచూచును ఎరుగును అనియర్థము. లోకమునందు మను తన్ను తెలిసికొనవలయునని చెప్పుకొనుటకలదు. బ్రహ్మానందానుభవము విషయ విషయి ద్వైధీభావముతో నుండనేరదని నిరూపించుటకీశ్రుతి చెప్పబడెను. "అన్యుడు అన్యమునుచూచును" అనుదాని వ్యాఖ్యానమే యీశ్రుతియందు గలదు "కేన కం పశ్యేత్?" అనగా "న కేనాపి కమపి పశ్యతి" అని యర్థముగాదు. "ఆత్మనా ఆత్మా ఆత్మానంపశ్యతి" అని యర్థము. ఆత్మావలోకనము నందలి యసాధారణ దివ్యానుభూతి యిట్టిది. ఇట్లన్వయింపకున్న శాస్త్రోచ్ఛేదమగును. "సోఽకామయత" అను శ్రుతివాక్యమును తీసికొనుడు. "వాడుకోరెను" అనియర్థము. ఏకాముకుడు ఏకామ్యమును కామించెను? అని పూర్వపక్షముచేసి "స్వఃన అకామయత" అనునర్థము చెప్పవలసివచ్చును. అది వేదరహస్యముగాదు. మరియును "దేవదత్తుడు ఘటమును చూచును" అనువాక్యమునకుగల యర్థబోధము నరయుదము. దేవదత్తుడెట్లు పాంచ భౌతికుడో ఘటము నట్లే పాంచభౌతికము. దేవదత్తుడెట్లురూపవంతుడో ఘటము నట్లె రూపవంతము. రూపియైన దేవదత్తుడు రూపియైన ఘటమును రూపవ్యాపారముగ నెరుగుచున్నాడని యర్థము."రూపవాన్ దేవదత్తః రూపవంతంఘటం రూపలయగత మకరోత్" అని సంస్కృతవాక్యము. అనగా దేవదత్తాన్యతమాంశము ఘటాన్య తమాంశములో సాయుజ్య

వ్యాఖ్యానమును జేయుటయే దేవదత్తుని ఘటమును జూచును అని యర్థము. కావుననే యీ మంత్రమునందు సర్వమైన ఓంకారము నుపాస్యముగ నుపాసనను కుపదేశించుచున్నాడు. ఈ మంత్రము వాక్య వ్యాఖ్యానములలో నున్నదానినిగ గ్రహించక పోవుటవలన చిరకాలము నుండియు నపార్థములకు పాల్పడెను. ఈ మంత్రమునందలి వాక్యమిది. ఓమిత్యేత దక్షరమిదగ్ం సర్వం" — "ఓమ్ అను యీ అక్షరము యీ సర్వము." అని అర్థము. ఈ సర్వమును, నీ యుపదేశింప బడిన ఓంకారమని నిర్దేశించి నిర్ణయించుచున్నాడు. నామమును రూపమును సమన్వయించుచున్నాడు. ఇందలి రూపశబ్దమునకు కేవల చాక్షుష ప్రవృత్తి గల రూపమని యర్థముగాదు. నిరూప్య నిరూపక భావసంబంధ ముగల ఎల్లదియు రూపమని గ్రహింపవలయును. తార్కికముగ నవ ద్రవ్యములును రూపవాచ్యములగును. ఆ రూపము నామమునందు లయింపజేసి తన్మార్గము నుపదేశించుచున్నాడు. "ఓంహీత్యుపనిషత్" అని శ్రుతులయందును, "తస్య వాచకః ప్రణవః" అని యోగశాస్త్రము నందును స్పష్టముగ వచింపబడి యున్నది. ఓంకారమునే ఏల గ్రహించిరో యింతవరకును నెవ్వరును శాస్త్రీయముగ నిర్వచింపలేదు. ఓంకారమును గాక ఘీంకారమునో మరివేరొకదానినో గ్రహింపగూడదా? యనెడు శంకల కుత్తరము ప్రత్యేకముగ మా ప్రణవోపాసనము అనెడు గ్రంథ మున జూతురుగాక. ఈ ప్రణవము భగవన్నిరూపణమునందు సర్వాతి శయము, నత్యంతసన్నిహితము—ఉపదేశమింతటితో పూర్తిగావించెను. ఇంక ఉపాసకునకు సమన్వయమగునట్లు ఆ యోంకారమును నంశములుగ విభాగించి వ్యాఖ్యానించు చున్నాడు. ఈ వ్యాఖ్యానము ప్రణవ వ్యాఖ్యానముగాక ప్రణవాన్వయవ్యాఖ్యాన మని తెలిసికొనుడు. ప్రణవమును వ్యాఖ్యానింపలేదు. ప్రణవవ్యాఖ్యాన మున్నప్పటికి గురుపరంపరలో సువిదితమైయుండెను. కావున అన్వయ వ్యాఖ్యా

నము చేయుచున్నాడు. ప్రణవమును నాత్మకెట్లు పట్టించి వ్యాఖ్యా
నించుటయో దానిని మాత్రమే చెప్పుచున్నాడు. కాని భూత
సృష్టియు ప్రకృతి విలసనమును మున్నగు నానాత్వ విరాజమానములగు
వానిని ప్రణవముతో నన్వయింపజేయలేదు. అకారము ఋగ్వేదమనియు
ఉకారము యజుర్వేదమనియు, మకారము సామవేదమనియు — అకార
మాకాశమనియు, ఉకారము వాయువనియు, మకారమగ్నియనియు
నిదియె త్రివృత్కరణమనియు, నిక్షే, వ్యాహృతి త్రయము (భూః, భువః,
సువః) గుణత్రయము మొదలగువానితో నన్వయింపజేసి వ్యాఖ్యానింప
లేదు. అది యప్రసక్తము. కొందరనుకొనినట్లు (అకార, ఉకార, మకార
ముల) సంయోగ మోంకారముగాదు. ఈఓంకార మొక వాక్యస్ఫోటము.
అదియట్లుండనిండు. ఇక వ్యాఖ్యాన పరిముదము: "తస్యోపవ్యాఖ్యానమ్.
భూతంభవద్భవిష్యత్ ఇతి." ఆ ప్రణవమును భూతభవిష్యద్వర్తమాన
కాలములనుగగూడ ననుసంధింపవచ్చునని చెప్పుచున్నాడు. సర్వశబ్ద
ముచే సాధారణముగ దేశపాత్రములే గ్రహింపబడుటకలదు కావున
కాలమునుగూడ గ్రహించెను. ఇప్పుడు దేశకాలపాత్ర త్రిపుటమునందుండ
దగిన యెల్లవిషయమును సర్వశబ్దవాచ్యము కాగలదు. అనుభవము
నందు కాలాదులు ప్రత్యేకాస్తిత్వముతో నుండిన యట్లున్నవి. కాలము
వికాసకారణముగను దేశము సంకోచకారణముగను, పాత్రము నిమిత్త
కారణముగనునుండిన యట్లు కార్యకారణసంబంధ బంధము భావనమునకు
పుట్టినను పరమార్థమున కేవలోంకారమే యని చెప్పుచున్నాడు. ఈ
వాక్యమునందు, "తస్యోపవ్యాఖ్యానమ్" అని గలదు. ఇందలి ఉపవ్యా
ఖ్యాన శబ్దమునకు ఉపలక్షణముగ చెప్పదగిన వ్యాఖ్యానమని యర్థము.
ఒక నాదమును స్వీకరించి దానినే కాలముగ నిరూపించుచున్నాడు. ప్రపం
చమునందు విషయముగ మన మనునదియెల్ల విషయమే అని నిరూపించు
టకు నాదకాలైక్యము నిర్వచించెను. సత్యముగ దేశకాల పాత్రములు

తావన్మాత్రములేయనియు తాత్త్వికములేయనియు ననుకొనుటయే గాని తాత్త్వికములుగావు. ఇక తాత్త్వికమగునది యేదియో యొక్కటియై యుండవలయును. ఆ యొక్కటియే బ్రహ్మమనియు ప్రణవమనియు పిలువబడుచున్నది. ఇంతియేల? సకలవ్యవహారమును తదేక వస్తూప లక్షకమైయుండును. కావున భగవత్సమానమని తలచుట మిథ్యయనియు, మాయయనియు, అవిద్యయనియు, నామకరణముచేసిరి. భగవదాభారమని, భగవదుప వ్యాఖ్యానమని, భగవద్విలాసమని, నిశ్చయించునప్పుడు కొంత సత్యతత్త్వమునకు సమీపించినవాడగును. దానికొరకే ఉపవ్యాఖ్యానము కావలసివచ్చెను. మూడవవాక్యము, "సర్వమోంకార ఏవ" అనిగలదు. మొదటి వాక్యమునందున్న సర్వశబ్దమునే మూడవ వాక్యమునందును గ్రహించెను. కావున సర్వశబ్ద భావనోపసంహార మిందు గలదని తెలియబడుచున్నది. మరియొక మారు చెప్పుటవలన సర్వమను భావనకును ఏకమను భావనకును నైకట్యము సంభవించునో దానిని చెప్పుటయే మంత్రోద్దేశమని స్పష్టమగుచున్నది. ఆ ఏకవస్తువును నాదరూపమున నిరూపించుచున్నాడు. నాదము నిరర్థకముగాక కేవలాకాశ గుణమాత్రముగాక సర్వభావనాతీత సుందరభావార్థకమని సరహస్యముగ నుపదేశించుచున్నాడు. అకారాదు లెల్లక్షరములో యీ ప్రణవమట్లక్షరముగాదని చెప్పుచు యీ ప్రణవమునకు సర్వమనియు సర్వదేశకాలవస్తుజాతమనియు, సర్వదేశకాల వస్తు సమతీతమనియు, బోధించుచున్నాడు. యోగశాస్త్రమునందును ప్రణవమునకర్థభావనము కలదని చెప్పబడెను. నాల్గవవాక్యము "యచ్చాన్యత్త్రికాలాతీతమ్ తదప్యోంకారఏవ" అని కలదు. ఈవాక్యమునందును కాలమును, కాలమును మించినదియును ఓంకారమేయని చెప్పబడినది. ఈమంత్రమంతయును నాల్గువాక్యములతో నున్నది. ఆనాల్గువాక్యములును మూడువిషయములను చెప్పుచున్నవి. సర్వమును కాలమును కాలాతీతమును ఓంకారమే అని సిద్ధాంతించెను.

ఇందలి 'ఏవ' కారము మరి యేశబ్దములకును వ్యాపింపక కేవల మోంకారమున నే సమన్వయింపవలయునని నిర్దేశించుచున్నది. త్రికాలాతీతము, దిగ్భావనాతీతము, ఇదవాస్తవము అనినిర్ణయించెను వాస్తవభావనము నకును మించినది యగునది ఓంకారమని చెప్పుచున్నాడు. ఇట్లుచెప్పుట వలన బ్రహ్మసత్యమనియు, జగత్తుమిథ్యయనియు, నేనేబ్రహ్మమననియు అభిధానాభిధేయములకు భేదములేదనియు, నిదియభేదాద్వైతమనియు, నిర్వచించుకొనుచున్నారు. సత్యమదిగాదు. బ్రహ్మన్యముగ దేనికిని స్థితి లేదని యర్థము. నిరణుకముగనే వస్తువులేనియట్లు, నిరంశముగనే అంశియు లేనియట్లు, నిరక్షరముగనే పదములేనియట్లు బ్రహ్మన్యముగ నేదియులేదు. తావన్మాత్రమున నేనేబ్రహ్మమను అనియనుకొనుట సమన్వయమగునా? నేను బ్రహ్మాధారమున నున్నవాడనని యర్థము.

౨. మంత్రము

సర్వగ్గ్ హ్యేతద్బ్రహ్మ యమాత్మా
బ్రహ్మసోఽయమాత్మా చతుష్పాత్॥

తా॥ ఈమంత్రమునందు "ఏతత్ సర్వంబ్రహ్మ" అనియు "అయమాత్మాబ్రహ్మ" అనియు "సోఽయమాత్మా చతుష్పాత్" అనియు మూడు వాక్యములు గలవు. ఈమూడు వాక్యములకు పరమతాత్పర్య మేమనగా ఓంకారమే సర్వమనియు సర్వమే బ్రహ్మయనియు, బ్రహ్మమే ఆత్మయనియు, ఆత్మచతుష్పాత్తనియు చెప్పుచున్నది. ఓంకారము నకును ఆత్మకునుగల అన్యోన్య సంబంధమును ఉపవ్యాఖ్యాన రూపమున చెప్పుటకు మొదలిడుచున్నది. ఈ మంత్రములోని రెండవ వాక్యమే

మహావాక్యముగ పెద్దలచే గ్రహింపబడెను. ఆత్మార్పణముగ వాక్య మన్వయింపబడుచున్నది. గావున మహావాక్యమని చెప్పబడుచున్నది. మరియును బ్రహ్మమని వ్యవహరించు శబ్దమునకు చక్కని వ్యాపకార్థము నిందు నిరూపించుచున్నది. వ్యాప్యవ్యాపక, కార్య కారణక, జన్యజనక, జీవాత్మ పరమాత్మ, భావప్రవాహమునకు బ్రహ్మమని యర్థము. భగవత్తత్త్వము బ్రహ్మము. బ్రహ్మతత్త్వము భాగవతము. సూర్యుడు భగవంతుడు, సూర్యత్వమైన కాంత్యాదికము బ్రహ్మము. తేజస్వి భగవంతుడు. తేజస్సు బ్రహ్మము. అర్థము భగవంతుడు. శబ్దము బ్రహ్మము. ఏకము భగవంతుడు సర్వము బ్రహ్మము. కావున యీ మంత్రమునందు మహావాక్యసంపుటితో సర్వశబ్దమును నిర్వచించి, యానిర్వచన మాత్మయందు ప్రతిష్ఠించి, ఆ ఆత్మోపవ్యాఖ్యానమును మొదలు పెట్టుచున్నాడు. ఉపనిషత్తులకు నాత్మతత్త్వ నిరూపణమే ముఖ్యముగాని అనాత్మవివరణముగాదు. అనాత్మతత్త్వ నిరూపణము సకలశాస్త్రములు చేయుచుండ ఆత్మతత్త్వ నిర్వహణ ముపనిషత్తులు చేయును. కావున సర్వమాత్మవాచ్యముగ సమన్వయించుచున్నాడు. ఆత్మయందారోపింపబడిన చతుష్పాదత్వము ఎట్లు పరమార్థము కాదో ఓంకారమునం దారోపింపబడిన, అకారోకారాదులు పరమార్థములు గావు. ఈ మంత్రమునందు చెప్పబడిన క్రమములో కడపట ఆత్మశబ్దమున్నది కావున మొదటి మంత్రములో చెప్పబడిన ప్రణవమునకును యీ ఆత్మకును అవినాభావ సంబంధము కలుగుట వలననే ఆత్మవంతులను నుద్దేశించి ప్రణవోపదేశము చేయబడెను. ప్రణవమాత్రమే యుపాసనార్హమాయని శంకింతము. ఓంకారము నుపాసింపవలయునను అని యాదేశించుటయు, లోకమునందు గూడ సనాతనముగ ప్రణవ మాత్రోపాసకులు గలయట్లును వింటిమి. కాని గురుపరంపరల యాచారము నశించుటచే కొన్ని సంప్రదాయము లడుగంటిన పనియును కొందును-బినను పూర్వసంప్రదాయముల

పాడలందందు గానపత్చుచున్నవి. ధర్మార్థ కామసాధనా మాత్రులకు శ్రీకారము ప్రధానమైనట్లు సకలపురుషార్థసాధకులకు ఓంకారము ప్రధానము. కావుననే సకల శాస్త్రములును ఓంకారముతో ప్రారంభింప బడుట యాచారము. అక్షరాభ్యాసమునందును ఓంకారమును విడువ దగదు. కాని ఓంకారమును మాత్రమే యవలంబించి యూరకుండక 'ఓమ్ నమశ్శివాయ' అను పంచాక్షరీ మంత్రమును పాఠ్యముగ గావించు కొనిరి. అట్లే ప్రస్థానత్రయ పర్యాలోచనము సమరస సమన్వయము గావించుకొన్నచో కేవలమోంకారము ఉపాసనార్హముగాదని ఋజు వగుచున్నది. ఈ పరమ రహస్యము గీతలయందు నిగూఢముగ నున్నది. కావున నుపాసనార్హమంత్రమును "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్" అను గీతావచనముంబట్టి "ఓమ్ నమోభగవతే వాసు దేవాయ" అనుమంత్రము సిద్ధమగుచున్నది. తైత్తిరీయమునందిట్లే యున్నది. మరియును చారిత్రకులు, వేదకాలమనియు, కృష్ణకాలమనియు, కాలవిభాగము కావించుకొన్నను సృష్టికాదినే యీవిద్య యుపదేశింప బడెనని గీతలయందుండుటవలన కాలకృత ఖండ దార్వాక్యము పట్టదు. వశిష్ఠ విశ్వామిత్రాది ఋషులును ఈ మంత్రమునే నుపాసించియుండిరి. కావుననే బుద్ధియోగప్రధాన కర్మజాలము లెన్నియో, మేధాజననము నుండి ప్రారంభింపబడెను. ఇది నిశ్చయమే యగుచో స్పష్టాక్షరములలో నీయుపనిషత్తేల చెప్పలేదని శంకింతురేమో మంత్రము స్పష్టముగ, బహిరంగముగ, వైఖరీవాచకమున చెప్పుట యధర్మమని సనాతనాచా రము. అది పరంపరాపరిపుష్టమై యుండవలయును. అట్టివెన్నియో నశించెను. సమాసస్వరములు, సాను నాసికాక్షరములు, మున్నగునవి నేటికి నశించెను. కావున స్పష్టాక్షరముల లేకున్నను పై మంత్రము గమ్య మానమని ఎఱుంగుటవలననే పెద్దలుద్ధరించి యాయాగ్రంధముల యందు వ్రాసిరి. అద్వైతులమని యనుకొనెడు కొందరు నమశ్శబ్దము నుపయో

గించుటలో బిడియ పడెదరు. ఆబిడియము దురహంకార ఫలము. అద్వైత స్థాపనాచార్యులవారైన శ్రీ శంకరాచార్యులవారు ఈ మాండూక్యోపనిషద్వ్యాఖ్యాన ప్రారంభమునందు "యస్తన్నతోఽస్మి" అని బహుధా ప్రయోగించెను "సర్వ భావైర్నమస్యే" అనియును వ్రాసెను. శ్రీ గౌడపాదాచార్యులవారును, "నమస్కుర్మః యథాబలమ్" అని నమన వ్యాపారము చూపించిరి. కావున బోడిగ "ఓమ్, ఓమ్" అనుట గాని "నారాయణ, నారాయణ" అనుటగానిమంత్రసంప్రదాయముగాదు. అద్వైతాచారమంతకంటెను గాదు. ఓంకారమునకును సర్వమునకును సమన్వయము మున్నే చెప్పబడియున్నను, యీ మంత్రమునందు యీ ఆత్మశబ్దము గ్రహించుటవలన ఆత్మవంతులెల్ల అధికారులని నిర్ణయింపుము మరియును ఆత్మయుండిననే అన్నియునుండుట సంభవించును. కావుననే ఆత్మగ్రహణము ముఖ్యమయ్యెను. ఇందుపయుక్తమైనఆత్మ, పరమాత్మ యనియు, పరబ్రహ్మమనియు ననుకొనుటతప్పు. అంతఃకూప విరాజమానమై, అనుభవైకగోచరమై యున్న 'యీ' ఆత్మబ్రహ్మము అని మహావాక్య ముపదేశించుచున్నది. ఈ ఆత్మయే బ్రహ్మజ్ఞానమునకు పరమసాధనము. ఈ గమ్యమానాత్మను నుద్దేశించి, తదతీతాత్మను, గ్రహించుకొనుమని విచారమాత్రసాధనమున గాక యుపాసనామార్గమున నిశ్చయింపవలయునని యుపదేశించుచున్నది. విచారముకూడ వివేకపూర్వకాచరణమునకే అనిమెరుంగుడు. ఆచరణరహితమై, అనుభవదూరమై అందదుకుల తొర్రితర్కములచే కలుకులాడుట జ్ఞానము కాదు. "నాయమాత్మా ప్రవచనేనలభ్యః" ఇత్యాదిగ వేదమాతయే కరుణాళువై యుపదేశించుచున్నది. అట్టి యీయాత్మ నాల్గుపాదములు గలదనిమెరుంగుడు. ఇందలిపాదశబ్దము చరణార్థముకాదు. విభాగాత్మకము. ఆ విభాగముకూడ, వేర్పరచదుస్థితిగల విభాగముకాదు. వివేకవిజ్ఞానలీలా మాత్రవిభాగము. ఒకరూపాయిని విభాగించినను, విభా

గింపకున్నను నూటతొంబదిరెండు భాగములుకలిగిన దానినిగ గ్రహింపగలిగినట్లింక యెన్ని యోవిభాగములు చేసికొనతగినను, తనకయుండినట్లు, చతుష్పాద్రూపమై యాత్మయున్నదని శిష్యశిక్షకొరకు చెప్పుచున్నాడు. ఇంతటితో సూక్ష్మోపదేశమయ్యెను. ఇంక స్థూలముగ వివరించుచున్నాడు.

ఇ తి శి వ మ్

౩. మంత్రము

జాగరితస్థానో బహిష్ప్రజ్ఞస్సప్తాంగ ఏకోనవింశతి ముఖః,
స్థూలభుగ్వైశ్వానరః ప్రథమః పాదః ॥

తా॥ ఈ మంత్రమునందు ప్రథమపాదము వైశ్వానరుడనియు ఆవైశ్వానరుడు జాగ్రదవస్థాపన్నుడనియు, బహిష్ప్రజ్ఞుడనియు, సప్తాంగుడనియు, ఏకోనవింశతి ముఖుడనియు, స్థూలభోగి అనియు వర్ణింపబడెను. ఈవైశ్వానరుడే, విశ్వుడనియు, విరాట్టనియు, నునని తత్త్వశాస్త్రములు చెప్పుచున్నవి. ఈ పాదము ప్రథమపాదము కావున వేదవేదాంగముల ప్రవృత్తియు, తన్నివృత్తియు, ఉపాసనాది సాధనములును, తత్సిద్ధియు, సంస్థానస్థయు, యీ పాదమునందే యనుభూతములు కావలయును. కావున దీనికి ప్రాథమ్యము సిద్ధించెను. ఇందలి జాగ్రదవస్థాపన్న పురుషుడు వైశ్వానరుడని పిలువబడుట వలన నిది, సకలమానవలోక కళ్యాణార్థము ప్రవర్తించినదని సూచనమగుచున్నది. (విశ్వశ్చ అసౌ నరః విశ్వనరః=సకల మానవాః విశ్వనర ఏవవైశ్వనరః, వైశ్వానరః ఇతి) మరియును మానవ మనోవిద్యాబీజమిందుగలదు. ఆ జాగరితుడు, జాగ్రత్త అనెడు దశయే

స్థానముగఁ బలుకును. ప్రత్యేకస్థానము లేకున్న నాకాశాదికి స్థితియుండదు కాబట్టి స్థానమును వర్ణించెను. ఇందలి స్థానశబ్దమునకు అవస్థావిశేషమని యర్థము చెప్పవచ్చును. దీనికేగాక ఏస్థానమైనను అవకాశాత్మకమే. ఆ యవ స్థానము జాగరితనామకము. జాగరితనామకస్థానమునందుండి బహిఃప్రజ్ఞుఁ డగుచున్నాఁడు. స్వయముగ ప్రజ్ఞానఘనుఁడగువాఁడే బాహ్య విషయములను, జ్ఞాతృజ్ఞేయత్వరూపముతో నుండుట, బహిఃప్రజ్ఞుఁడగుట. విషయము విషయిభావము ఆత్మాధీనములై యుండును. అది విష యము కాదు అది విషయిభావమై యుండును. 'తన్ను తానెరుంగుట' అను మాహాత్మ్యము వంటిది. ఆమాత్రముచే నద్వైతమని యభేదమని బుద్ధ్యాత్మ వాదమునకు దిగరాదు. తాను తన ఛాయాప్రతిమ నవలోకించి విషయి విషయ భావలీలానందానుభవ మనుభవించుట అంద రెరింగిన విషయమే. ఇట్టిదియే బహిఃప్రజ్ఞత్వము. బాహ్యవిషయ ములందు, ఎవడుప్రజ్ఞకలవాడగునో వాడు బహిఃప్రజ్ఞుడని కొందరందురు. ఆయర్థము పొసగదు. అంతర్యమునందు ప్రజ్ఞారూపుడే యగుటంబట్టి, బహిఃప్రజ్ఞుడు కాదలచుచున్నాడు. జాగరితస్థానమున ఆత్మకు చక్కని సాధనముండును. నిద్రాళువైన యొకనిని వేరొకనూతన స్థానమునకు తీసుకొనిపోవ నతడు పూర్వాపరస్థానైక్యజ్ఞానసంపన్నుడు కానేరడు. జాగ రూకుడై యట్లుచేయబడిన భిన్నస్థానాభేదత్వమును నిరూపించుకొనగలిగి యుండును. అట్టిది బహిఃప్రజ్ఞత్వము. బాహిరమైనను అంతర్యమును భావించుకొనగలుగుట తనకుకలదు కావుననే బహిర్వ్యాపకమైన జ్ఞానము జాగరూకమగుచున్నది. అదియే ద్వితీయపాదమున నిరూపింపబడును.

ఈ వైశ్వానరునకు సప్తాంగుడని విశేషణము గలదు. ఇందలి అంగశబ్దమునకు తద్దశాసాధనమని యర్థము. అంగము లేకున్న స్థానము నందుండుట సంభవింపదు. ఇంక ఆ ఏడంగములేవి? అనుటలో గొందరు ఆహవనీయాగ్న్యాదులును, ద్యుస్థానము మొదలగునవియును, వైశ్వా

పర విద్యకు సంబంధించిన గాధావిశేషములను గ్రహించి యన్వయించిరి. ఛాందోగ్యాదులయందలి వైశ్వానరవిద్య, యీ వైశ్వానరశబ్దముతో సంబంధము కలిగినట్లు తోచదు. శబ్దమాత్రసాజాత్యమేగాని ప్రశ్నా ముఖాదులా కథలయందు వర్ణింపబడలేదు. కావున యీ విశ్వుని సప్తాంగములు వేరొకటి యైయుండవలయును. ఇందలి సంఖ్యావాచక మైన సప్తశబ్ద మిష్టమువచ్చినయట్లు వ్యాఖ్యానించుకొన్నను, విశ్వునకు సమన్వయించెనా లేదా, అనునదిచూడవలయును. ఈ ప్రపంచమునకు నండపిండ బ్రహ్మాండమయమైన దెల్ల సప్తసంఖ్యాకముగ వైదికులు గ్రహించిరి. అధర్వణవేదమునందు, "త్రిషప్తావిశ్వారూపాణి" అని కలదు. సకలవిశ్వమునకు సప్తమనియు, త్రిసప్తమనియు, పేరులుగలవు. కావుననే, సప్తలోకములు, సప్తర్షులు, సప్తవాయువులు, సప్తస్వరములు మున్నగు సప్తసంఖ్యాపరిగణనము పరిపాటియైయుండెను. మరియును ప్రత్యేకముగ యజుర్వేదమునందు "త్రిః సప్తః సమిధః" యీయజ్ఞ పురుషరూపమైన దీనిని సప్తనామముతో పిలిచిరి. ఆ సప్తావలంబనము కలవాడగుటంబట్టి జాగరూకుడు సప్తాంగుడయ్యెను. ఈజాగరూకుడేలోక మున నున్నను సప్తాంగుడే. అలోకదశయందనంగుడై అసంగుడగును. ఇందలి సప్తశబ్దమునకు కేవల మేడనిదే యర్థముగాక నానాత్వమున కుప లక్షకమై యుండును. ఏకోనవింశతిముఖుడని వర్ణింపబడెను. పందొమ్మిది ముఖములుగలవని యర్థము. లౌకికముగ ద్విముఖ, చతుర్ముఖ, పంచ ముఖాదిశబ్దములవలె దీనికర్థము చెప్పరాదు. ఇందలి ముఖశబ్దము ముఖ్యార్థము. ఉత్తరవిశేషణమునందు భోగమున్నది. కావున భోగము నకు ముఖమాధారము. ముఖములేని భోగములేదు. అంగములేని స్థానములేదు. కావున భోగముఖ్యవిషయములు పందొమ్మిది అని యర్థము. ఆ పందొమ్మిది విషయములు తెలియుటకు పాండిత్యముకొలది వితర్కింపనక్కరలేదు. కేవలచైతన్యాంశము తెలివిగలవా రెవరో మోక్ష

ములు. దశేంద్రియములును, పంచవాయువులును, నాలుగంతః కరణములును కలిపి పందొమ్మిది ముఖములని పిలువబడును. కర్మకరణము సకర్తృకము. కర్త స్వతంత్రుడు; సచేతనుడు. అట్లగుటచే కర్మేంద్రియములు భోగముఖములు. అట్లే జ్ఞానేంద్రియములును భోగముఖములని సుళువుగ గ్రహింతుము. పంచవాయువులు భోగ ముఖములెట్లని సందేహింపకుడు. ఆవాయువులుకూడ జాగ్రద్దశాపన్నుని భోగముఖములే. ఆవాయువులసత్తయందే దేవదత్తుడు దేవదత్తుడగుచున్నాడు. లేకుండిన శవమని పిలువబడును. అంతఃకరణములు భోగ ముఖములేకపో! ఇది యిట్లుండనిండు. వైశ్వానరుని తెలిసికొనుటకీముఖములే ముఖ్యలక్షణములు. మిగిలినవి వ్యక్తములైనను కాకున్నను లక్షింపదగినవికావు. ఒకజంతువును పోల్చవలయునన్న ముఖమే ముఖ్యము. తోక కడుపు కాళ్లు కనబడకున్నను, కనబడినయట్లే భావించి "అమ్మయొ్యా పులి!" అని వ్యవహరింతుము. ఒకమానవుడే వీరివాడని తెలిసికొనుటకు ముఖమే ముఖ్యము. కరచరణాదులుగావు. వైశ్వానరుని తెలిసికొనుటకీ పందొమ్మిదిముఖములు ముఖ్యములు. కావుననే యీ ముఖములను సంస్కరించుటయందే యెల్లశాస్త్రములకు ప్రవృత్తి కలిగెను. అట్టి యీ ఆత్మపాదుడు స్థూలభోగి అని వర్ణింపబడెను. తన భోగమంతయును స్థూలీకరణమునం దున్నదని నిశ్చయించు స్వభావము కలవాడు. ఎంత సూక్ష్మీకరించినను స్థూలీకరింపకున్న సమగ్రానందము లేనివాడే. కావుననే నిర్గుణోపాసనమనర్హము. తైజసపాదునకు, తైజసపాదుడు నిర్గుణోపదేశము గావించిన కావింపవచ్చుగాని, విశ్వపాదుడగు వీనికి సగుణోపాసనమే కరణీయము. మరియును యీవైశ్వానరుడు స్థూలభోగి యనుట నిశ్చయమగునెడల నీచర్మచక్షువులతో, నిజ్ఞానేంద్రియమ్ములతో ప్రజ్ఞానబ్రహ్మవాచ్య పరమదివ్యసాక్షాత్కారము పొందగలుగునని దృఢమగుచున్నది. అదియే స్థూలీకరణము.

స్థూలీకరణ మైనంతమాత్రమున సూక్ష్మాతిసూక్ష్మ నిర్వచనీయ నిరంజన నిర్గుణప్రభృతివిశేషణజ్ఞానముకలుగదని యనుట తప్పు. వేద వేదాంగము లన్నియు జాగరూకోద్దిష్టము లగునెడల పరమార్థము గూడ జాగరూకగమ్యమే. ఇక నతివిస్తర మతి దుస్తరము.

ఇతిశివమ్ —

౪. మంత్రము

స్వప్నస్థానోఽంతఃప్రజ్ఞః ఏకోనవింశతి ముఖః
ప్రవివిక్తభుక్తైజసో ద్వితీయః పాదః॥

తా॥ ఈమంత్రమునందు ద్వితీయపాదుడైన తైజసపురుషుడు వర్ణింపబడుచున్నాడు. బోధముకొరకు ప్రత్యేకపురుషునిగ తైజసుని గ్రహించినప్పటికి వైశ్వానరుడే తైజసుడని గ్రహింపవలయును. వైశ్వానర తైజసులభేదము స్థాన, ప్రజ్ఞా, భోగవిషయములందు మాత్రమే యున్నది. స్థానము స్వప్నము. ప్రజ్ఞ అంతఃప్రజ్ఞ. భోగము, ప్రవివిక్తభోగము. మిగిలిన అంగములును ముఖములును సమానములే. కొన్నింటసామ్యమును కొన్నింటవైషమ్యమును కలిగియుండుటయే భేదవాదము. కేవలభేదమైన వస్తువేదియును లేదు. తైజసపురుషుడెట్లు నిత్యము తైజసుడై యుండ గూడదో తైజసుడొకప్పుడెట్లు వైశ్వానరుడు కావలసివచ్చునో యట్లే జీవుడు తనజీవలక్షణ త్యాగములనుచేసి పరమాత్మయందు లీనుడు గావలయును. జాగ్రద్దశాపన్నుడు స్వప్నదశాసంక్షోభమును ఎట్లు పాటింపడో యట్లే జీవుడుపాసకుడై తృప్తుడై త్యాగియై యానందియగును. జీవుడానందియగునప్పుడు జీవవ్యవహారముండదు. జీవప్రత్యేకలక్షణము నుండదు. తత్త్వమట్లగునని జీవుడే దేవుడనరాదు. తైజసుడే వైశ్వా

నరుడైనను వైశ్వానర తైజసులకు భేదముకలదు. నేటివైశ్వానరుడు రేపటివైశ్వానరుడును నొక్కడై సమజ్ఞానక్రియేచ్ఛాశక్తివిశిష్టుడై యుండును. జ్ఞానాదిప్రవాహమున కుచ్ఛేదము కలుగదు. నిన్నటికార్యములు నేఁడును నేటికార్యములు రేపును సమముగ నిర్వహింపగలుగుచున్నాడు గాని తైజసు డశక్తుడు వైశ్వానర తైజసులభిన్నులైనను తైజసుడు వైశ్వానరుడు కావలయునుగదా! తైజసునివంటివాడు వైశ్వానరుడు కాడు. ఈతైజసుడు 'అంతఃప్రజ్ఞ'డని వర్ణింపబడెను. లోకమునందెల్ల వస్తుజాతము ప్రతిజ్ఞాతమైయుండును. ప్రతిజ్ఞాతము కానిచో నీసృష్టి నిరర్థకమనియు నుద్దేశరహితమనియు నొకవిధమగు నకారణసంక్షోభమనియు ననవలసివచ్చును. సృష్టియందు క్రమమగు వికాసము, ప్రకాశనము, సృష్టిస్థితిలయక్రమము, మొదలగుధర్మవిశేషములు కానవచ్చుటచే సంక్షోభమని పిలువబడదు. సంక్షోభమైయగునెడల వేసవియనియు, వానకాలమనియు, చలియనియు నొకక్రమముండఁగూడదు. ఈక్రమతత్త్వము చక్కగసమన్వయించుకొనినయెడల త్రివిక్రమస్వరూపావగాహనమగును. ఆతైజసపురుషుడు తానంతఃప్రజ్ఞుడనగా, క్రమతతో సంబంధములేక నన్నింటిని, సమ్మర్దముగ, సమూహముగ, సమవాయముగ, సంయోగించుకొనగలుగువాడని యర్థము. కాని వానివిభాగము మాత్రము వానివశముగాదు. సంయోజకుడేగాని విభాజకుడు కాడు. సంయోజక వియోజక శక్తిసంపన్నుడు వైశ్వానరుడు, తైజసునకట్టిశక్తి లేదు. వేయేల నిర్గుణపరబ్రహ్మవాదుల మనుకొనెడువారు ఇంచుమించు తైజసపురుషుని వంటివారు. తైజసు డంతఃప్రజ్ఞుడనగా నెరిగి బహిష్ప్రజ్ఞుడు కాలేడని యర్థము. ఇంక "ప్రవివిక్తభోగి" అంతఃప్రజ్ఞుడయ్యు అంతర్భోగిమాత్రము కానేరడు. సంస్కారరహితుడగుటచే ప్రవివిక్తముగ, నేకాంతముగ, జాగ్రదాది వాసనాబంధముగ అనుభవించువాడగును. తన ప్రవివిక్తభోగిత్వము వైశ్వానరుడై సంస్కరించుకొనవలయును. అట్లు సంస్క-

లించుకొనకున్న భోగియగుటకు మాత్రము కోరి యగును. ప్రవివిక్తభోగి కావున నంతఃప్రజ్ఞత్వసాధనాశక్తి నుపయోగించి వైశ్వానరవేళయందు సంపాదింపబడ నేరని కామనాదులను ప్రతిష్ఠింపక వానినెల్ల సంక్షోభకారణములుగ గ్రహించి సంస్కరించుకొనవలయును, అట్టి సంస్కార మంతయు వేదాంత శాస్త్రములయందు వర్ణింప బడియున్నది. ఏకాంతభోగముపటవలన క్రమవివిక్తనమగుచు నప్రశ్రమమై యస్తవ్యస్తమై యొకప్పుడు తైజసానుభవము నుండును. ఒక సుందరవనితను వైశ్వానరుడు చూచెననుకొనుడు. మంచి ధార్మిక భావనములను గావించెననుకొనుడు. తైజసుడై యొకప్పుడా సుందరినే విచిత్రముగ నధార్మిక భావనాతృప్తి పొందినట్లును, నొకప్పుడు తద్విలక్షణముగ భావనాతృప్తికి ప్రయత్నింప తానేవచ్చినట్లును, నంతలో చిరకాలపరిచితమైన తనసుందరియే ఆసుందరియైనట్లును వివిధవికారములతో, వైశ్వానరానుకూలముగను వైశ్వానరప్రతికూలముగను పరిణమించును. అదియే ప్రవివిక్తభోగలక్షణము. ఈ ప్రవివిక్తభోగియగుట వలన, జగత్తుమిథ్య, తానేదేవుడు వాస్తవమిదియేదియును గాదు. స్వప్నము వంటిదే యీజగము అనెడు నిర్ణయముల కాధారముగాను. వైశ్వానరుడు తైజసుడెప్పుడగుచున్నాడో విజ్ఞులు కొంచెము వివేకింపుడు. వైశ్వానరోత్తరుడు తైజసుడేయైనను, ప్రాజ్ఞానంతరుడు తైజసుడుగ ననుభవమునం దున్నది. జాగ్రద్దశవిడిచి నిద్రాదశ పొందిన తరువాతనే స్వప్నదశవచ్చును. కావున, స్వప్నమునకు నిద్రయే భూమిక. నిద్రయే లేనియెడల స్వప్న మసంభవము. జాగ్రత్స్వప్నముల మధ్యమున నిద్ర యున్నది. ఈ మూడుదశలును సంపాదితములుకావు. స్వభావసిద్ధములు. స్వభావసిద్ధములగు వానినుండి, స్వరూపజ్ఞానమును సంపాదించుకొనవలయును. స్వరూప జ్ఞానసాధనము లీదశలు. ఈ దశ లాత్మనిష్ఠములు. కావున నాత్మతత్త్వ జ్ఞాన మిం దిమిడి

యున్నది. తైజసక్రమము జన్మాంతరాస్తిత్వమును భోగించుటకు సాధనమని యెరుంగుడు. జన్మాంతరసిద్ధాంతము భోగనిమిత్తమని యార్యులందఱెరింగిన విషయమే. భోగనిమిత్తమే లేకున్న జన్మాన్తరమే లేదు. "నాభుక్తం క్షీయతే కర్మ జన్మకోటిశతైరపి" అని అభియుక్తులందురు. జన్మకోటులు భోగముకొరకై. కనుకనే వేదాంతశాస్త్రమునందు భోగవిరాగము కావలయునని చెప్పబడినది. కావున స్వప్నదశనాధారముచేసికొని జన్మాంతరము కలదని నిశ్చయించుకొనుడు. జన్మాంతర సిద్ధాంతస్థాపనాచార్యుడు తైజసుడు. తురీయానుభవ విరహితముగ (ధ్యానయోగ సమాధి విరహితముగ) ఎవ్వడు నిద్రాదశనొందునో యట్టివాడు ప్రవివిక్తభోగియై యంతఃప్రజ్ఞుడై స్వప్నస్థానాది దుర్నివారస్థానములు పొందవలసినవాడగును. జాగ్రత్స్వప్నసుషుప్తులే దుర్నివారములు; తురీయము యత్నసాధ్యము. ప్రయత్నరహితులకు తురీయము సాధింపబడదు. కావుననే తురీయపాదము స్థానాదివిలక్షణమైయున్నది. ఇక నిద్రాదశ మరణ సదృశమనియు స్వప్నదశ జన్మజన్మాంతర సదృశమనియు జాగ్రద్దశ వేద వేదాంతాది విజ్ఞాన వివేకతా సదృశమనియు, తురీయము ధ్యానసమాధి బుద్ధియోగాది సదృశమనియు నిశ్చయింపుడు. ఈనిశ్చయ మారోపమాత్రముగాదు. ఈనిశ్చయమే యుపాధినిష్ఠమై యున్నది. సంప్రదాయమును సనాతనముగ నట్లే యున్నది. నిద్రకును చావునకును సాదృశ్య మున్నటు లంద ఱెరుంగుదురు. మిగిలిన దశలు వేనితో సదృశములో వివేకింపకపోయిరి. ఇదియే స్వాత్మపరీక్ష.

౫. మంత్రము

యత్రసుప్తో నకంచన కామం కామయతే నకంచన స్వప్నం పశ్యతి తత్సుషుప్తం సుషుప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘనఏవా-నంద మయోహ్యానందభుక్చేతో ముఖః ప్రాజ్ఞస్తృతీయః పాదః॥

తా॥ ఈమంత్రమునందు తృతీయపాదుడైన ప్రాజ్ఞుని వర్ణింప బడుచున్నాడు. ఈప్రాజ్ఞుడు సుషుప్తస్థానుడు అగుటబట్టి ఇతనికి అంగములను గూడ చెప్పవలసియుండెను. కాని ఒక్క అంగమును వర్ణింప బడలేదు. అంగములేకున్నను ముఖముమాత్రమే యున్నది. స్థానము, అంగము, ముఖము; ఉండవలసిన యీ మూడింటిలో ఒకటి లేకపోయినను యున్నట్లే గ్రహించుట సంప్రదాయము. ఏకీభూతః అను విశేషణముబట్టి అనేకముగనుండునది యేదియో ఏకీభూతమైనదని చెప్పితీర వలయును. ప్రథమ ద్వితీయపాదులకు అనేకముగ నుండునవి అంగములును, ముఖములును అయి యున్నవి. అందలి అంగములో ముఖములో ఏకీభూతమై యిందుండవలయును. ముఖము ప్రత్యేకముగ వర్ణింపబడెను గాన "ఏకీభూతః" అనగా "ఏకీభూతాఙ్గః" అని యర్థము చెప్పవలెను. ఈ తృతీయపాదుడు అండపిండ బ్రహ్మాండములందెంగుండినను నిట్లే యుండవలెను గావున ఏకీభూతుడని చెప్పుచున్నాడు. ప్రాజ్ఞడను నప్పుడెట్లు సకల ప్రజ్ఞలు నిందు లయించి యుదయింపగలవని వ్యాఖ్యాతలను చున్నారో యట్లే వీనియందు సకలాంగములును లయించి ఏకరూపమునందుండి భిన్నరూపము నొందగలుగుట సంభవము గావున ఏకీభూతవిశేషణము సార్థకము. అవిభాజకముగ, విభాగానర్హముగ నుండునది యగునెడల ఏకమనియు తద్విలక్షణైక స్వరూపమున కేకీభూత

మనియు శబ్దవ్యవహారము. ఏకీభూత మనుటలో నానాత్వ వ్యవస్థ గలదు. ఆ వ్యవస్థ అవ్యక్తము అవ్యాకృతము. అట్టి మూడవపాదుడు చేతోముఖుడని విశేషింప బడుటచే పూర్వము చెప్పబడిన పందొమ్మిది ముఖముల యర్థము న్యాయ్యమని ఋజువగుచున్నది. చేతోముఖుడనునప్పుడు నిజముగ చతుర్ముఖుడని చెప్పవలెను. చేతోముఖుడనుటకంటె వాతోన్ముఖుడని పాఠముండిన బాగుగనుండునేమో యని తార్కిక బుద్ధికి దోచకపోదు. సృష్ట్యాదిరూపుడైన పౌరాణిక బ్రహ్మయు ఆదియందు పంచముఖుడే కదా. సమన్వయము పట్టును కాని సమంజసము కాదు. శవమునకుగూడ వాతముఖత్వము సిద్ధింపవలసివచ్చుటచే ("మృతంవాపి సజహాతి ధనం జయోవాయుః") వాతముఖ పాఠవాదము దుర్వాదము. ఇంతకును మంత్రమున చేతోముఖమనియే యున్నది. కావున నంతఃకరణ ముఖుడని యర్థము. యోగశాస్త్రమునందును నభావప్రత్యయావలంబనము కలదు కావున ఆ యాలంబనము చిత్తాదివ్యాపారమే. అది ఆలంబనముగాని ఆకర్షణముగాదు. అంతఃకరణ సమవాయముఖుడగుటంబట్టి స్థూలసూక్ష్మ విభాగమక్కరలేక యానంద భుక్కగుచున్నాడు. ఇందలి ఆనందభుగ్విశేషణము వలన * బ్రహ్మానందానుభవము కలవాడని యర్థము చెప్పరాదు. కాని నిద్రావేళను భూయమానానందము, జాగ్రద్వేళా జ్ఞాతమేకాని నిద్రాజ్ఞాతముకాదుగదా! నేను సుఖముగ నిద్రించుచున్నాను, అను అనుభవము వర్తమానకాలమున ఎవ్వరికిని లేదుగదా! బ్రహ్మానందానుభవమట్టిదికాదు. ఐనను నిద్రయందే ద్వంద్వములును సుఖదుఃఖాదులును రాగద్వేషాదులును నభ్యాసవశపూర్వకమునగాక కారణాంతరమున లేనివాడై యుండుటంబట్టియు, నేదియోయొక విధముగ భోగముకలవాడగుట, నాభోగమునకే పేరు

* ఆనందమయశబ్దమునందలి 'మయట్' ప్రత్యయమువలన ప్రాచుర్యార్థము చెప్పబడియును. ప్రాచుర్య మానందమైనను, క్వాచిత్క మానందేతర మున్నది. ఆక్వాచిత్కమే స్వప్నము జాగరణము మరణము.

తగునని ఎట్టివారు విచారించినను నానంద మనియే యనవలయును. విషాదమనరాదా, యని శంకించుట కవకాశములేదు. మహారోగరూప బాధావిషాద నివారణమున కీ నిద్రాదశ మహోపకారకము గదా! కావున విషాదముగాదు. విషాదమునకు వ్యతిరేకమానందమే. అత డానంద భుక్కనను ఆనందికాడు. మరియునానందమయుడు. ఇందలి యానందమయ రూపము రెండుపాదములకు విలక్షణమైనది. మిగిలిన రెండుపాదములలో ఆపురుషుల రూపములు లేవు. ఈపురుషుడుమాత్ర మానందమయుడు. ఆప్రథమద్వితీయ పురుషులకు సంక్షోభమో సంతోషమో దుర్నివారముగ సంభవింపక మానవు కాని ప్రాజ్ఞునకా ద్వంద్వప్రాప్తిలేదు; కావుననే ఆనందమయుడు. ఈఆనందమయ శబ్దమును వ్యాఖ్యానించిన శ్రీశంకరాచార్య దివ్యపాదయుగళికి నానమస్కారములు. కానిబ్రహ్మానందము నిద్రానంద సదృశముకాదునుడీ! ఈసుషుప్తస్థానుడు ప్రాజ్ఞుడని పిలువబడుటవలన ప్రజ్ఞావంతుడనియే అర్థము చెప్పవలయును. కాని కొందరనినయట్లు మూఢుడని యర్థముచెప్పరాదు. ప్రాజ్ఞ లక్షణములు కొన్ని యితనియందు పట్టియున్నవి ఆలక్షణముల నక్షరశః స్పష్టముగ చెప్పుచున్నాడు "నకంచనకామం కామయతే నకంచన స్వప్నంపశ్యతి" ఎట్టికామమును కామింపడనియు, ఎట్టికలనుగనడనియు, ప్రాజ్ఞముఖ్య లక్షణములనుగ చెప్పెను కాని తత్త్వముచే బ్రహ్మానందానుభవమట్టిదని యర్థముకాదు. కామించినను బంధకారణము కాకుండవలయును. ఆశక్తి యీప్రాజ్ఞునకు లేదు. వేదములయందు "సోఽకామయత" — వాడు కామించెను అనియున్నది. గీతలయందు ధర్మావిరుద్ధమగు కామమును నేను అని యున్నది కామరాజ్యస్థాపనము మా యుద్దేశ్యము కాదు. సాధారణులకీ కామము మహాశత్రువు. ఆ కామమే యీ మంత్రమునందలి కామము. కామింపడు, కలగనడు, ఈ రెండువాక్యములవలన, కామించనేని కలగనును అను వేరొక వాక్యమును

గ్రహింపవలయును. నిద్రాభూమికా రహితమైన స్వప్నములేదుకదా! స్వప్నము జన్మతుల్యమని చెప్పితిమి. జన్మమునకు కామమే కారణము. కేవల సకామమైనను, కేవలనిష్కామమైనను జన్మహేతువని ఎరుంగుడు. ప్రాజ్ఞుడు తత్కాలమున కామవ్యాపారరహితుడు. అట్లే దర్శన శ్రవణాది వ్యాపారరహితుడని బోధించెను గాని యిదియొక రహస్యముకాదు. మున్ను మేమనిన యట్లు మరణమట్లుండునని, కావుననే మరణముతో అంతయు మట్టిగలియునని కొందరనుకొనుట సంభవించెను. అది తప్పని యుపదేశించుటకే యీ మంత్రమున వ్యాపారనిర్వ్యాపారస్థితుల ఏకీభూతిభావము నుపన్యసించుచున్నాడు. ఈ ప్రాజ్ఞుడే స్వప్నకారకుడు. అనగా జన్మకారణము. "జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ. గీత (2 27)" అను పరమార్థమిం దిమిడియున్నది, ఇంతవరకును ప్రాజ్ఞ విషయమునుజెప్పి మూడుపాదముల సన్వయించి, తురీయ పాదమున కెట్టి సంబంధముగలదో ఆ తత్త్వము నుపదేశించుటకు ప్రతిజ్ఞావాక్య మారంభించుచున్నాడు.

౬. మంత్రము

ఏషసర్వేశ్వర ఏషసర్వజ్ఞ ఏషోఽంతర్యామ్యేషయోనిః
సర్వస్య ప్రభవాప్యయౌహిభూతానామ్॥

తా॥ ఈమంత్రము కొందరు ప్రాజ్ఞప్రశంసా పాదమని చెప్పుచున్నారు. ఈశ్రుతికి ప్రాజ్ఞప్రశంస తాత్పర్యము కాదు. ప్రాజ్ఞః పురుషునను స్వయము కాద్యము. అట్లనుసమన్వయించుచున్న ఉపాసకుడగతుండగును. మరియును ప్రాజ్ఞోద్దిష్టమీ యీమంత్రమగునెడల "ఏషసర్వజ్ఞః" అని ప్రత్యేకముగ విశేషింపవర్ణింపడు. సర్వజ్ఞవిశేషణముచే ప్రాజ్ఞుడుకాడని నొక్క-

చెప్పవచ్చును. కావున యీమంత్రమునందలి 'ఏష' శబ్దము పూర్వవర్తి కన్వయింపక పురోవర్తి కన్వయింపవలయును. ఇతడు సర్వేశ్వరుడు. ఇతడు సర్వజ్ఞుడు. ఇతడు అంతర్యామి. ఇతడు సృష్టి స్థితి లయములకు మూల కారణుడు. అని వర్ణింపబడి యున్నది. పూర్వోక్తనిద్రాళువో, పరోక్త భద్రాత్ముడో బుద్ధిమంతులూహింపుడు ఈ మంత్రమునం దింత విపులముగ పాదచర్చగాని, మంత్రచర్చగాని, అర్థచర్చగాని అక్షరచర్చగాని, మాత్రా చర్చగాని లేక జ్ఞేయతత్త్వప్రతిపాద్యవిషయమగు దివ్యజ్ఞాతృ జ్ఞాతృస్వరూప నిరూపణమున కలిగెడు నానందముతో పలికెడు ప్రతిజ్ఞావాక్యము మహితుల సంభావనము క్లేయుండును. ఇతడు సాధారణేశ్వరుడుగాక యలౌకికేశ్వరుడు గావున సర్వేశ్వరుడని పిలువబడుచున్నాడు. సర్వజ్ఞుడై, సర్వేశ్వరుడైయున్న యితడు సాధారణుల కందుబాటులో నుండడేమో యనెడు భ్రాంతిని నివారించుటకు యితడే అంతర్యామి యని చెప్పుచున్నాడు. అంతర్యామియైన యితనియొక్క ప్రయాణరూప ప్రస్థానము చక్కగ సాగించుటకు శాస్త్ర ప్రవృత్తి కలదు. అదియే ప్రస్థానత్రయము. అంతర్యామి విశేషణముచే కొందరు నీలోనున్నవాడు వాడేయని యనుచున్నారు. అది తప్పు. నీలో నున్నాడను భావనాశక్తి తదధీనమే అని యెరుంగుటయే. కార్యము. కావున లోనున్నవాడు సాధకుడుగాని సిద్ధుడుగాడు. సాధక సిద్ధసంయోగమే బుద్ధియోగము. ఇతడే భూతములయొక్క సకలసృష్టి లయములకు కారణుడు అని అనుటవలన, సృష్టిలయాదులు భూతములు మున్నగునవియెల్ల, 'కార్యము' లనుట నిశ్చయముగదా! బోధముకొరకు కార్యకారణకల్పనము కావించుకొన్నను కార్యజ్ఞానము కారణమున లయింపవలయును. కావున జన్మకు ముఖ్యధర్మము యీ భగవద్రూపమునందు నిలీనమగుటయే యగును. ఒకవేళ భగవదుపాసకు లయ్యు జననమరణరూపఘోర సంసారచక్ర భ్రమణము తప్పదేమో

యను భ్రాంతిగలవారికి నభయప్రదాన మిందుగలదు. సృష్ట్యాదికి తానే మూలకారణుడగుటచే నిబ్బరముగ నుండవచ్చును. సృష్టమైనను నష్టమైనను తనకేమియు భయములేదు. అతడు సర్వజ్ఞుడు సర్వేశ్వరుడుగదా! "అహంత్వా సర్వపాపేభ్యః మోక్షయిష్యామి." అని యభయమీయలేదా? ఇక భయమేల? మనవర్తనము కుంటుపడిన భయపడి తీరవలసినదే. అట్టివాడునుమా భగవంతుడు. ఆ భగవన్మహిమాను వర్ణనసందర్భమున నెట్టి మహాపురుషుల కీ ధోరణియే సిద్ధమగును. ఇందోంకారమునుగాని, బ్రహ్మమునుగాని స్పృశింపక సర్వేశ్వర సర్వజ్ఞత్వాదుల నేల స్పృశించెను. అని శంకితురేమో! యీమంత్రమునందు మున్మా రుపయోగింపబడిన 'సర్వ' శబ్దముచే పారిభాషికముగ ప్రణవబ్రహ్మములు నిర్వహింపబడినయవి. అయినను ప్రణవబ్రహ్మములు ప్రతీకమాత్రములని నిశ్చయింపుడు. ఇది ప్రణవబ్రహ్మాతీత స్వరూపానందానుభవ సమయసంజాత దివ్యవాణి. ఇతిశివమ్.

౭. మంత్రము

నాంతః ప్రజ్ఞం న బహిః ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం నప్రజ్ఞం నాప్రజ్ఞం, అదృష్ట మవ్యవహార్య మగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్య మేకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివ మద్వైతం చతుర్థం మన్యంతే సఆత్మా సవిజ్ఞేయః॥

తా॥ ఈ మంత్రమునందు ముఖ్యమగు వాక్యము 'సఆత్మా' అనియును తదనుబంధముగ "సవిజ్ఞేయః" అనియును కలదు. మొదటి

వాక్యము ఆత్మలక్షణనిర్వచనము చేయుచున్నది. రెండవవాక్యము ఆత్మ విజ్ఞేయమని సాధనోపాయమును చెప్పుచున్నది. ఈయాత్మ స్వరూపము ఎట్టిదో కొన్ని విశేషణములచేత నిరూపించెను. ఇందలి విశేషణములు నిషేధములుగను ప్రసిద్ధములుగను నేతివాక్యములుగను ఇతివాక్యములు గను నున్నవి. వర్తమానాద్వైతవేదాంతమునందు కేవల నేతివాక్య ములకు ప్రాబల్యమును పాటించుకొని యాభాసనాస్తికు లైపోవు చున్నారు. ప్రచ్ఛన్నబౌద్ధులని నిందింపబడుచున్నారు. నిజముగ నిషేధ ముఖమే బ్రహ్మతత్త్వ మనినయెడల బౌద్ధమత నిర్వాణవాదమువంటి వాదమే నిలువవలసివచ్చును. కొందరు బౌద్ధమతమునెడల కనికరము చూపి బౌద్ధమతము నాస్తికమతముకాదని తమ పాండిత్యప్రతిభవలన స్థాపించుచున్నారు. శాబ్దము ప్రమాణముగాదని వేదములు అప్రమా ణములని చెప్పనిశ్చయించినవారు నాస్తికులని మహర్షులు చెప్పవల యును. సంపూర్ణముగ పరమతత్త్వమును వాచోవిధేయము గావింప దలచెడు దుష్టతర్కములను ఉపనిషత్తులు స్పష్టముగ ఖండించు చున్నవి. కావుననే బౌద్ధులు ప్రమాణ పటువులని వర్ణింప బడినది. బౌద్ధులు ప్రమాణ ప్రమేయ సబంధ నిర్వాహణదక్షు లగు నెడల వైదికులు ప్రజ్ఞాన ప్రజ్ఞేయ సాతత్య సమరసు లని చెప్పవలయును. ఈమంత్రమునందు (1) ఏకాత్మ ప్రత్యయసారం (2) ప్రపంచోపశమం (3) శాంతం (4) శివమ్ (5) అద్వైతం. ఈ అయిదువాక్యములును శిష్యా నుగ్రహముకొరకు ఇతివాక్యములతో ఆ తత్త్వమును బోధించుచున్నవి. మిగిలిన విశేషణ వాక్యములెల్ల నిషేధవాక్యములే. కాని యీ నిషేధ వాక్యముల నన్వయించుటలో విద్వాంసులు కొందరు ప్రమాదపడినట్లు స్ఫురించుచున్నది. ఆ ఆత్మతత్త్వము అంతఃప్రజ్ఞముకాదు అని చెప్పుటచే బహిః ప్రజ్ఞము(విజ్ఞేయము)అని తట్టకమానదు. అట్లే బహిఃప్రజ్ఞముకాదు అనినప్పుడు అంతఃప్రజ్ఞము అని చెప్పవలసివచ్చును. నబహిరంతఃప్రజ్ఞము

అను వాక్యమువలన ఉభయవిలక్షణము అని చెప్పవలసివచ్చును. ఇట్లే అన్ని నిషేధ వాక్యములును నొక ప్రసిద్ధవాక్యజ్ఞానావగతికి నుపదేశింపబడియున్నవి. అట్లుపదేశింపబడక యుండినయెడల యీ మంత్రమునందలి కడపటివాక్యము 'సవిజ్ఞేయః' నిష్ప్రయోజనమగును. ఆత్మతత్త్వము అజ్ఞేయమయ్యు విజ్ఞేయము కావలయును. దీనినే గీతాధోరణిలో చెప్పవలయుననిన అతీంద్రియమయ్యు బుద్ధిగ్రాహ్యమగునయ్యును. కావుననే యెన్ని యోగము లవలంబించినను పరమార్థము నెఱుంగనివారై చాలమంది చెడిపోయిరని గీతాచార్యులు వగచి గీతాముఖమున బుద్ధియోగము నుపదేశించెను. ఆ బుద్ధియోగ సత్త్వ మూలాధారము లన్నియు నుపనిషత్తులందు సంగ్రహింపబడియున్నవి. ఆత్మతత్త్వము విజ్ఞేయమనుటచేతనే యీ యుపనిషత్తు చెప్పబడెను. ఈమంత్రమునకు పూర్వమున ఆత్మచతుష్పాత్తు అని చెప్పబడి యీ మంత్రమునందు ఏకప్రత్యయ సారముగ ఆత్మనెఱుంగుమని యుపదేశించుచున్నది. కావుననే యీమంత్రమునందు "చతుర్థంమన్యంతే" నాల్గవదానినిగ నెఱుంగుచున్నారు అని వ్యావహారికముగ బోధించి పరమార్థమున ఏకప్రత్యయసారమని నిర్ణయించెను. ఇంతవరకును అంతఃప్రజ్ఞ బహిఃప్రజ్ఞత్వాది లక్షణములతో వర్ణింపబడిన ఆత్మ వేరొకటియనియు, యిట్లు వర్ణింపబడిన ఆత్మ ఇంకొకటియనియు భ్రాంతిపడి ద్వైత భావాపన్నులగుదురేమో యని స్పష్టముగ అంతః ప్రజ్ఞముకాదు బహిఃప్రజ్ఞముకాదు అని పూర్వోక్తలక్షణములను విలక్షణములనుగా గ్రహించి బోధించుటచే యీమంత్రమునందలి ఏకప్రత్యయసారమును గ్రహింపవలెనని స్పష్టపరచుచున్నాడు. అనగా పరమాత్మ తత్త్వము అంతఃప్రజ్ఞమాత్రము, బహిఃప్రజ్ఞమాత్రము, నోభయతః ప్రజ్ఞమాత్రము, అని మాత్రశబ్దము నన్నింటికి నుపయోగించి నిషేధములను సమన్వయింప వలయునని ఏకాత్మ ప్రత్యయసారమును చూపుచున్నాడు. ఇంతవరకును భిన్నాత్మ

ప్రత్యయము బోధపడినది విశ్వాత్మ, తైజసాత్మ, ప్రాజ్ఞాత్మ అని భిన్న భిన్నముగ నుపన్యసించి అన్నింటి నీ మంత్రమునం దైక్యపరచుచున్నారు. అదియే ఏకాత్మప్రత్యయ సారము. ఈ ఏకాత్మప్రత్యయ సారమగునదియే ప్రపంచోపశమమై, శాంతమై, శివమై, అద్వైతమగును. ఈ ఆత్మతత్త్వ నిరూపణమునందు అల్పరూపమువరకును మహద్రూపమువరకును, జాగ్రదా ద్యవస్థాపన్నునకును, తదతీతునకును, జీవునకును, తదతీతునకును ఆత్మశబ్దమే వాడుటంబట్టి ఆత్మయే సర్వము గదాయని "శివ నేను నేనే శివము నేను బ్రహ్మనైయున్నాను, నేను శాశ్వతుడను అంతానేనే" అని చెప్పికొనెడు దురహంకారోద్ధారదుష్టాద్వైతమునకు దారితీసెను. అవస్థాపన్నాత్మయు తదతీతాత్మయు ఆత్మ వాచ్యము కాకుండినయెడల ఆ రెండిటికిని ఐక్య మసంభవమని యెఱిఁగి సమానమైన ఆత్మశబ్దమును ప్రయోగించి వాడుచున్నాడు. జీవాత్మ 'అంశము' గాని 'అంశి' కాదు. అంశమగు జీవాత్మ అంశిలోనుండు దగుటయే సాధనము. అంశిలోనుండిన అంశము స్వగతభేదముతో ఉన్నదాయని తర్కింతురు. ఈ తర్కము తర్కవాక్యముల ప్రకారము తప్ప తత్త్వముకాదు. అంశియైన సూర్యునినుండి అంశరూపముగ ప్రసరించిన నత్యంతసూక్ష్మ సూక్ష్మకిరణ పరీక్షయందు అంశియగు సూర్యుడే గ్రహింపబడుచున్నాడని సూర్యునియందు స్వగతభేదము చెప్పరాని యట్లు పరమాత్మయందు స్వగతభేదము చెప్పరాదు. కావున జీవుడు బ్రహ్మము కానేరడు. జీవుడు 'బ్రాహ్మము' అగును. ఈ ఘట్టమునందు రజ్జుసర్పములను బ్రహ్మజీవాభేదమునకై యుపమానముగ గ్రహింతురు. ఈ యుపమానము సర్వథా సమర్థముకాదు. జీవ, బ్రహ్మలు రెండును ఆత్మ వాచ్యములు. రజ్జుసర్పములు రెండును రజ్జువాచ్యములు కావుగదా! ఐనను రజ్జుసర్ప సంబంధ జ్ఞానము అధిష్ఠానభూత రజ్జుజ్ఞానమున కని చెప్పుకొన్నచో ప్రమాదము రాదు. అనుభవమునకును దూరము కాదు. త్రాటినిజూచి పాముని భ్రాంతిపడు వాడు గురుకృపవలన

పామకాదని త్రాడేయని తెలిసికొనినంత మాత్రముచేత పాము త్రాడై పోవదు. అట్లు పాము త్రాడైపోయినయెడల ఆ త్రాటియందు పాము గుణమును చూచుట కవకాశమే లేకపోయెడిది. అజ్ఞానికి త్రాటియందలి పాము భయాదికారణమై యొకప్పుడు మరణకారణ మును గావచ్చును. ఇట్టి సర్పభ్రాంతిజన్యమైన మహా భయనివారణమే రజ్జుజ్ఞానకారణముగాని, రజ్జుగత సర్పత్వాకృతి నిరాకరణముగానేరదు. అట్లే బహిఃప్రజ్ఞముగను అంతఃప్రజ్ఞముగను మొదలగు సంజ్ఞలచే వ్యవహ రింప బడిన ఆత్మ అంతః ప్రజ్ఞాది విలక్షణమై ఏకాత్మ ప్రత్యయ సార భూతమగునని అ ఆత్మవిజ్ఞేయమని యుపదేశించుచున్నది. ఈ ఆత్మ తత్త్వము అదృష్టమని నిర్వచింపబడినది. ఇది యదృష్టమేయగునెడల ఆత్మద్రష్టవ్యమను యుపదేశము నిరర్థకమగును కాబట్టి ఆత్మ దృష్ట మాత్రము కాదని యర్థము కావలయును. గీతల యందును లీలామానుష విగ్రహుడనై నన్ను మూఢు లవమానించు కొందురు. నాయొక్క పర మార్థము నెరుంగరు (9 అ–11 శ్లో.) అనియున్నది. కావుననే భగవంతుని విశ్వరూపము ఘోరరూపమై మహద్రూపమై సుందరరూపమై అర్జునునకు కన్పట్టెను. దృష్టమును, అదృష్టమును అదియే అనుదానిని నిశ్చయించు కొనవలయును. ఆత్మ అవ్యవహార్యము అనుదానికి కేవల వాచోవిధే యము కాదని యర్థము. నిజముగ అవ్యవహార్యమే యగునెడల యీ యుపనిషత్తునకు వాగ్వ్యవహార ప్రసక్తియే లేకపోవలసివచ్చును. అగ్రాహ్యమను నప్పుడుగూడ “ఆత్మ ఇంతటిది, ఇట్టిది” అని కేవల ప్రమాణప్రమేయఫలకనిరూపణమున కందనిది అనిచెప్పవలయును. అట్లు చెప్పకున్నచో బుద్ధి గ్రాహ్యమన్న వాక్యము ప్రమత్తము కావలసి వచ్చును. ఆత్మనిధిధ్యాసితవ్యమను వాక్యము నిష్ప్రయోజనము కావలసి వచ్చును కావున కేవల మగ్రాహ్యముకాదు. ఇంతయేల వేదాంత శాస్త్ర మందుగల సకల నిషేధవాక్యములును. కేవలముకాదు, అనునర్థమునంటే

సమన్వయింపవలయును. నిరాహారశబ్దమునకు నియతాహారార్థము ఎట్లు చెప్పబడెనో అట్లే నిషేధవాక్యము లన్వయించుకొనవలయును. అలక్షణము, అచింత్యము, అని చెప్పుటవలన, లక్ష్యము కానేరదనియు, చింత్యము కానేరదనియు అర్థము చెప్పుట తప్పు. అచింత్యః అనుదానికి అజ్ఞేయః అనిఅర్థము చెప్పుకొని ఆ అజ్ఞేయమువిజ్ఞేయము కావలెనని సమన్వయించుకొనవలెను కాకున్న యీమంత్రము కుతంత్రము. అట్లే అవ్యపదేశ్యమను విశేషణమునకును అర్థము గలదు. నిజముగ ఆత్మ అవ్యపదేశ్యమే యగునెడల "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" "ఓమిత్యుపాసీత" "ఓమితిదాత్మా" యీ మొదలగు వాక్యములు వ్యపదేశించుట వృథాశ్రమ మనవలయును. అందుముఖ్యముగ ప్రణవోపాసనమునకై యవతరించిన యీ యుపనిషత్తు మరియు నిష్ఫల మనవలయును. కావున ఆతత్త్వము అవ్యపదేశ్యము కాదు. ఓం కార రూపమైన ప్రతీకముచే వ్యపదిష్టమగుచున్నది. అవ్యపదేశ్యమనగా, కేవల మోంకారమాత్రముగాదనియే యర్థము చెప్పుకొనవలయును. ఓంకారము సన్నిహితము; తదితరము దూరము అనియర్థము. ఇంతవరకును ఆత్మ తత్త్వము బ్రహ్మవాచ్యమై, అవచ్ఛేద కావచ్ఛేద్యత్వదోషము లేనిదమై నిర్వహింపబడెను. ఇంక ఏకాత్మ ప్రత్యయసారమని ఇతిబోధమును చేయుచున్నాడు. విభక్తముగ కానవచ్చినను, విభక్తమున ఏకరూప మని చెప్పుచున్నాడు. గీతలయందును "జ్ఞానము, అపోహనము, స్మృతి, భ్రాంతి, మున్నగునవి నావలననే (అ 15 - శ్లో 15) అని యుపదేశింప బడియున్నది. అనగా అవిభక్తమై, సంసక్తమై, సంపూర్ణమైయుండిన తదాధారముననే విభక్తాదులు వ్యవహారమున స్వానుభవమునకు వచ్చు చున్నవని యర్థము. 'నేనీకుండ నెరుంగుచున్నాను' అను కుండయొక్క ఎరుక అనెడు ఘటాకారక జ్ఞానాధిష్ఠానము ఆత్మయే యగుటవలన, ఆత్మ ఏకప్రత్యయ సారమని సంగ్రహముగ నుపదేశించు చున్నాడు. ఇందలి

ప్రపంచోపశమ శబ్దమునకు, ప్రపంచ ప్రణాశమనియు, ప్రళయమనియు అర్థములు చెప్పుకొనుచున్నారు. అదితప్పు. నిద్రాదశయందు ప్రపంచోపశమ మనుభవమెట్లో అట్లే ప్రపంచోపశమలక్షణమును చెప్పుకొనవలయును. కావుననే జీవునకుగూడ జాగరితస్థానమును, సుషుప్తస్థానమును పొందుటయుం దిష్టమును లీలారూపమున ననుభవమగుచున్నది. ఈ ప్రపంచోపశమశబ్దమునకే శాంతమని యర్థము చెప్పుకొనవలయును. ఆ 'శాంతిము' రసవాచ్యమని తెలిసికొనుడు. కావుననే అది శివమని చెప్పుచున్నాడు. శాంతమగునదియే శివవాచ్యమగును. శివమనగా మంగళమని యర్థము. భగవత్తత్త్వముకంటె మంగళమైనది మరియొకటియునుగాదు అదియే అద్వైతము. ఇందలి యద్వైతశబ్దమును గ్రహించుకొని నేనేబ్రహ్మమును అనెడు వెర్రికేకలు వేయరాదు. భగవత్స్వరూపమైనది వేరొకటిలేదని యర్థము. ఈయద్వైతవిశేషణమును తీసికొని కొందరునిరోధములేదు ఉత్పత్తిలేదు బంధములేదు మోక్షములేదు సాధనములేదు సాధకుడులేడు గురువులేడు శిష్యుడులేడు మండూక్యోపనిషత్తు లేదు మట్టిగడ్డలు లేవు అని లేనిలో కొట్టుకొనుచున్నారు. అందరికిని జిలుగులు వారికి గానరావు. కావున నద్వైతమనగా సకలభావములకును సన్మాత్ర తత్త్వము ననుభవించుటయని యర్థము. అట్లగుచో మాది సర్వాస్తివాదమా యని యొకనామకరణము చేయనక్కరలేదు. భగవత్తత్త్వమద్వైతము. వేదములయందు "సన్మూలాః ఇమాః ప్రజాః" అని సన్మూలము నిరూపింపబడెను. ఇంక చతుర్థము అనువిశేషణము మాత్రము మిగిలియున్నది. ఈ విశేషణమువలన యీ మంత్రమునం దుపదేశింపబడిన తత్త్వము పూర్వమంత్రవిలక్షణమైనదని యర్థముచెప్పరాదు. అట్లు చెప్పరాదని "స ఆత్మా" అనువాక్యముతో నుపసంహరించుచున్నాడు. ఆత్మ సంజ్ఞ గలదియెల్లనిదియే సుమాయని చెప్పుచున్నాడు. కావుననే దీనికి తురీయ

మని సంజ్ఞ. 'చతుర్థపదము' 'మన్యంతే' అనుపదముతో నన్వయింప వలసివచ్చునుగాన చతుర్థత్వమునకు ప్రాధాన్యము చెప్పవలయును. "స ఆత్మ సవిజ్ఞేయః" ఈ రెండు వాక్యములును పూర్వోపదిష్టమైన తత్త్వమును సమగ్రోప సంహారము చేయుటకై చెప్పబడినవి. ఆ ఆత్మ 'సః' అను విఖ్యాతార్థముతో వర్ణింపబడియున్నది. అదియే ఓంకారము. ఓంకార మును ప్రతీకముగ చేసుకొని ఆ ఆత్మ యొక్క రూపము నెఱుంగవలయును అని "సవిజ్ఞేయః" అను వాక్యములో నుపదేశించు చున్నాడు. ఇందలి సమన్వయము కష్టమగుటంబట్టియే గురువుల నాశ్రయింప వలయునని సంప్రదాయమున్నది. గీతలయందును "తత్త్వదర్శులు నీకుపదేశింతురు" (4-34)" గురువును పొందుము అని వేదమునందును చెప్పబడియున్నది. గురుపరంపరలోని ఆపరమార్థము నెఱుగకయే ప్రణిపాత పరిప్రశ్న సేవాదికముల చేయనొల్లక తమ హృదయ కుహరాంతరాళములయం దారాధింపబడుచున్న దురహంకార బ్రహ్మరాక్షస పీడితులై పాండిత్య మును పరోక్షముగ గ్రంథావలోకనమును మాత్రమే నమ్ముకొని కొందరు పాడగుచున్నారు. అట్టివారే వాయువే బ్రహ్మమనుకొనుచు, ఇంద్రుడే బ్రహ్మమనుచు, చంద్రుడే బ్రహ్మమనుచు, సూర్యుడే బ్రహ్మమనుచు, ఏదియో యగోచరతత్త్వమే బ్రహ్మమనుచు తలతిక్క నిర్ణయములలో తులతూగుచున్నారు. ఆ తూగెడివారి కెట్లుతూగనిందు. మంత్రమునందు- "అయమాత్మా బ్రహ్మ సోఽయమాత్మా చతుష్పాత్ సవిజ్ఞేయః" అనువాక్యములు పరస్పరాన్వయములతో కూర్పబడియున్నవి. కావు ననే జ్ఞేయత్వము వివేకపూర్వకముగ ఉత్తరమంత్రమునుండి యారం భించుచున్నాడు. ఇతిశివమ్

౮. మంత్రము

సో౽యమాత్మా౽ధ్యక్షర మోంకా
రో౽ధిమాత్రం పాదామాత్రా మాత్రాశ్చ
పాదా అకార ఉకార మకారఇతి

